ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం
గురువారం 25, జూలై 2024

ఊహించని ధరలు.. ముమ్మరంగా కొనుగోళ్లు.. బేళ్ల కోసం బయ్యర్లు పోటీ.. ఇలా జోరుగా పొగాకు మార్కెట్ సాగడంతో మురిసిపోయిన రైతులు ప్రస్తుతం అయోమయంలో పడిపోయారు. ఉత్పత్తి అయిన అధిక పంట కొనుగోలు విషయంలో కేంద్రం నుంచి స్పష్టత రాకపోవడం, అనుమతించిన మేర పంట కొనుగోళ్లు పూర్తయ్యాయని బోర్డు అధికారులు వేలం కేంద్రాలు నిలిపివేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. మళ్లీ పంట సాగుకు సమయం సమీపిస్తున్నా ఇంకా పాత సీజన్‌లో పండిన దానిలో మూడో వంతుకుపైగా రైతుల వద్దనే ఉంది. దాని అమ్మకాలపై వారిలో ఆందోళన నెలకొంది. ఇదేఅదునుగా వ్యాపారులు అక్రమ కొనుగోళ్ల జోరు పెంచారు. డబ్బు అవసరమైన కొందరు రైతులు చాటుమాటుగా అమ్ముకుంటున్నారు. కేంద్ర వాణిజ్యమంత్రిత్వ శాఖ నుంచి సకాలంలో అనుమతులు తెప్పించడంలో సఫలీకృతం కాలేకపోయిన బోర్డు అధికారులు.. అక్రమ కొనుగోళ్లను నియంత్రించడంలోనూ విఫలమయ్యారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

జోరుగా అక్రమ కొనుగోళ్లు

రైతుల వద్ద పొగాకు నిల్వలు ఉండటం, బోర్డు స్పష్టతనివ్వకపోవడంతో కొందరు వ్యాపారులు అక్రమ కొనుగోళ్లకు తెరతీశారు. ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో కిలో రూ.350 వంతున కొంటున్నారు. డబ్బు అవసరమైన రైతులు కొందరు వీరికి అమ్ముకుంటున్నారు. అయితే అధికోత్పత్తి అమ్మకాలపై కేంద్రం నుంచి సకాలంలో అనుమతులు తీసుకురాలేకపోయిన బోర్డు అధికారులు.. అక్రమ కొనుగోళ్లను కూడా నియంత్రించలేకపోతున్నారు. ఈ పరిస్థితులు రైతులను తీవ్ర ఆందోళన, అయోమయానికి గురిచేస్తున్నాయి. తక్షణం ఇటు ప్రజాప్రతినిధులు, అటుబోర్డు ఉన్నతాధికారులు స్పందించకపోతే నష్టపోతామని వారు వాపోతున్నారు.





'అదనం'పై అపరాధ రుసుం రద్దు చేయాలి

కేంద్ర వాణిజ్య మంత్రిని కోరిన కూటమి ఎంపీలు

ఎన్‌ఎల్‌ఎస్‌లో కిలో రూ.400 పలుకుతున్న గరిష్ఠ ధర

ఒంగోలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రస్తుత సీజన్‌లో అదనంగా ఉత్పత్తి అయిన పొగాకు పంటపై పెనాల్టీలు రద్దుచేసి తక్షణం కొనుగోలు చేయాలని పలువురు ఎంపీలు కేంద్రాన్ని కోరారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి చొరవతో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయులు, రాజమండ్రి ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈ విషయమై బుధవారం పార్లమెంట్ హాలులో వాణిజ్యశాఖ మంత్రి పియూష్‌గోయల్‌ను కలిసి మాట్లాడారు. ఈఏడాది రాష్ట్రంలో వాతావరణం అనుకూలించడంతో పొగాకు బాగా పండిందన్నారు. దక్షిణాదిలో బోర్డు అనుమతించిన మేర పంట కొనుగోళ్లు పూర్తికాగా అదనంగా ఉత్పత్తి అయిన పొగాకు రైతుల వద్దనే నిలిచిపోయిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణాది కేంద్రాలలో వేలం కూడా నిలిచిపోయి ఉందని చెప్పారు. గతంలో ఇలా పంట ఉత్పత్తి పెరిగిన సందర్భంలో పెనాల్టీలను రద్దు చేసి మొత్తం పంటను కొనుగోలు చేశారని గుర్తు చేశారు. ఆమేరకు పొగాకు బోర్డును ఆదేశించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి పియూష్ గోయల్ తక్షణం అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.





- పూర్తి కాని పొగాకు కొనుగోళ్లు
- మళ్లీ సాగుకు సమయం ఆసన్నం
- రైతుల వద్దనే ఇంకా మూడో వంతు పంట
- అధికోత్పత్తిపై తేల్చని కేంద్ర ప్రభుత్వం
- ఆందోళనలో రైతులు
- ఇదేఅదునుగా వ్యాపారుల అక్రమ కొనుగోళ్లు
- అవసరాల కోసం అమ్ముకుంటున్న కొందరు
- నియంత్రించడంలో బోర్డు అధికారుల విఫలం

అంతా అయోమయం

ఒంగోలు (ఆంధ్రజ్యోతి)/కొండపి, జూలై 24 : రాష్ట్రంలో 2023-24 సీజన్‌లో 142 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతించింది. అందులో దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాల్లో 86.97 మిలియన్ కిలోలు పండించాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతంలో అనుమతించిన దానికన్నా సుమారు 15వేల హెక్టార్లకుపైగా విస్తీర్ణంలో రైతులు పంట సాగు చేయడంతో దిగుబడి కూడా పెరిగింది. సుమారు 140 మిలియన్ కిలోల పంట ఉత్పత్తి వచ్చింది. ఆమేరకు అంచనా వేసిన బోర్డు అధికారులు ఫిబ్రవరి 29న కొన్నింటిలో, మార్చి 6న మిగిలిన కేంద్రాల్లో వేలం ప్రారంభించారు. తొలిరోజు గరిష్ఠ ధర కిలో రూ.230 లభించగా క్రమంగా పెరిగి రూ.366కు చేరింది. మీడియం, మేలు రకం తేడాలేకుండా ధరలు లభించగా లోగ్రేడ్‌కు సైతం భారీ డిమాండ్ ఏర్పడింది. గతంలో ఎన్నడూ లేనంతగా పలుకంపెనీల బయ్యర్లు పోటీపడటంతో సగటు ధర కిలో రూ.252పైగా లభించింది. అలా పొగాకు మార్కెట్ జోరుగా సాగింది. అయితే మూడువారాల నుంచి కొనుగోళ్లు నిలిచిపోయాయి.

బ్యారన్‌కు సరాసరి 40 క్వింటాళ్ల అదనపు పంట

ప్రస్తుతం రైతుల వద్ద బ్యారన్‌కు సరాసరి 40 క్వింటాళ్ల వరకూ అదనంగా పండించిన పొగాకు నిల్వలు ఉన్నాయి. అనుమతించిన మేర పంట అమ్మకాలు పూర్తయ్యాయి. దాని ద్వారా వచ్చిన సొమ్ము బ్యాంకు రుణాలు, కూలీల ఖర్చులకు పోగా, ప్రస్తుతం విక్రయించే పొగాకుపైనే రైతులు ఆశగా ఉన్నారు. మొత్తం అమ్మకాలు పూర్తయితేనే లాభనష్టాల లెక్కలు తేలతాయని వారు అంటున్నారు. వచ్చే నెలలో తిరిగి పొగాకు నారుమడులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. అదనంగా పండించిన పొగాకుకు సంబంధించి మరో వారంలో అనుమతులు వచ్చినా విక్రయాలు పూర్తయ్యే సరికి దాదాపు 50 రోజుల వరకు పట్టొచ్చని మార్కెట్, రైతు, అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

రైతుల వద్దే 49 మిలియన్ కిలోల పొగాకు

దక్షిణాదిలో వేలం నిలిచిపోయే నాటికి ఇంచుమించు 91 మిలియన్ కిలోల పంట కొనుగోలు జరిగింది. ఇంకా 49 మిలియన్ కిలోల పొగాకు రైతుల ఇళ్ల వద్ద ఉండిపోయింది. వేలం నిలిపివేసే సమయంలో అనుమతి ఇచ్చిన మేర కొనుగోళ్లు పూర్తయ్యాయని, అధికోత్పత్తి విషయమై అనుమతి కోసం కేంద్రానికి లేఖ రాశామని అధికారులు ప్రకటించారు. అయితే రోజులు గడుస్తున్నా అనుమతులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్య ఇలా ఉండగా వచ్చే సీజన్ పంట ఉత్పత్తిని పొగాకు బోర్డు ఆరు రోజుల క్రితం ఖరారు చేసింది. అంటే రానున్న సీజన్‌కు రైతులు సిద్ధమయ్యే సమయం ఆసన్నమవుతున్న విషయాన్ని గుర్తించారు. అయినా అధికోత్పత్తి కొనుగోళ్లపై కేంద్రం నుంచి స్పష్టత రాలేదు.

ఎన్‌ఎల్‌ఎస్‌లో కిలో గరిష్ఠ ధర రూ.400

దక్షిణాది కేంద్రాల్లో అధికారిక పంట విక్రయాలు పూర్తయి వేలం ఆగిపోగా ఉత్తరాది రీజియన్‌లో మాత్రం అధికారిక కొనుగోళ్లు ఇంకా కొనసాగుతున్నాయి. అక్కడ మేలు రకం పొగాకుకు భారీ డిమాండ్ ఏర్పడింది. గరిష్ఠ ధర ఏకంగా కిలో రూ.400 పలుకుతోంది. దక్షిణాదిలో ఇప్పటి వరకూ కిలో గరిష్ఠ ధర రూ.366 మాత్రమే లభించింది. దీంతో తక్షణం అధికోత్పత్తి అయిన పంట కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.



పెనాల్టీ లేకుండా పంట కొనుగోలు చేయాలి

ముప్పరాజు శివన్నారాయణ, పొగాకు రైతు, కొండపి

పొగాకు ఉత్పత్తి వ్యయం ఏటికేడు రెట్టింపవుతోంది. కూలి రేట్లు, పొలాలు, బ్యారన్‌ల కౌలు గణనీయంగా పెరిగాయి. బోర్డు అనుమతిస్తున్న మేర పంట విక్రయం ద్వారా వచ్చే డబ్బులు తెచ్చిన అప్పులకు, కూలీలకు సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో అదనపు పొగాకును ఎటువంటి అపరాధ రుసుం లేకుండా విక్రయించుకోవడానికి అనుమతిస్తేనే కొంత వరకు గిట్టుబాటు అవుతుంది. ఆలస్యమైతే పొగాకు నాణ్యత తగ్గి రైతులకు మరింత నష్టం వాటిల్లే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం వెంటనే అదనపు పొగాకు అమ్మకాలకు అనుమతులు ఇవ్వాలి.

ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కలెక్టర్ తమీమ్‌అన్సారియా

- అవకాశం లేని పనులపై ముందే స్పష్టత
- అభివృద్ధిలో అన్ని రంగాలకు ప్రాధాన్యం
- అవినీతి, అశ్రద్ధను సహించను
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ తమీమ్ అన్సారియా

90 రోజుల్లోపు సమస్య పరిష్కారం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

'అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తా. ఏరూపంలో సమస్యను నా దృష్టికి తీసుకొచ్చినా 90 రోజుల్లోపు పరిష్కారం చూపిస్తా. వీలైతే అదే రోజు తీరుస్తా. అసలు అవకాశం లేకపోతే ఆవిషయాన్ని ముందే చెప్తా. జిల్లా పరిధిలోనిది కాకపోతే ఏంచేయాలో తెలియజేస్తా. ప్రతి అధికారి, ఉద్యోగితో ఎలా పనిచేయించుకోవాలో నాకు తెలుసు. అవినీతి, అశ్రద్ధను సహించను' అని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. బుధవారం ఆమె ఆంధ్రజ్యోతిప్రతినిధితో మాట్లాడారు. అనేక అంశాలపై స్పష్టత ఇచ్చారు. సమయపాలన, స్వీయపరిశీలనకు ఆమె ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. అధికారులతో నిత్యం సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇలా ఎంతకాలం సాధ్యమని ప్రశ్నించగా వృత్తిలో ఉన్నంతకాలం అలాగే ఉండటం, ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యమన్నారు. అన్ని రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. సంక్షేమ హాస్టళ్లలో అవసరమైన మౌలిక సౌకర్యాలకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. సాగునీటి రంగానికి సంబంధించి ఆమె మాట్లాడుతూ 'వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంపై అధ్యయనం చేశా. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తున్నా. గుండ్లకమ్మ, రామతీర్థం రిజర్వాయర్ సందర్శన అందులో భాగమే. మూలనపడిన తాగునీటి పథకాల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇస్తా. ఇటు తాగునీటి పథకాలపై ప్రత్యేక పరిశీలన చేస్తున్నా. దర్శిలోని ఎన్‌ఏపీ స్కీం సందర్శన అందులో భాగమే. వ్యవసాయాధార జిల్లాలో రైతులు, రైతు కూలీల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ పథకాలు జోడించి పనిచేయడమే నా లక్ష్యం' అని అన్సారియా స్పష్టం చేశారు.

ఎలా పనిచేయించుకోవాలో తెలుసు

జిల్లాలోని అధికారులు, ఉద్యోగులతో ఎలా పనిచేయించుకోవాలో తెలుసని కలెక్టర్ చెప్పారు. గ్రామ, మండలం నుంచి జిల్లాస్థాయి వరకూ బాగా పనిచేసే అధికారులే రావాలని కోరుకుంటున్నానన్నారు. జిల్లాలోని మంత్రులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని ముందుకెళ్తానన్నారు. అటు ప్రజాప్రతినిధులు, ఇటు ప్రజల నుంచి మంచి సహకారం లభిస్తున్నదన్న ఆమె దాన్ని నిలుపుకునేందుకు యంత్రాంగం పరిధిలో లోపం లేకుండా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.

వెనుకబడిన జిల్లాకు నిధులు పెంచాలి

లోక్‌సభలో కోరిన ఎంపీ మాగుంట


ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 24 : వెనుకబడిన ప్రకాశం జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కోరారు. బుధవారం లోక్‌సభలో ఆయన మాట్లాడారు. గుంటూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలతో ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేయడంతో అన్ని రంగాల్లో ఇంకా వెనుకబడి ఉందన్నారు. జిల్లాకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలని కోరారు. ప్రస్తుతం జనాభా పెరిగినందున కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన రూ.50 కోట్లు సరిపోవన్నారు. ఇంకా పెంచాలని ప్రణాళిక శాఖ సహాయమంత్రి ఇంద్రజిత్ సింగ్‌ను మాగుంట కోరారు. ఏపీ రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశంను చేర్చి నిధులు కేటాయించినందుకు ప్రధాని మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌కు, నిధుల కేటాయింపునకు కృషిచేసిన సీఎం చంద్రబాబుకు మాగుంట కృతజ్ఞతలు తెలిపారు.



హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లో అక్రమాలు

నేడు వైద్యశాఖ కార్యాలయంలో ఆర్డీ విచారణ

2002 నుంచి నియమితులైన వారు రావాలని ఆదేశం

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 24 : వైద్యారోగ్యశాఖలో హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో వారు విచారణకు ఆదేశించారు. ఈమేరకు వైద్యశాఖ ఆర్డీ గురువారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ చేయనున్నారు. 2002 నుంచి ఇప్పటి వరకు హెల్త్ అసిస్టెంట్లుగా నియమితులైన వారంతా ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేసమయంలో జిల్లాలోని పీహెచ్‌సీల్లో పనిచేసే ఉద్యోగులు కూడా రావాలని ఆదేశించారు.

పల్లామల్లి సొసైటీ విచారణాధికారిగా శివచైతన్య

డీసీవో శ్రీనివాసులరెడ్డి ఉత్తర్వులు

ఒంగోలు (విద్య), జూలై 24 : చీమకుర్తి మండలం పల్లామల్లి సొసైటీలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణాధికారిగా ఒంగోలు సబ్ డివిజనల్ సహకారాధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.శివచైతన్య నియమితులయ్యారు. ఆమేరకు జిల్లా సహకారాధికారి బి.శ్రీనివాసులరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. సొసైటీ పూర్వ విచారణాధికారి అయిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ బీవీఎస్‌శాస్త్రి సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో శివచైతన్యను నియమించారు. విచారణను త్వరితగతిన పూర్తి చేసేందుకు సహాయకుడిగా సీనియర్ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులును నియమించారు. సొసైటీలో అవకతవకలు, అవినీతి, అక్రమాలపై విచారణ చేసి రెండు నెలల్లో నివేదికను సమర్పించాలని డీసీవో ఆదేశించారు.



ఎస్పీ దామోదర్

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేదు

- రాజకీయ హింసకు అవకాశం ఇవ్వను
- రౌడీల ఆట కట్టిస్తా
- ప్రజాప్రతినిధులు సహకరిస్తారని ఆశిస్తున్నా
- ప్రజలకు చేరువగా పోలీసులు
- 'ఆంధ్రజ్యోతి'తో ఎస్పీ దామోదర్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

'శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడేది లేదు. సర్వీసు ప్రారంభంలోనే మున్నా కేసును ఛేదించా. తీవ్రవాదులనూ ఎదుర్కొన్నా. ఈ రౌడీమూకలను అణచివేయడం క్షణాల్లో పని. రాజకీయ హింసకు ఏమాత్రం అవకాశం ఇవ్వను. నా శిక్షణ అంతా ఈ జిల్లాలోనే జరిగింది' అని ఎస్పీ దామోదర్ పేర్కొన్నారు. ఇటీవలే బాధ్యతలు చేపట్టిన ఆయన పోలీసుశాఖను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు సంస్కరణలకు శ్రీకారం పలికారు. బుధవారం ఆంధ్రజ్యోతిప్రతినిధితో మాట్లాడారు. 2007లో గ్రూప్-1 అధికారిగా డీఎస్పీ హోదాలో పోలీసుశాఖలో చేరిన తాను 2008లో శిక్షణకాలాన్ని జిల్లాలో గడిపినట్లు చెప్పారు. ఒంగోలు, కనిగిరి, మార్కాపురం, దర్శి, చీరాల, కందుకూరు ప్రాంతాల్లో పనిచేశానని తెలిపారు. ఆతర్వాత తెలంగాణ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో పనిచేసి ఉద్యోగోన్నతి పొందానన్నారు. అదనపు ఎస్పీగా తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కువ కాలం బాధ్యతలు నిర్వర్తించానన్నారు. విశాఖపట్నం డీసీపీ, విజయనగరం ఎస్పీగా పనిచేసినట్లు చెప్పారు. నాలుగుమాసాల నుంచి ఒంగోలు పోలీసు శిక్షణకేంద్రం ప్రిన్సిపాల్‌గా పనిచేశానన్నారు. 2009లో ఒంగోలులో లారీ డ్రైవర్లను హత్యచేసి ఇనుప సామగ్రి దొంగలించిన కేసుల్లో మున్నా బ్యాచ్‌ను తానే అరెస్టు చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. జిల్లాపై పూర్తి అవగాహన ఉందని, రౌడీమూకల ఆటకట్టిస్తానని స్పష్టంచేశారు. ఓ ప్రశ్నకు బదులుగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు సహకరిస్తారని నమ్ముతున్నట్లు తెలిపారు. అవసరమైతే నిజనిజాలను వారి దృష్టికి తీసుకెళ్లి రౌడీలకు వారు ఎలాంటి రక్షణ ఇవ్వకుండా చూస్తానన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసి వారిని అణచివేయడంలో కీలకపాత్ర పోషించిన తనకు రౌడీమూకలను ఏరివేయడం పెద్ద పనికాదని స్పష్టం చేశారు. రాజకీయ వైషమ్యాలను ఆదిలోనే అణచివేస్తానని తెలిపారు. అవసరమైన సమాచారాన్ని ఇచ్చే నిర్దిష్ట వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటానని చెప్పారు. రాజకీయ సిఫార్సులకు తావుండదన్న ఆయన.. శాంతిభద్రతలను రక్షించడంతో అటు ప్రజాప్రతినిధులు, ఇటు పోలీసు వ్యవస్థ ప్రజల మద్దతు పొందగలుగుతుందని తెలిపారు. ఒక ప్రశ్నకు బదులుగా ప్రజాప్రతినిధులతో సమన్వయంగా సాగుతూ సామాన్య ప్రజలకు చేరువగా పోలీసు యంత్రాంగాన్ని ముందుకు తీసుకెళ్తానన్నారు. మంచి పని చేసే అధికారులకే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందన్న ఆయన.. ఇక్కడికి ఎవరు వచ్చినా ఎలా పనిచేయించుకోవాలో నాకు తెలుసన్నారు. త్వరలో పోలీసు, ప్రజలమధ్య సమన్వయ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు.

400 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ

ఎస్పీకి ఫిర్యాదు చేసిన విద్యుత్ అధికారులు

ఒంగోలు (క్రైం), జూలై 24 : జిల్లాలో గత నాలుగేళ్లలో 400 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయని ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆశాఖ అధికారులు ఎస్పీ దామోదర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ కావడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వెంటనే స్పందించిన ఎస్పీ పోలీసు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగలను త్వరితగతిన పట్టుకోవాలని ఆదేశించారు. ఇకముందు అలాంటివి చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీని కలిసిన వారిలో విద్యుత్‌శాఖ విజిలెన్స్ సీఐ బీటీ నాయక్, ఏఈ సంతోష్ ఉన్నారు.


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎస్ఈ సత్యనారాయణ



చెరువులకు చేరుతున్న నీరు

- పుష్కలంగా సాగర్ జలాలు
- మంచినీటి చెరువులకు పంపింగ్ చేస్తున్న అధికారులు
- మరో ఐదు రోజులు సరఫరాకు అవకాశం
- రామతీర్థం జలాశయంతోపాటు జిల్లాలోని అన్ని నీటి వనరులను నింపుతున్న అధికారులు

లోపలి పేజీల్లో

దర్శి ఎన్‌ఏపీ చెరువుకు మోటార్ల ద్వారా పంపింగ్ అవుతున్న నీరు



కర్నూలురోడ్డులో గోతులు





కర్నూలురోడ్డులో కేబుల్‌కోసం అడ్డంగా తవ్విన గోతులు



మామిడిపాలెం రోడ్డు ఇలా..

ప్రయాణం..నరకప్రాయం!

నగరంలో ఐదేళ్లుగా అభివృద్ధిని విస్మరించిన వైసీపీ పాలకులు

నగరపాలక నిర్లక్ష్యానికి నిదర్శనం



గద్దలగుంటపాలెంలో సీసీరోడ్డు మట్టిరోడ్డులా..

ఒంగోలు నగరపాలక సంస్థ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ప్రణాళిక లేని పనులు కారణంగా నగరంలోని రహదారులు అధ్వానంగా మారాయి. పైపులైను రిపేరు పేరుతో, ఇంటర్నల్ కేబుల్ వేసేందుకు ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేసిన గుంతలు ప్రజలను ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. మరోవైపు టీడీపీ హయాంలో వేసిన రోడ్లు తప్ప అవసరమైన ప్రాంతాల్లో పట్టించుకోని గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారులు ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేయడంతో ప్రజాధనం వృధా కావడమే కాకుండా ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఈ కారణంగా పాదచారులు, వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అడ్డగోలుగా తవ్వి వదిలేని గోతులు, ప్యాచ్ వర్క్‌లు కూడా లేని రహదారులు, నగరంలో వీధికొక్కటి దర్శనమిస్తున్నాయి. అయితే తాజాగా జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయంతో ఒంగోలు అభివృద్ధిపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

\- ఒంగోలు కార్పొరేషన్



భాగ్యనగర్‌లో రోడ్డు బురదమయంగా..





వుడ్‌కాంప్లెక్సు వద్ద అధ్వానంగా ఉన్న సర్వీసు రోడ్డు, ఇబ్బందిపడుతున్న వాహనదారులు

ధర్నా చేసే అర్హత జగన్‌కు లేదు

బాబాయిని చంపినప్పుడు ఎందుకు చేయలేదు..

టీడీపీ నాయకుడు సుబ్బారావుగుప్తా ధ్వజం



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సుబ్బారావుగుప్తా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 24: రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీలో ధర్నా చేసే అర్హత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఎక్కడ ఉందని తెలుగుదేశం పార్టీ నాయకుడు సోమిశెట్టి సుబ్బారావు గుప్తా ప్రశ్నించారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట బుధవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒంత బాబాయి వివేకానందరెడ్డిని హత్య చేస్తే జగన్ ఎందుకు ధర్నాలు ఎందుకు చేయలేదన్నారు. ఇప్పటికైనా తన తప్పులను ఒప్పుకొని ఉంటే మంచిదని, ఇదే విధంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు. జగన్ వద్ద ముగ్గురు ఎంపీలు కూడా లేరన్నారు. వారు కూడా వైసీపీలో ఉంటారా లేదో తెలియదన్నారు. డాక్టర్ సుధాకర్‌బాబును అన్యాయంగా చంపినప్పుడు ఎందుకు ధర్నా చేయలేదని, యర్రగొండపాలెంలో ఆర్యవైశ్య కులానికి చెందిన వ్యక్తిని దారుణంగా హత్య చేస్తే పట్టించుకోలేదని గుప్తా మండిపడ్డారు. ప్రజలను పక్కదారి పట్టించేందుకు జగన్ ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కాగా ధర్నాకు ముస్లిం జాగరణ్ మంచ్ నాయకుడు బుజ్జి, టీడీపీ రాష్ట్ర నాయకుడు అడకా స్వాములు సంఘీబావం తెలిపారు.

కౌలుకార్డుల ద్వారా ప్రయోజనాలు

● డీఏవో శ్రీనివాసరావు



కౌలుకార్డులను అందజేస్తున్న డీఏవో శ్రీనివాసరావు

మద్దిపాడు, జూలై 24: కౌలుకార్డుల ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని డీఏవో ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం రాచవారిపాలెం గ్రామంలో కౌలు రైతుల గ్రామసభను ఏవో రమేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ పొలాలు కౌలుచేసుకునే రైతులు తప్పనిసరిగా వ్యవసాయ, రెవెన్యూశాఖ ద్వారా కౌలుకార్డులు పొందాలన్నారు. వీటి ద్వారా రాయితీ, 5 మంది కలిసి ఒక గ్రూపుగా ఏర్పడితే బ్యాంకు రుణాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన రైతులు, రబీ సీజన్‌లో సాగు చేసేవారు కూడా ఈ కార్డులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రమేష్, ఏఈవో వెంకట శేషారావు, వీఏఏ చాందిని పాల్గొన్నారు. 10మంది కౌలు రైతులకు కార్డులను పంపిణీ చేశారు.

పనిచేయని ఈవీఎంలు బెంగళూరుకు..



ఈవీఎంలను పరిశీలిస్తున్న డీఆర్వో, రాజకీయ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 24: సార్వత్రిక ఎన్నికల కోసం తీసుకువచ్చిన వాటిల్లో పనిచేయని ఈవీఎంలను బెంగళూరుకు తరలించారు. ఒంగోలు నగరం మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్ నుంచి రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ప్రత్యేక వాహనంలో బుధవారం ఈవీఎంలను డీఆర్వో విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో పంపించారు. ఎన్నికల ముందు పనిచేయని, ఫాస్ట్ లెవల్ చెకింగ్‌లో పనిచేయని ఈవీఎంలు, కమిషనింగ్‌లో పనిచేయని 282 ఈవీఎంలను, 72 కంట్రోలు యూనిట్లు, 95 బ్యాలెట్ యూనిట్లు, 105 వీవీప్యాడ్లను బెల్ కంపెనీకి తరలించారు. కార్యక్రమంలో ఎన్నికల సెల్ సూపరిటెండెంట్ శ్రీనివాసరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కాలేషాబేగ్, డీఎస్.క్రాంతికుమార్, బి.రాజశేఖర్, గుర్రం సత్యనారాయణ, ఎస్‌కే.రసూల్, యర్రయ్య, డిప్యూటీ తహసీల్దార్లు రాజశేఖరరెడ్డి, ఉపేంద్ర, నవీన్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

30న గెస్ట్ అధ్యాపకుల పోస్టులకు ఇంటర్వ్యూలు

ఒంగోలు(విద్య), జూలై 24 : ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ అధ్యాపకులకు ఈనెల 30న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో యూజీ సబ్జెక్టుకు సంబంధించి కామర్స్, హిందీ సబ్జెక్టుల అధ్యాపకుల పోస్టులకు ఇంటర్వ్యూల్లో మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. అభ్యర్థులు నేరుగా తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

ప్రభుత్వ ప్రయోజనాలను అర్హులకు అందించాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 24 : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆయా వర్గాలకు అందించడంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం ఐసీడీఎస్, దాని అనుబంధ శాఖలు, ఉద్యానవన, మార్కెటింగ్, ఏపీ విత్తనాభివృద్ధిసంస్థ, మార్క్‌ఫెడ్, రవాణా, ఆర్టీసీ, టూరిజం, చేనేతజౌళిశాఖ, జలవనరులు, సమాచారపౌరసంబంధాల శాఖ అధికారులతో వేర్వేరుగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయాశాఖల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, స్థితిగతులను, ఆయా వర్గాల వారీగా లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఆయా పథకాల ప్రయోజనాన్ని లబ్ధిదారులకు అందజేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. సమావేశాల్లో అధికారులు మాధూరి, దినేష్‌కుమార్, బేబీరాణి, గోపీచంద్, ఉపేంద్ర, హరికృష్ణ, బుచ్చమ్మ, సుశీల, సుధాకర్, బెన్హర్, ఉదయ్‌కుమార్, పి.విద్యాసాగర్, కె.గ్రేస్‌లినోర, డీపీఆర్వో రమేష్, డివిజనల్ పీఆర్వో దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

జిల్లా అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ దోహదం

ప్రకాశంను వెనుకబడిన జిల్లాగా ప్రకటించడం హర్షణీయం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రకాశం జిల్లాకు దోహదపడే విధంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ప్రకాశం జిల్లాను వెనుకబడిన ప్రాంతంగా ప్రకటించాలని వినతులు ఉన్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. బీజేపీ ప్రభుత్వ హయంలో ఆ కల నెరవేరిందని చెప్పారు. బుధవారం ఒంగోలులో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో శివారెడ్డి మాట్లాడుతూ ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల్లో చేర్చేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి చేసిన కృషి ఫలించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ కల్పన, నైపుణ్యాల అభివృద్ధి, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఈ బడ్జెట్‌లో ప్రత్యేక చర్యలు తీసుకుందని చెప్పారు. 2024-25 ఆర్థికసంవత్సరంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యవసాయ రంగానికి కూడా అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. మాజీ జిల్లా అధ్యక్షుడు పీవీ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళల నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రకాల పంటలకు మద్దతు ధరలను పెంచడంతో పాటు కనీసం 50శాతం మిగులు ఉండేలా మద్దతు ధరను బడ్జెట్‌లో సవరించారన్నారు. జిల్లాను వెనుకబడిన జిల్లాగా ప్రకటించిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సెగ్గం శ్రీనివాసులు, తాడికొండ సురేష్, దండు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివారెడ్డి

త్వరలో మాదిగల కల నెరవేరే రోజు రాబోతుంది !

● మహాజన సోషలిస్ట్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 24 : మాదిగ జాతి చిరకాల కల, ఎస్సీ వర్గీకరణ ఫలాలు త్వరలోనే అందబోతున్నాయని మహాజన సోషలిస్ట్ జిల్లా అధ్యక్షుడు తొరటి ఆనంద్ పేర్కొన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్ట్ పార్టీ, వీహెచ్‌పీఎస్, ఎంజెఎఫ్ అనుబంధ సంఘాల సమావేశం బుధవారం ఒంగోలులోని అంబేద్కర్ భవన్ వద్ద జరిగింది. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆనంద్ మాట్లాడుతూ మాదిగల లక్ష్యం ఎస్సీ వర్గీకరణ తీర్పు త్వరలోనే రాబోతుందన్నారు. ప్రస్తుతం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు గ్రామ, మండల స్థాయిలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఆగస్టు నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షులు జలదంకి నర్సింగరావు, గోచిపాతల రవి, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు కత్తి ఐజక్, కిషోర్, కిషోర్, బుడంగుట్ల లక్ష్మీనరసయ్య, కోటి తదితరులు పాల్గొన్నారు. అంతకముందు విశ్వకవి గుర్రం జాషువా 53వ వర్ధంతిని స్థానిక ప్రకాశంభవనంలోని జాషువా విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆనంద్

గ్రంథాలయ ఉద్యమ పితామహుడు 'అయ్యంకి'



ఒంగోలులో నివాళులర్పిస్తున్న సిబ్బంది, పాఠకులు



ఉప్పుగుండూరులో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

● జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఆదిలక్ష్మి

ఒంగోలు(కల్చరల్), జూలై 24: గ్రంథాలయ ఉద్యమం ద్వారా ఎంతో మందికి విజ్ఞానాన్ని అందజేసే గ్రంథాలయాల స్థాపనకు కృషి చేసిన మహనీయుడు అయ్యంకి వెంకటరమణయ్య అని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి పేర్కొన్నారు. అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతి సందర్భంగా బుధవారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి సిబ్బంది, పాఠకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆదిలక్ష్మి మాట్లాడుతూ అఖిలభారత పౌర గ్రంథాలయం, ఇండియన్ లైబ్రరీ జనరల్ మొదలైనవాటి స్థాపనలో వెంకటరమణయ్య కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, కె.సంపూర్ణమ్మ, డి.సందీప్, పి.ఇమ్మానుయేలు, ఎస్.అనిల్ బాబు, టి.కృష్ణవేణి, వై.మృదుల్‌కుమార్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, సామాజిక కార్యకర్త నున్నా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు గ్రంథాలయంలో బుధవారం గ్రంథాయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు కొంజేటి సురేష్‌బాబు, అమరా జయసురేష్‌కుమార్, తెలగతోటి శామ్యూల్, గ్రంథాపాలకుడు ఎ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో 'కిచెన్ గార్డెనింగ్'

కొండపి, జూలై 24 : పెరిదేపి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహంలో భాగంగా ఏటీఎం మోడల్‌లో కిచెన్ గార్డెనింగ్‌లో కూరగాయల విత్తనాలు బుధవారం విత్తారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జి వై.రంజిత్ మాట్లాడుతూ బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసి విత్తడం వల మొక్కల ఎదుగుదలతోపాటు దిగుబడి బాగుంటుందని వివరించారు. ఏడాది పొడవునా నికరాదాయం వస్తుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయల విక్రయం వల్ల ఆదాయంతోపాటు ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీఎస్‌లు గౌతమీ, సుజాత పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

సూపర్‌బజారు చైర్మన్‌గా రాజశేఖర్



రాజశేఖర్‌కు బొకేను అందజేస్తున్న అధికారులు, సిబ్బంది

ఒంగోలు(విద్య), జూలై 24: ఒంగోలు సూపర్‌బజారు (ది ఒంగోలు కో ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్) చైర్మన్‌గా ఒంగోలు డిప్యూటీ రిజిస్ట్రార్, ఒంగోలు డివిజన్ సహకారాధికారి పోలిశెట్టి రాజశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సూపర్ బజారు ఎండీ, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. శాలువతో సత్కరించి పుష్పగుచ్చం ఇచ్చారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అందరూ సమష్టిగా పని చేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అంశాల వారీగా సమీక్షించి సంస్థ అభివృద్ధికి కార్యచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని ఆయన చెప్పారు.

వీసీకి విద్యార్థి జేఏసీ నేతల శుభాకాంక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 24: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్‌గా బాధ్యతలు స్వీకరించిన డీఆర్.మూర్తిని విద్యార్థి జేఏసీ నాయకులు అభినందించారు. బుధవారం స్థానిక విశ్వవిద్యాలయలో వీసీని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీని అభివృద్ధి పథంలో నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరుణాకర్, కృష్ణ, సూర్య, బెంజిమెన్, రాము, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 24 : ఒంగోలు డెయిరీని అమూల్ కబంధహస్తాల నుంచి విముక్తి చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు ప్రభుత్వ ఆధీనంలోనే డెయిరీని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు, రైతు సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బడ్జెట్ కేటాయింపుల్లో ప్రజాసంక్షేమానికి తూట్లు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 24: కేంద్ర ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్పొరేట్ సంస్థలకు నిజమైన కేటాయింపులు చేసి సాధారణ ప్రజలకు, ప్రధానంగా రాష్ట్రానికి ఉత్తుత్తి హామీలు ఇచ్చిందని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి డీవీఎస్.స్వామి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. బడ్జెట్‌తో సంబంధం లేకుండా అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు అప్పు ఇప్పిస్తామని చెప్పడం రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్తున్నా నిధులు మాత్రం కేటాయింపులు లేవని ఆరోపించారు. నిధులు కేటాయిస్తామని చెప్పడం తప్ప స్పష్టమైన కేటాయింపులు లేవని ఆయన విమర్శించారు.

జిల్లా అభివృద్ధికి రూ.20వేల కోట్లు కేటాయించాలి

ఒంగోలు(కలెక్టరేట్) జూలై 24: జిల్లా అభివృద్ధికి రూ.20వేల కోట్లు నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లాకార్యదర్శి సయ్యద్‌హనీఫ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రకాశం జిల్లాను వెనుకబడిన ప్రాంతంగా గుర్తించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని, అభివృద్ధికి నిధులు కేటాయించాలని గతంలో సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వెలిగొండ ప్రాజెక్టు, పాలేటిపల్లి సంగమేశ్వర రిజర్వాయర్‌ను పూర్తిచేయాలన్నారు. వీటిని పూర్తి చేయాలంటే జిల్లాకు కనీసం రూ.20వేల కోట్లు అవసరం అవుతాయని, ఆ నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు.

పేద విద్యార్థి చదువుకు ఆర్థికసాయం

ఒంగోలు(కల్చరల్), జూలై 24: తండ్రి చనిపోయి చదువు కోసం అనేక కష్టాలు పడుతున్న పేదవిద్యార్థినికి సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. స్థానిక మంగమూరు రోడ్డుకు చెందిన గీతాంజలి తండ్రి కరెంట్ షాక్‌తో చనిపోగా తల్లి కుట్టుమిషన్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నది. అయితే ఇంటర్‌లో మంచి మార్కులతో పాస్ అయిన గీతాంజలి నీట్ కోచింగ్‌కు ఆర్థిక స్తోమతలేక ట్రస్టును ఆశ్రయించగా బుధవారం రూ..30 వేలు నగదును సెక్రటరీ షేక్ సర్దార్ బాషా అదజేశారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, జనసేవ శ్రీనివాసరావు, తాటిపర్తి దివ్య, సురేంద్ర పాల్గొన్నారు.

సీపీఎం కార్యకర్తకు నివాళి

సంతనూతలపాడు, జూలై 24: పేర్నమిట్ట పీర్లమాన్యంలో సీపీఎం కార్యకర్త షేక్ ముర్తుజావలి(58) బుధవారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య పూలమాలతో ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మాబు, బి.సుబ్బారావు, వెంకటేశ్వర్లు, మస్తాన్, కాలేషా, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ



కమిటీ సభ్యులు

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 24 : ఒంగోలు నగర ఫొటో గ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ డవలప్‌మెంట్ అసోసియేషన్ నూతన కమిటీ బుధవారం ఎన్నికైంది. స్థానిక ఏ1 ఫంక్షన్‌హాలులో జరిగిన కార్యవర్గ సమావేశంలో జెమినీ శ్రీనివాసరావు, మట్టా సత్యం, ఉదయ్, హరిబాబు ఎన్నిక కమిటీ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. అధ్యక్షులుగా దగ్గుబాటి వెంకట్రావు, ఉపాధ్యక్షులుగా ఉప్పుటూరి చంద్ర, సెక్రటరీగా దొడ్డా చంద్రశేఖర్, కోశాధికారిగా షేక్ రసూల్, జాయింట్ సెక్రటరీగా చెన్నుపాటి భాస్కర్‌రావు, గోపిశెట్టి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. అనంతరం సీనియర్ ఫొటో గ్రాఫర్స్ మహేశ్వరరావు, రామచంద్రరావు, లక్ష్మయ్య, గోపి, రమేష్‌లను సన్మానించారు. కార్యక్రమంలో శర్వాణి సురేష్, శ్రీను, నిమ్మగడ్డ రమేష్, డంగారు వెంకటేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

సంతనూతలపాడు, జూలై 24: సంతనూతలపాడు వడ్డెరపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త తన్నీరు అంజయ్య(65) బుధవారం అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా నాయకులు తన్నీరుశ్రీను, ఇంద్రబాబు, అంజనేయులు, కోటేశ్వరరావు, తదితరులు నివాళులర్పించారు.

ఆటో డ్రైవర్‌కు ఎస్పీ అభినందన

ఒంగోలు(క్రైం), జూలై 23: ఆటోలో బంగారపు ఆభరణాలు మరిచిపోయిన ప్రయాణికుడికి వాటిని చేర్చిన డ్రైవర్‌ను ఎస్పీ దామోదర్ అభినందిచారు. ఈనెల 23వ తేదీన ఒంగోలు నగరం సుజాతనగర్ నుంచి ఆటోలో బయిలుదేరిన ప్రయాణికులు బంగారపు ఆభరణాలు వాహనంలో మరిచిపోయి వెళ్ళారు. దీంతో ఆటో డ్రైవర్ నూతలపాటి శివప్రసాద్ ఆటోలో ఉన్న బంగారపు ఆభరణాలు ఉన్న సూట్‌కేస్‌ను తాలుకా పోలీసులకు అందజేశారు. ఈ మేరకు ఆటోడ్రైవర్ నిజాయితీని మెచ్చుకున్న ఎస్పీ శాలువతో సత్కరించారు.

ఉపాధి పనుల్లో విద్యార్థులు..ఫిర్యాదు

కొండపి, జూలై 24 : మండలంలోని పెదకండ్లగుంట గ్రామంలో జరుగుతున్న ఉపాధి పథకం పనుల్లో చిన్నపిల్లలు పనిచేస్తున్నారని గ్రామస్తులు బుధవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోకు ఫిర్యాదు చేశారు. పని ప్రదేశంలో జాబ్ కార్డు ఉన్నవారికి బదులుగా కుటుంబంలోని చిన్నారులు పనిచేస్తున్నారని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోను వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఆమె ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

దళిత, గిరిజనులపై దాడులను అరికట్టాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 24: రాష్ట్రంలో దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం కోరారు. స్థానిక గాంధీనగర్‌లోని మూడు బొమ్మల సెంటర్‌లో బుధవారం దళిత, గిరిజన హక్కుల పరిరక్షణ సమితి జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో డాక్టర్ సుధాకర్ మొదలుకుని అనేక మందిపై హత్యలు, అత్యాచారాలు జరిగాయన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా దళితులపై దాడులను ఆగడం లేదని ఆరోపించారు. దళిత, గిరిజనుల భూములను ఆక్రమించుకొని ఇదేమని ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 27 ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించే విధంగా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఎల్‌పీ జిల్లా అధ్యక్షుడు కట్ట వరప్రసాద్, సమితి జిల్లా అధ్యక్షుడు రామావతు వెంకటేశ్వర్లు, శివనాయక్, దాసరి సంగీతరావు, దాసరి ఏసురత్నం, పరశురామ్ నాయక్, గోవిందనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్ తనిఖీ



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

నాగులుప్పలపాడు, జూలై 24 : నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఎస్పీ దామోదర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన దర్యాప్తు చేసి పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. గస్తీ సమయంలో హిస్టరీ షీట్స్ కలిగిన వ్యక్తులను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. వారి కదలికల పై నిఘా పెంచాలని చెప్పారు. గ్రామాల్లో విజువల్ పోలిసింగ్ నిర్వహించాలన్నారు. ప్రజల ఫిర్యాదులపై జాప్యం చేయకుండా పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.

మైనంపాడులో ఆటల పోటీలు ప్రారంభం


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో రమేష్

సంతనూతలపాడు, జూలై 24: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మైనంపాడు జడ్పీహైస్కూలులో బుధవారం ఏర్పాటు చేసిన ఆటల పోటీలను సమగ్ర శిక్ష ఎంఈవో రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటుగా ఆటల్లోను ప్రతిభ చూపాలన్నారు. ఆటలు ఆరోగ్యంతో పాటుగా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. సంప్రదాయ ఆటలైన కర్రాబిళ్ల, ఉప్పుచీర, ఏడుపెంకులు, అష్టాచమ్మా వంటి ఆటలలో విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్‌ఎం నరసింహారావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వనజ, పీఈటీ రవికుమార్ పర్యవేక్షించారు.

పేస్ అధ్యాపకుడికి డాక్టరేట్


పృథ్వీకృష్ణకు డాక్టరేట్‌ను అందజేస్తున్న కరస్పాండెంట్ శ్రీధర్

ఒంగోలు(విద్య), జూలై 24: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగానికి చెందిన అధ్యాపకుడు అంబూరి పృథ్వీకృష్ణకు చెన్నైలోని సత్యబామ యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. డాక్టర్ జి.సింధిల్‌కుమార్ పర్యవేక్షణలో థర్మల్ విభాగంలో 'ఇన్‌ఫ్లూయన్స్ ఆఫ్ నానోపార్టికల్స్ అండ్ బబుల్స్ ఇన్ హీట్ ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో బుధవారం డాక్టరేట్ పొందిన పృథ్వీకృష్ణను కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే. మూర్తి, డీన్‌లు అనిల్‌కుమార్, సీవీ.సుబ్బారావు, టీఆర్ చైతన్య, ఆర్.వీరాంజనేయులు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కోటిరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు బీమా పాలసీ


పాలసీ పత్రాలను అందజేస్తున్న అతిథులు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 24 : ఎస్సీ ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లకు పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ప్రమాద బీమా పాలసీని బుధవారం అందజేశారు. ఒంగోలులోని రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ జాలాది మణిబాబు, బీజేపీ నాయకులు బొద్దులూరి ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మణిబాబు మాట్లాడుతూ నిరంతరం ఉద్యోగ బాధ్యతల్లో బిజీగా ఉండే జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లకు ప్రమాద బీమా పాలసీ ఎంతో అవసరం అన్నారు. అసోసియేషన్‌కు తమవంతు సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గేరా అజయ్‌బాబు, కార్యదర్శి ఒంగోలు వసంత్‌కుమార్, ఉపాధ్యక్షులు అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి వేసుపోగు కోటయ్య, సర్వేశ్వరరావు, శ్రీలేఖ అజయ్, బుజ్జి, అనీల్ పాల్గొన్నారు.

ఎంపీడీవో మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న ఎంపీడీవో నగేష్‌కుమారి, సిబ్బంది

సింగరాయకొండ, జూలై 24 : ఆత్మహత్యకు పాల్పడిన నరసాపురం ఎంపీడీవో మండవ వెంకట రమణారావు, ఇటీవల అనారోగ్యంతో మరణించిన బింగినపల్లి పంచాయతీ కార్యదర్శి కె. శ్రీనివాసులుకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో నగేష్‌కుమారి, సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వెంకట రమణారావు మరణానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. అనంతరం సిబ్బందితో కలిసి నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఏవో నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

చీమకుర్తి, జూలై24 : సమాజంలో అణగారిన వర్గాలను తన రచనల ద్వారా జాగృతం చేసిన ప్రముఖ కవి గుర్రం జాషువా అని పలువురు పేర్కొన్నారు. బుధవారం చీమకుర్తి పట్టణం క్రిస్టియన్‌పాలెంలో జాషువా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, పాటిబండ్ల రాజసులోచన, శారద, దానమ్మ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కౌన్సిలర్ గంగయ్య

ఐఏఎస్ వ్యాఖ్యలపై ఖండన

చీమకుర్తి, జూలై24 : సివిల్స్ ఉద్యోగాల్లో దివ్యాంగుల కోటాపై ఐఏఎస్ స్మితా సబర్వాల్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని చీమకుర్తి పట్టణ దివ్యాంగ ఉద్యోగులు తిరుపతయ్య, మధుబాబు, లక్ష్మి, శేషిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.

నిర్లక్ష్యం..అతివేగంతో రోడ్డు ప్రమాదాలు !

అధికశాతం ద్విచక్రవాహనాలవే..

ప్రాణాలు కోల్పోతున్న యువత

హెల్మెట్ ధరించకపోవడంతో పెరుగుతున్న తీవ్రత



మద్దిపాడు, జూలై 24: వాహనచోదనలో కొద్దిపాటి నిర్లక్ష్యంతో ఎంతోమంది వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. అతివేగంగా వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రవాణా, పోలీస్‌శాఖ అధికారులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టిన పరిస్థితులలో మార్పు ఉండటం లేదు. మద్దిపాడు మండలం 16వ నంబరు జాతీయ రహదారిపై నిర్లక్ష్యంగా వాహనాలు నడపటంతో పాటు అతివేగం ప్రమాదాలకు దారితీస్తున్నది. ఇటీవల మండలంలోని సీతారాంపురం కొస్టాలు వద్ద మోటార్‌సైకిల్‌ను కార్ ఢీకొట్టడంతో మహిళ మృతి చెందగా ఒకరికి గాయాలయ్యాయి. అదేరోజు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద పెద్దకొత్తపల్లికి చెందిన యువకుడు బస్సును ఢీకొట్టి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాలు నడపడం, త్వరగా గమ్యస్థానాలకు చేరాలనే ఉద్దేశంతో చాలమంది ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. వీరిలో కొంతమంది ప్రాణాలు కోల్పోవడంతో మరి కొందరు తీవ్రగాయాలు పాలై కదల్లేని పరిస్థితికి చేరుతున్నారు. ఇంటి పెద్దలను కోల్పోవడంతో ఆయా కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారుతున్నది. వాహనాలు నడిపేటప్పుడు రహదారి భద్రత నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు వాహనదారులు ముందుకు రావాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ అంశంపై ఎస్‌ఐ వెలగా మహేష్ స్పందిస్తూ 23శాతం ప్రమాదాలు ద్విచక్ర వాహనాల వల్లే జరుగుతున్నట్లు పేర్కొన్నారు. అందులోను యువత, విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నారని చెప్పారు. హెల్మెట్ ధరించని కారణంగా ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కాలువలకు పుష్కలంగా సాగర్ జలాలు

మంచినీటి చెరువులకు నీరు పంపింగ్


దర్శి కాలువలో పుష్కలంగా ప్రవహిస్తున్న జలాలు

పంపింగ్ చేస్తున్న మోటార్లను పరిశీలిస్తున్న అధికారులు

దర్శి, జూలై 24: కాలువలకు సాగర్ జలాలు పుష్కలంగా సరఫరా అవుతున్నాయి. తాగునీటి అవసరాల కోసం మంచినీటి చెరువులకు నీరు నింపేందుకు నాలుగు రోజుల క్రితం సాగర్ కాలువలకు నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సాగర్ కుడికాలువకు డ్యామ్ నుంచి 5,600 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. అక్కడ నుంచి జిల్లా బార్డర్ 85/3వ మైలు వద్దకు చేరేసరికి 2,795 క్యూసెక్కులు, దర్శి బ్రాంచ్ కాలువకు 2,170 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువకు 1,349 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం సాగర్ కాలువలకు విడుదల అవుతున్న నీటిని రామతీర్థం జలాశయంతో పాటు జిల్లాలోని అన్నీ వనరులను నింపుతున్న విషయం తెలిసిందే. దర్శి నియోజకవర్గంలోని దర్శి, కురిచేడు, చందవరం మంచినీటి చెరువులకు నీటిని నింపుతున్నారు. దర్శిలో ఉన్న కనిగిరి చెరువుకు నీరు పంపింగ్ చేస్తున్నారు. దర్శి ఎన్ఏపీ చెరువుకు రోజుకు 80 మిలియన్ లీటర్ల నీరు పంపింగ్ చేస్తున్నారు. అధికారులు 100 హెచ్‌పీ మోటార్లు నాలుగు, 200 హెచ్‌పీ మోటార్లు రెండు, 75 హెచ్‌పీ మోటార్లు మూడు ఏర్పాటు చేసి నిరంతరం పంపింగ్ చేస్తున్నారు. దర్శి ఎన్ఏపీ చెరువు పూర్తి సామర్థ్యం 2,540 మిలియన్ లీటర్లు. సాగర్ జలాలు పది రోజులు పాటు సరఫరా అవుతాయని ఎన్ఎస్‌పీ అధికారులు తెలుపుతున్నారు. ఎక్కడికక్కడ లాకులు బిగించి మరో ఐదు రోజులు నీరు పంపింగ్ చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

అయితే అధికారుల అంచనా ప్రకారం దర్శి చెరువుకు 50 శాతం, మిగిలిన చెరువులకు 75 శాతం నీరు నింపే అవకాశం ఉంది. ఈ ఏడాది జలాశయాలకు పుష్కలంగా నీరు చేరుతున్నందున పంటల సాగుకు నీరు విడుదల చేసే అవకాశం ఉంది. మంచినీటి చెరువులకు మిగిలిన భాగాన్ని ఆ సమయంలో చెరువులు నింపే అవకాశం ఉంటుంది.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండ

• డీఈఈ హరిబాబు


మాట్లాడుతున్న డీఈఈ హరిబాబు

కనిగిరి, జూలై 24: విద్యుదాఘాతం ఘటనలో దుర్మరణం చెందిన ముగ్గురు యువకుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈఈ హరిబాబు అన్నారు. కనిగి డీఈఈ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రమాదానికి దారి తీసిన కారణాలను ఆయన వెల్లడించారు. పునుగోడు పరిధిలోని 11కేవీ విద్యుత్ లైను గాలులకు తెగి పడిపోయిందని తెలిపారు. ఆ సమయంలో 11కేవీ సప్లయి ట్రిప్ అయిందని తెలిపారు. ప్రధానంగా విద్యుత్‌శాఖ నిబంధనల ప్రకారం ఏ కారణాల చేతనైనా విద్యుత్ ట్రిప్ అయితే ఎక్కడో షార్ట్ అయిందని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దీంతో సప్లయి ట్రిప్ అయిన తర్వాత 15 నిమిషాల పాటు తిరిగి సప్లయి చార్జి చేయబోమని చెప్పారు. 15 నిమిషాల్లో ఎవరైనా విద్యుత్ షార్ట్ విషయాలను సమాచారం అందిస్తారని తెలిపారు. ఒకవేళ సమాచారం అందని పక్షంలో తిరిగి సప్లయి రీచార్జ్ చేస్తామన్నారు. పునుగోడు ఘటనలో కూడా ఆ విధానాన్ని తీసుకున్నట్లు తెలిపారు. 15 నిమిషాలు ఆగిన తర్వాత రీచార్జ్ చేశామని వివరించారు. రీచార్జ్ చేసిన సమయంలో తెగి పడిన 11కేవీ వైరు చిల్లచెట్లపై పడి ఉండటంతో సప్లయి ట్రిప్ కాకుండా నిలబడిందన్నారు. ఒకవేళ గాలులకు ఎక్కడైనా సాధారణ ట్రాకింగ్ వలన జరిగి ఉండొచ్చని భావించినట్లు తెలిపారు. అదే సమయంలో విద్యార్థులు స్కూటీ పై రోడ్డులో ఎడమవైపు చిల్లచెట్లు పక్కగా రావటంతో సప్లయి వైరు తగిలి మంటలు ఏర్పడి అక్కడికక్కడే మృతి చెందటం బాధాకరమన్నారు. దీంతో తిరిగి సప్లయి ట్రిప్ అయిందని వివరించారు. ఈ ఘటనలో విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం లేదని చెప్పారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటనకు విద్యుత్‌శాఖతోపాటు, ప్రభుత్వం కూడా వారి కుటుంబాలకు అండగా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా అందజేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అయితే పింగాణీ ఇన్సులేటర్‌కు ఉన్న బోల్టు ఊడిన విషయాన్ని తోసిపుచ్చటం విశేషం. ఈ సమావేశంలో డీఈ ఉమాకంత్, ఏఈ పవన్‌కుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇడుపులపాయలో ఒంగోలు ట్రిపుల్‌ఐటీ అడ్మిషన్లు

• మొదటి రోజు 456 మందికి ప్రవేశాలు

వేంపల్లె, జూలై 24 : ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సులో చేరేందుకు అడ్మిషన్ కౌన్సెలింగ్‌ను వేంపల్లె మండలం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జీయూకేటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ- ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఆర్జీయూకేటీలో అవకాశం దక్కిందని, కష్టపడి చదువుకుని ఉన్నత విద్యావంతులై మంచి ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీలో సీట్లు రావడం తల్లిదండ్రులు చేసుకున్న అదృష్టమని తెలిపారు. నాణ్యమైన విద్యాబోధనతోపాటు వసతి కల్పిస్తున్నామని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తరచూ క్యాంపస్‌ను సందర్శించి వారి బాగోగులు, చదువు గురించి తెలుసుకోవాలని వీసీ సూచించారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడిచదివితే విజయం మీదేనని విద్యార్థులకు వీసీ ఉద్బోధించారు. ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో టాపర్‌గా నిలిచిన పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం తరిబల్లి గ్రామానికి చెందిన ఎం.మేఘనకు వీసీ విజయ్‌కుమార్ మొదటి అడ్మిషన్ ఫైల్‌ను అందించారు. అనంతరం యథావిధిగా అడ్మిషన్ ప్రక్రియ కొనసాగించారు. 586మంది విద్యార్థులకు కాల్‌లెటర్లు పంపగా 456 మంది అడ్మిషన్ పొందినట్లు కౌన్సెలింగ్ కన్వీనర్ అమరేంద్రకుమార్ తెలిపారు. 130సీట్లు మొదటి రోజు మిగిలాయన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులందరికీ తరగతి, హాస్టల్ గదులను కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఇడుపులపాయ, ఒంగోలు డైరెక్టర్లు కుమారస్వామి గుప్త, భాస్కర్ పటేల్, ఏవోలు రవికుమార్, శ్రీనివాస్, డీన్‌లు రత్నకుమారి, రూపస్ కుమార్, బిన్ని తదితరులు పాల్గొన్నారు.

వెంకటశేషయ్య ప్రోత్సాహన్ని అందిపుచ్చుకోవాలి

• హెచ్‌ఎం చలపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం చలపతిరావు

జరుగుమల్లి (కొండపి), జూలై 24 : చార్టెడ్ అకౌంటెంట్ నల్లూరి వెంకటశేషయ్య స్కూల్‌కు అందిస్తున్న ప్రోత్సాహన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నతస్థితికి చేరుకోవాలని మండలంలోని రెడ్డిపాలెం ఎంపీ స్కూల్ హెచ్‌ఎం బి.చలపతిరావు చెప్పారు. బుధవారం జరుగుమల్లి స్కూల్ ఆవరణలో వెంకటశేషయ్య మండలంలోని పది స్కూళ్లకు అందజేసిన లక్షా యాభైవేల రూపాయల విలువైన నోటు పుస్తకాలు, కాపీ పుస్తకాలు, పెన్సిళ్లు, స్కేళ్లు, పెన్నులు, బాక్సులను స్కూల్ విద్యార్థులకు హెచ్‌ఎం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో నాగేంద్రవదన్ మాట్లాడుతూ చీమకుర్తి మండలం కూనంనేనివారిపాలేనికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్‌ను స్నేహితుడైన స్కూల్ ఉపాధ్యాయుడు పిడికిటి వెంకటేశ్వర్లు విద్యార్థులకు సాయం అందించాలని కోరగా వెంటనే స్పందించి మండలంలోని చిర్రికూరపాడు కాంప్లెక్స్ పరిధిలోని పది పాఠశాలకు నోటు పుస్తకాలు, ఇతర విద్యార్థులకు అవసరమైన వస్తువులు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో తల్లీకొడుకు ఆత్మహత్య

కొద్ది రోజుల క్రితమే ఇంటి పెద్ద అనారోగ్యంతో మృతి

దిల్‌సుఖ్‌నగర్, జూలై24(ఆంధ్రజ్యోతి): ఆ ఇంటి పెద్ద కొద్ది రోజుల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు..తానే పెద్ద దిక్కై. తమ ఇద్దరు కుమారుల బాగోగులు చూసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది ఆ తల్లి.. అయితే ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక చివరకు తాను ఆత్మహత్య చేసుకుంది. తల్లి మృతదేహాన్ని చూసి షాక్‌కు గురైన కుమారుడు తాను ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ హృదయవిదారక సంఘటనకు సంబంధించి చైతన్యపురి పోలీసులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఒంగోలుకు చెందిన గుంజి శివ, పద్మ దంపతులు తమ ఇద్దరు కుమారులతో కలిసి బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్ నగరానికి వసలవచ్చి కొత్తపేట ఎస్ఎల్ఆర్ కాలనీకి వచ్చి నివాసం ఉంటున్నారు. అయితే కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో శివ మృతి చెందాడు. దీంతో తానే పెద్ద దిక్కై ఇద్దరు కుమారులను పోషిస్తుంది.

తల్లి మరణాన్ని జీర్ణించుకోలేక...

అయితే కుటుంబ పోషణ భారం కావడం, ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో కొంత కాలంగా పద్మ తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తుంది. ఈక్రమంలో కుమారులిద్దరు ఇంట్లో లేని సమయంలో బుధవారం రాత్రి పద్మ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాత్రి సమయంలో ఇంటికి వచ్చిన పెద్ద కుమారుడు వంశీ(18) తల్లి మృతదేహాన్ని చూసి షాక్‌కు గురయ్యాడు. తల్లి మరణాన్ని జీర్ణించుకోలేకపోయిన వంశీ తాను కూడ అదే గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహలను చికిత్సం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు చైతన్యపురి పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

నూతన నేర చట్టాలను ఉపసంహరించుకోవాలి

రేపు అవగాహన సదస్సు ● వామపక్ష నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 24 : కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన చట్టాలను ఉపసంహరించుకోవాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, పీవీఆర్.చౌదరి, సీపీఎం నాయకులు జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, సీపీఐ ఎంఎల్ జిల్లాకార్యదర్శి డీవీఎస్.స్వామి, ఎంఎస్.సాయి, న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి సాగర్‌లు మాట్లాడారు. నూతన నేరచట్టాలపై ఈనెల 26వతేదీ సాయంత్రం ఐదున్నర గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో హైకోర్టు సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ పాల్గొంటారన్నారు. ప్రజాస్వామ్యవాదులు, సామాజికవేత్తలు, విద్యావంతులు, న్యాయవాదులు, విద్యార్థులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌కు విరాళం


చెక్కును అందజేస్తున్న శ్రీనివాసరావు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 24: ఒంగోలులో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహణకు మాజీ మునిసిపల్ కౌన్సిలర్ పసుపులేటి శ్రీనివాసరావు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. నగరంలోని డొక్కా సీతమ్మ క్యాంటీన్ వద్ద బుధవారం జరిగిన అన్నదాన కార్యక్రమం వద్ద జనసేన పార్టీ నాయకుడు జడా బాల నాగేంద్రయాదవ్‌కు ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అడుసుమల్లి వెంకట్రావు, ఈదుపల్లి గురునాథం తదితరులు పాల్గొన్నారు. అనంతరం జనసేన క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు.



గతంలోనే నిర్మించిన షెడ్

లక్షలు వృథా.. చెత్తతో వ్యధ..

● నిరుపయోగంగా సంపద కేంద్రాలు ● ఐదేళ్లు నిర్లక్ష్యంగా వైసీపీ సర్కార్ ● టీడీపీ రాకతో మళ్లీ ఆశలు

పెద్ద దోర్నాల, జులై 24: టన్నుల కొద్దీ తయారయ్యే చెత్త చెదారాలను సమస్యలుగా చూడకుండా ఆదాయ వనరులుగా మార్చాలనే ఉద్దేశ్యంతో గత టీడీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో సేకరించిన తడి పొడి చెత్తను సేకరించి సేంద్రియ ఎరువులను తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని భావించారు. కానీ ఈ ప్రక్రియ నిర్మాణాలతోనే నిలిచిపోయింది. మండలంలోని 13 పంచాయతీల్లో నిర్మాణాల కోసం జనాభా ప్రకారం ఆరు నుంచి పది లక్షల రూపాయలు వరకు వెచ్చించి షెడ్లు, తొట్లు నిర్మించారు. చెత్తను సేకరించేందుకు రిక్షాలు కూడా మంజూరయ్యాయి. ఇంతలో ప్రభుత్వం మారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదు. సంపద తయారీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో లక్షల రూపాయలు ప్రభుత్వ నిధులు వృధాగా మారాయి.

ప్రభుత్వ లక్ష్యమిది..

గ్రామాల్లో ఉత్పత్తి అవుతున్న తడి పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలి. వాటి నుండి ఎరువును తయారు చేయడం ద్వారా రైతులకు విక్రయించి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధి కోసం వినియోగించాలనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అంతేగాక గ్రామాల్లో పారిశుధ్యం చేపట్టవచ్చు. 500 మంది జనాభాకు ఒక వ్యక్తిని నియమించి అతనికి రిక్షాను కేటాయించి ప్రతి ఇంటికి తిరిగి వ్యర్థాలను సేకరించాలి. సేకరించిన వాటిని డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడ ఏర్పాటు చేసిన గదుల్లో వ్యర్థాలను విభజించి భద్రపరచాలి. వాటిని వివిధ పద్ధతుల్లో వేరు చేసి ఎరువును తయారు చేసి విక్రయిస్తారు. ఇలా చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయంతో పాటు గ్రామాల్లో స్వచ్ఛత పరిశుభ్రంగా ఉంటాయనే లక్ష్యంతో సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పర్యావరణానికి ముప్పు

చెత్తను ఎరువుగా మార్చకపోవడంతో పర్యావరణానికి హానీ కలిగేలా పంచాయతీ సిబ్బంది ఎక్కడ డంపింగ్ చేస్తే అక్కడ చెత్తను కాల్చుతున్నారు. ప్రజలు వ్యర్థ వస్తువులతో పాటు ప్లాస్టిక్ వస్తువులు కూడా వేస్తుంటారు. ఇవన్నీ కాల్చడం ద్వారా వాతావరణం కాలుష్యం అవుతుంది. ఈ నేపథ్యంలో టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చింది. దీంతో నాటి లక్ష్యాలను ప్రభుత్వం పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాలలో ఎరువులు తయారు చేయాలని వాతావరణ కాలుష్యం నుండి రక్షించాలని పేర్కొంటున్నారు.



నిరుపయోగంగా తొట్లు, పక్కన వ్యర్థాలు

అవీ..ఇవీ..

పొదుపు ఖాతాలను సద్వినియోగం చేసుకోవాలి

● నగరపంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

పొదిలి, జూలై 24 : తపాలాశాఖ పొదుపు పథకాలను వినియోగించుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పోస్టాఫీస్ ఆవరణలో నిర్వహించిన డాక్ చౌపాల్ కార్యక్రమంలో పాల్గొని మట్లాడారు. తపాలాశాఖలో ప్రస్తుతం మంచి పొదుపు పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. బీమాపథకాలను డిజిటల్ ఖాతలవంటి సౌకర్యాలను తపాలా శాఖ ప్రజల ముందుకు తీసుకొచ్చిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గిద్దలూరు, కంభం ఇన్‌స్పెక్టర్లు టి శ్రీనివాసులు, మహ్మద్‌ఆలీ, పొదిలి హెచ్‌వో సిబ్బంది, గ్రామీణ తపాలా ఉద్యోగులు ప్రజలు పాల్గొన్నారు.

సమన్వయంతో గ్రామాభివృద్ధి



మాట్లాడుతున్న రామాంజనేయులురెడ్డి

మార్కాపురం రూరల్, జూన్ 24: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని టీడీపీ మండల అధ్యక్షులు జవాజి రామానుజులరెడ్డి అన్నారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో బుధవారం గ్రామస్థాయి అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా పనిచేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో చేసిన పనుల వివరాలను తెలియజేయాలని కోరారు. ధ్రువపత్రాలు దరఖాస్తు చేసుకున్న వారికి సకాలంలో అందించేలా సచివాలయ అధికారులు పనిచేయాలన్నారు. గ్రామంలో పారిశుద్యం మెరుగుపరిచి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు రుణాలను అందించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. సమావేశంలో వీఆర్‌వో బడే సాహెబ్, డీఆర్‌డీఏ వెలుగు సీసీ మనోకుమారి, సచివాలయ సిబ్బంది, సంబంధిత శాఖల గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపి దివ్యాంగులకు వరం



దివ్యాంగుల ఫిజియోథెరపి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో శర్వాణి

కంభం, జూలై 24 : క్రమంతప్పని ఫిజియోథెరపి దివ్యాంగులకు మేలు చేస్తుందని, ఎంఈవో శార్వణి తెలిపారు. స్థానిక బోర్డు స్కూల్ భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం నిర్వహించిన ఫిజియోథెరపి క్యాంప్‌ను ఎంఈవో శర్వాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు వైద్యుల సలహాలను పాటించాలన్నారు. దివ్యాంగులైన చిన్నారులకు ఫిజియోథెరపీ చేయించడం ద్వారా గుణాత్మక మార్పులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ మురళి, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఫిజియోథెరపిస్టు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా జీవించాలి

గిద్దలూరు, జూలై 24 : మండలంలోని ముండ్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్ట్‌ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో యూత్ ఎంపవర్‌పై విద్యార్థులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో జింకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడి లేకుండా జీవించవచ్చన్నారు. విద్యార్థులకు ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుందని, వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. సుదర్శన క్రియ ద్వారా మానసికంగా, ప్రశాంతంగా ఉండి ఒత్తిడి అధిగమించ వచ్చన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు పాలుగుళ్ల పురుషోత్తంరెడ్డి, సాయికిరణ్, మనోహర్‌రెడ్డి, బి.ఎస్.నారాయణరెడ్డి శిక్షణ ఇచ్చారు. హెచ్‌ఎం కె.లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీవో తనిఖీ



పాలప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీడీవో

కంభం, జూలై 24 : కంభం మండలంలోని జంగంగుంట్ల 86, 87 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో మస్తాన్‌వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం వండిన భోజనాలను రుచి చూశారు. అనంతరం వచ్చిన వారికి పాల పాకెట్లను అందజేశారు. ఎంపీడీవో మస్తాన్‌వలి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థికసాయం



సాయం అందిస్తున్న కార్మిక నాయకులు

కంభం, జూలై 24 : కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పనికి వెళ్లలేక పోతున్న భవననిర్మాణ కార్మికుడు నల్లబోతుల పాపయ్యకు కార్మిక సంఘం తరపున రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్మికసంఘం నాయకులు రోశయ్య, ఖాజావలి మాట్లాడుతూ గతంలో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు అందరూ కలిసి చేసి కార్మికుల ఐక్యతను తెలియజేశామన్నారు. భవన నిర్మాణ కార్మికులందరూ యూనియన్‌లో చేరి సభ్యత్వం నమోదు చేయించుకోవాలన్నారు. ప్రతినెలా సభ్యత్వం కడుతున్న కార్మికుడికి తామందరం కలిసి ఎంతో కొంత సాయం అందజేస్తామన్నారు. కావున కార్మికులందరూ యూనియన్‌లో చేరాలన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

నాగులుప్పలపాడు, జూలై 24 : స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి, పోలీస్ స్టేషన్, పరిసరాలను క్షణంగా పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసుల వివరాలు నేరనివారణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులను త్వరిత గతిన దర్యాప్తు చేసి పూర్తి చేయాలన్నారు. రోడ్డుప్రమాదాలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రివేళల్లో పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. గస్తీ విధులు పటిష్టంగా నిర్వహించి నేరాలను నియంత్రించాలన్నారు. గస్తీ సమయంలో హిస్టరీ షీట్స్ కలిగిన వ్యక్తులను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. వారి కదలికలపై నిఘా పెంచాలన్నారు. గ్రామాల్లో విజువల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. పోలీసు సిబ్బంది తరచూ గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు అక్కడి పరిస్థితులపై దృష్టి సారించాలన్నారు. ప్రజల ఫిర్యాదులపై జాప్యం చేయకుండా పరిష్కరించాలని సూచించారు.

నీళ్ల కోసం రోడ్డెక్కిన చోళ్లవీడు గ్రామస్థులు



నీళ్ల కోసం నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

గిద్దలూరు, జూలై 24 : రాచర్ల మండలంలోని చోళ్లవీడు పంచాయతీలోని అక్కపల్లి గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. మూడు నెలలుగా నీటి సమస్య నెలకొని ఉండగా కొత్తగా బోరు వేయడం గాని, ఇతర ప్రాంతాల నుంచి నీటిని తీసుకురావడం గాని చేయడం లేదు. దీంతో గ్రామస్థులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. నీటి సమస్యలు పరిష్కరించకపోతే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి

త్రిపురాంతకం, జూలై 24: సాగర్ జలాలతో ముడివేముల చెరువును నింపి గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని పాతముడివేముల, కొత్త ముడివేముల, పాపన్నపాలెం, డీవీఎన్ కాలనీ గ్రామాల ప్రజలు ఎన్నెస్పీ డీఈఈ విజయలక్ష్మికి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. తమ గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడిందని ప్రజలతోపాటు పశువులకు, పక్షులకూ తాగునీటి సమస్య ఏర్పడిందని ప్రస్తుతం విడుదల చేసిన సాగర్ జలాలతో తమ చెరువును నింపాలని కోరారు.

నిధుల కేటాయింపు హర్షణీయం

గిద్దలూరు, జూలై 24 : కేంద్రప్రభుత్వ వార్షిక బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడంపై బీజేపీ జిల్లాశాఖ ఉపాధ్యక్షులు బీవీ. రామాంజనేయులు, మండలశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లతోపాటు పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తామన్నారు. అలాగే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజ్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీనివలన ప్రకాశం జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున సాగుతాయని, ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

వెంకటరమణయ్య సేవలు మరువలేనివి



వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

పెద్దదోర్నాల జులై 24: గ్రంథాలయ ఉద్యమంలో వెంకట రమణయ్య చేసిన సేవలు మరువలేనివని వెల్ఫేర్ అసిస్టెంట్ రంగనాయకులు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 134 జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథపాలకుడు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన విద్యార్థులు వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పిషర్ అసిస్టెంటు వెల్ఫేర్ రంగనాయకులు రమణయ్య గ్రంథాలయ ఉద్యమానికి చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంటు లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సామగ్రి కొంటే చర్యలు



దుకాణదారులకు సూచనలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మార్కాపురం, జూలై 24: పాత ఇనుము కొనేవారు వ్యవసాయ మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగితీగ వంటివి కొనుగోలు చేయరాదని మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పట్టణ పోలీసు స్టేషన్ వద్ద బుధవారం సాయంత్రం పాత ఇనుప సామగ్రి కొనే దుకాణదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయంలో ఎంతో కీలకమైన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన పరికరాలు తరచూ చోరీకి గురవుతున్నాయన్నారు. వాటిని దొంగిలించిన వాళ్లను విచారిస్తే పాత ఇనుప దుకాణాల్లో అమ్ముతున్నట్లు చెబుతున్నారన్నారు. అలాంటి సామగ్రిని కొంటే ఉపేక్షించేదిలేదన్నారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. కార్యక్రమంలో పోలీసులు, పాత ఇనుప సామగ్రి కొనే దుకాణదారులు పాల్గొన్నారు.

బేకరీ దుకాణంలో చోరీ

గిద్దలూరు టౌన్, జూలై 24 : పట్టణంలోని బేకరి దుకాణంలో దొంగలుపడి రూ.20 వేల విలువైన నగదును చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.., మంగళవారం అర్థరాత్రి రాచర్ల గేటు కూడలిలోని బేకరి, చిప్స్ దుకాణంలో చోరీ జరిగింది. ఆయా దుకాణాల్లో దొంగలు అందింది దోచుకుని పోయారు. బేకరిలో రూ.5వేలు, చిప్ షాపులో రూ.20వేలు నగదును దొంగిలించారు. 4 నెలల క్రితం కూడా ఇదే దుకాణంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏఎస్సై రంగయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

● ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల డిమాండ్

గిద్దలూరు టౌన్, జూలై 24 : పట్టణంలోని ఎస్సీ కాలేజీ బాలుర హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సందర్శించారు. మెనూను సక్రమంగా అమలు చేయడం లేదని, హాస్టల్‌లో కరెంటు తీగలు అధ్వాన్నంగా ఉన్నాయని, మరుగుదొడ్ల రిపేర్లు ఉన్నా పట్టించుకోలేదని, రూముల్లోని కిటికీలు, మెస్‌లు రిపేరులో ఉన్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల దృష్టికి విద్యార్థులు తీసుకెళ్ళారు. వార్డెన్ రాజేష్ విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, దాత్వర్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆయనకు రెండు హాస్టళ్ళ బాధ్యతలు అప్పచెప్పడంతో ఎక్కడా న్యాయం జరుగడం లేదన్నారు. ఈసమస్యలను ఎఎస్‌డబ్ల్యు అధికారుల దృష్టికి తీసుకుపోనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తెలిపారు.

ఎస్‌ఎస్‌ట్యాంకును పరిశీలించిన టీడీపీ నాయకులు



ఎస్ఎస్ ట్యాంకును పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

మార్కాపురం, జూలై 24: త్రిపురాంతకం మండలం దూపాడు వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకును మార్కాపురం టీడీపీ నాయకులు బుధవారం పరిశీలించారు. మూడు రోజులుగా సాగర్ ప్రధాన కాలువ నుంచి ఎస్ఎస్ ట్యాంకుకు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం నీటిని పంపింగ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పంపింగ్ జరుగుతున్న తీరును పరిశీలించాలని స్థానిక టీడీపీ నాయకులకు సూచించారు. ఈ క్రమంలో నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి సాగర్ ప్రధాన కాలువ నుంచి ఎస్ఎస్ ట్యాంకుకు నీటిని పంపింగ్ చేస్తున్న తీరును పరిశీలించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే పంపింగ్ నిలిపివేయకుండా జనరేటర్ సాయంతో నీటిని ఎస్ఎస్ ట్యాంకుకు చేర్చాలని ఇంజనీరింగ్ అధికారులకు రామిరెడ్డి సూచించారు. ప్రధాన కాలువలో ప్రవాహం తగ్గినా గడ్డర్లు ఏర్పాటు చేసి అదనపు నీటిని పంపింగ్ చేసుకునే విధంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకో వాలన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, బొగ్గు శేఖర్‌రెడ్డి, గుంటక శ్రీనివాసరెడ్డిలు ఉన్నారు.

ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేకు మతిభ్రమించింది

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు



వైద్యశాల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దదోర్నాల, జులై 24: ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే తాడిపత్రి చంద్రశేఖర్‌కు మతిభ్రమించిందని బీజేపీ ఇన్‌చార్జ్ ఎనుముల నాగేశ్వరరావు ఆరోపించారు. ఐనముక్కుల వద్ద నిర్మించిన సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను బీజేపీ నాయకులు ఎనుముల నాగేశ్వరరావు బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దార్శనికుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చొరవతో రాష్ట్రానికి రూ.15వేల కోట్ల నిధులను కేంద్రప్రభుత్వం అమరావతి కోసం కేటాయించడం అభినందించ తగ్గ విషయమన్నారు. ఇదేక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడాల్సిన ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఆచూకీ లేకుండా పోయి, అన్నా క్యాంటిన్ ద్వారా అతి తక్కువ ధరకు అన్నం అందిస్తుంటే, పేదలను బిక్షగాళ్లుగా సంబోధించడం హేయమన్నారు. అసలు శాసన సభ్యులుగా కొనసాగే అర్హత ఆయనకు లేదన్నారు. తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే వెలిగొండ పూర్తి కోసం మాట్లాడాల్సిన ఎమ్మెల్యే ఎక్కడ దాక్కున్నాడని ప్రశ్నించారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు మంజూరు చేసిన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణం గత ప్రభుత్వం నిర్లక్ష్యానికి బలైందన్నారు. నూతనంగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వంలో త్వరితగతిన పూర్తిచేసేందుకు పనులను పరిశీలించామన్నారు. పూర్తి నివేదికలను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఎస్ గండి వీరారెడ్డి, నాయకులు భాష అల్లూరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయండి

మంత్రి గొట్టిపాటిని కోరిన ఎరిక్షన్‌బాబు



వినతిపత్రం అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, జూలై 24: నియోజకవర్గంలోని సమస్యలతో పాటు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు కోరారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రిని కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను, చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజవవర్గంలో రైతాంగం నూరుశాతం వ్యవసాయ బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేస్తోందన్నారు. లో-ఓల్టేజీ సమస్య లేకుండా డిమాండ్ వున్న ప్రతి ప్రాంతంలో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరుతూ మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు.

పాఠశాలలో డిప్యూటీ డీఈవో ఆకస్మిక తనిఖీ



రామసముద్రంలో విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

త్రిపురాంతకం, జూలై 24: మండలంలోని రామసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాలను మార్కాపురం డిప్యూటీ డీఈవో ఏ.చంద్రమౌళీశ్వర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. నోటు పుస్తకాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులతో మమేకం కావాలని వారి సామర్థ్యాలను మరింత పెంచి మంచి మార్కులను సాధించేలా కృషి చేయాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో ఏంఈవో కెటి.మల్లిఖార్జుననాయక్, ప్రధానోపాధ్యాయుడు రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

గిద్దలూరు, జూలై 24 : రాచర్ల మండలంలోని పలు పాఠశాలలను ఎంఈవో వి.గిరిధరశర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అచ్చంపల్లి, గుడిమెట్లలోని మండల పరిషత్ పాఠశాలలను, ఒద్దులవాగుపల్లిలోని ఎయిడెడ్ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. ఇతర రికార్డులను తనిఖీ చేశారు. బాధ్యతతో పనిచేసి విద్యాబుద్దులు నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కాగా రాచర్ల మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ పెద్దలు ఎంఈవోను కలిశారు. ఆ గ్రామ పాఠశాలలో పిల్లలులేరని గతంలో గ్రామంలో పాఠశాలను మూసివేశారన్నారు. ప్రస్తుతం పాఠశాలలో చేర్పించేందుకు చాలామంది తల్లిదండ్రులు సిద్ధమైన దృష్ట్యా పాఠశాలను పునఃప్రారంభించాలని వినతిపత్రం అందచేశారు.

ఆముదం సాగులో మెలకువలు అవసరం

వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 24 : ఆముదం పైరు సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు మెలకువలు అవసరమని ఏవో విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దిగువమెట్ట గ్రామంలో సాగులో ఉన్న ఆముదం పైరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పంటసాగులో కొన్ని సలహాలు, సూచనలు చేశారు. ఆముదం పైరులో దాసరిపురుగు నామాల పురుగు అక్కడక్కడా ఉండడం గమనించి రైతులకు నివారణ చర్యలు సూచించామన్నారు. లద్దెపురుగులు తొలిదశలో ఆకులకు రంధ్రాలు ఏర్పరచి ఆకులను తింటాయన్నారు. వీటి నివారణకు వేపనూనె 5ఎంఎల్ లేదా బెసిల్లాస్ 1గ్రాము లీటరు నీటితో కలిసి ఆకులు అడుగు భాగంలో తడిచే విధంగా పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, రైతుసేవా కేంద్రం సిబ్బంది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులను వదిలేసి చిరుద్యోగిపై వేటు

అధికారుల తీరును తప్పుబట్టిన జేఎల్‌ఎం



పెద్ద దోర్నాల, జులై 24: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటనలో బాధ్యులను వదిలి చిరుద్యోగిపై విద్యుత్‌శాఖ అధికారులు వేటు వేశారు. మండలంలోని చిన్నగుడిపాడు సచివాలయం జేఎల్‌ఎంగా దూదేకుల మస్తాన్‌వలి విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 20వ తేదీన చిన్నగుడిపాడు గ్రామ పొలాల్లో మేతకు వెళ్లిన రెండు పాడి గేదెలు నేలకు దగ్గరగా ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తాకి ఘటనా స్థలంలో మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. కాగా ఈ ఘటనపై విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు చేపట్టిన చర్యల్లో భాగంగా సచివాలయం జేఎల్‌ఎం గ్రేడ్ -2 ఉద్యోగి మస్తాన్‌వలిని అందుకు బాధ్యుడిని చేశారు. ఈ నెల 22న ఉద్యోగ బాధ్యతల నుండి రిలీవ్ చేశారు. అయితే దీనిపై మస్తాన్‌వలి స్పందిస్తూ.., ఘటనకు తనను అన్యాయంగా బాధితుడిని చేశారన్నారు. అసలు 11కేవి లైను పర్యవేక్షణ తన పరిధిలోనిది కాదన్నారు. అయినా ఈ నెల 7న ట్రాన్స్‌ఫార్మర్ నేలకు దగ్గరగా ఉందని ఏ ప్రమాదమైనా జరిగే అవకాశముందని అబ్జర్వేషన్ లిస్టులో నమోదు చేశాన్నారు. లైన్‌మెన్ నాయక్‌కు కూడా విషయం తెలియజేసినట్లు తెలిపారు. తీరా గేదెలు మృతిచెందితే తనను బాధ్యున్ని ఎలా చేస్తారని ఆయన ఆందోళన వెలిబుచ్చాడు. ఆ ఘటనలో లైన్‌మెన్, ఏఈల పొరబాటు ఉంటే ఉన్నతాధికారి డీఈ తనను బాధ్యుడిని చేశారన్నారు. లైన్‌మెన్, డీఈలు ఉద్దేశ్య పూర్వకంగా తనను రిలీవ్ చేశారని ఆరోపించాడు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని మస్తాన్ వలి కోరాడు.

విధుల్లోకి తీసుకుంటాం

ఈ విషయమై విద్యుత్తుశాఖ ఏఈ నాగేంద్ర రెడ్డిని వివరణ కోరగా మస్తాన్ వలిని త్వరలోనే విధుల్లోకి తీసుకుంటామని తెలిపారు. ఏది ఏమైనా ఉద్యోగం నిర్వహణలో అందరూ అప్రమత్తంగా ఉండాలని అది నాది ఇది నీదంటూ కొలతలు లేకుండా బాధ్యతలు నిర్వహించాలన్నారు.

నాగేంద్ర రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ


కనిగిరి సమస్యలపై కలెక్టర్‌కు నివేదిస్తున్న మున్సిపల్‌చైర్మన్ గఫార్

100 పడకల ఆసుపత్రిగా మార్చాలి

● కలెక్టర్‌కు మున్సిపల్ చైర్మన్ గఫార్ వినతి

కనిగిరి, జూలై 24: కనిగిరి ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ కలెక్టర్ తమీమ్‌అన్సారియాకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఒంగోలులో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసి కనిగిరి సమస్యలను వివరించారు. 50పడకల ఆసుపత్రిగా కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో ప్రస్తుతం సేవలు అందుతున్నాయని వివరించారు. పెరిగిన జనాభాతో పాటు అధునాతన వైద్యం అందించేందుకు 100 పడకలుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ విషయంపై వైద్యఆరోగ్య కమిషనర్ వద్ద సంబంధిత ఫైలు పెండింగ్‌లో ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. పెండింగ్‌లో ఉన్న ఆ సమస్యను పరిష్కరించి మంజూరు ఉత్తర్వులు జారీ అయ్యేవిధంగా చూడాలని అభ్యర్థించారు. అదేవిధంగా ఆసుపత్రిలో ఉన్న డయాలసిస్ విభాగానికి కూడా ప్రత్యేక భవనాన్ని మంజూరు చేయాలని కోరారు. ఆసుపత్రి భవనంలో పలు చోట్ల స్లాబ్ పెచ్చులూడి పడిపోతుందని, నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న షెడ్యూలు తెగల బాలుర వసతిగృహం నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయించాలని,అదే విధంగా షెడ్యూల్డ్ కులాల హాస్టల్ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జాతీయస్థాయి పోటీలకు దొనకొండ జడ్పీ విద్యార్థులు

దొనకొండ, జూలై 24 : దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న జి. కోటేష్, ఎంవీ సంజనలు క్రీడల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె. నర్సింహారావు తెలిపారు. ఈనెల 21వ తేదీన నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో నెట్ బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు నిర్వహించిన సెలక్షన్స్‌లో పాల్గొని క్రీడలో ప్రతిభ కనబర్చటంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 25 వ తేదీ నుంచి 28వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలోని ఖరక్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టులో పాల్గొంటారని తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో హెచ్‌ఎం రామాంజనేయులు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శిస్తూ ముందుకు సాగుతూ జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వటం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ తరుపున జాతీయస్థాయిలో దొనకొండ జడ్పీ పాఠశాల పేరును వినిపించాలని కోరుతూ ఇరువురు విద్యార్థులను, పీడీ నర్సింహారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎంపీడీవో రమణారావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

రమణారావు అకాల మృతికి సంతాపం

పామూరు, జూలై 24 : ఏలూరుజిల్లా నరసాపురం ఎంపీడీవో వెంకట రమణారావు విషాదకర మరణానికి చింతిస్తున్నట్లు పామూరు ఎంపీడీవో పుట్టారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద రమణారావు చిత్రపటానికి సిబ్బందితో కలిసి బుధవారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మరణం మీద పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి దోషులను చట్టపరంగా శిక్షించి కుటుంబానికి న్యాయం చేయాలని, తద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు ఒత్తిళ్ల నుంచి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సంతాప కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేఎస్ శ్రీనివాసరావు, ఎస్‌వో వి. శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

దర్శి, జూలై 24 : ప్రజలు పోస్టల్ శాఖ ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం డివిజనల్ సూపరింటెండెంట్ జీవీ శ్రీనివాసులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పోస్టల్ ఉద్యోగులు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎంతో నమ్మకంగా కొనసాగుతున్న సేవింగ్స్, బీమా పథకాలను గ్రామీణ ప్రాంతాలకు చేరే విధంగా చూడాలన్నారు. అధికశాతం ప్రజలు పోస్టల్ శాఖలో డిపాజిట్ చేసే విధంగా చైతన్యవంతులను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ సూపరింటెండెంట్ మదన్‌మోహన్, పొదిలి సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంఈవో కె. రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

దర్శి, జూలై 24 : టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తుందని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఒకొక్కరికి రూ.15వేలు చెప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు.జిల్లాను వెనుకబడిన ప్రాంతంగా కేంద్రప్రభుత్వం ప్రకటించే విషయంతో చొరవ తీసుకున్న కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీ ద్వారా విడుదలయ్యే నిధుల ద్వారా జిల్లాతో పాటు దర్శి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో పలు పథకాలకు ఇప్పటికే నిధులు విడుదల చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

తాళ్లూరులో ఫాగింగ్

తాళ్లూరు, జూలై 24 : దోమలు తాకిడి ఉధృతంగా ఉండటంతో తాళ్లూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ మేకల చార్లెస్ సర్జన్, పంచాయతీ కార్యదర్శి షేక్ నూర్ అహమ్మద్ ఆధ్వర్యంలో తాళ్లూరులో బుధవారం ఫాగింగ్ చేపట్టారు. వర్షాలు కురుస్తున్నందున దోమల వ్యాప్తి చెందుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రామంలోని అన్నివీధుల్లో ఫాగింగ్ చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నూర్‌అహమ్మద్, కార్మికులు పి.రామారావు పాల్గొన్నారు.

కాలువలకు పుష్కలంగా సాగర్ జలాలు

మంచినీటి చెరువులకు నీరు పంపింగ్

దర్శి, జూలై 24 : కాలువలకు సాగర్ జలాలు పుష్కలంగా సరఫరా అవుతున్నాయి. తాగునీటి అవసరాల కోసం మంచినీటి చెరువులకు నీరు నింపేందుకు నాలుగు రోజుల క్రితం సాగర్ కాలువలకు నీరు విడుదల చేశారు. ప్రస్తుతం సాగర్ కుడికాలువకు డ్యామ్ నుంచి 5,600 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. అక్కడ నుంచి జిల్లా బార్డర్ 85/3వ మైలు వద్దకు చేరేసరికి 2,795 క్యూసెక్కులు, దర్శి బ్రాంచ్ కాలువకు 2,170 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువకు 1,349 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం సాగర్ కాలువలకు విడుదల అవుతున్న నీటిని రామతీర్థం జలాశయంతో పాటు జిల్లాలోని అన్నీ వనరులను నింపుతున్నారు. దర్శి నియోజకవర్గంలోని దర్శి, కురిచేడు, చందవరం మంచి నీటి చెరువులకు నీటిని నింపుతున్నారు. దర్శిలో ఉన్న కనిగిరి చెరువుకు నీరు పంపింగ్ చేస్తున్నారు. దర్శి ఎన్‌ఏపీ చెరువుకు రోజుకు 80 మిలియన్ లీటర్ల నీరు పంపింగ్ చేస్తున్నారు. అధికారులు 100 హెచ్‌పీ మోటార్లు నాలుగు, 200 హెచ్‌పీ మోటార్లు రెండు, 75 హెచ్‌పీ మోటార్లు మూడు ఏర్పాటు చేసి నిరంతరం పంపింగ్ చేస్తున్నారు. దర్శి ఎన్‌ఏపీ చెరువు పూర్తి సామర్థ్యం 2,540 మిలియన్ లీటర్లు. సాగర్ జలాలు పది రోజులు పాటు సరఫరా అవుతాయని ఎన్‌ఏపీ అధికారులు తెలుపుతున్నారు. ఎక్కడికక్కడ లాకులు బిగించి మరో ఐదు రోజులు నీరు పంపింగ్ చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

అధికారుల అంచనా ప్రకారం దర్శి చెరువుకు 50 శాతం, మిగిలిన చెరువులకు 75 శాతం నీరు నింపే అవకాశం ఉంది. ఈ ఏడాది జలాశయాలకు పుష్కలంగా నీరు చేరుతున్నందున పంటల సాగుకు నీరు విడుదల చేసే అవకాశం ఉంది. మంచినీటి చెరువులకు మిగిలిన భాగాన్ని ఆ సమయంలో చెరువులు నింపే అవకాశం ఉంటుంది.


దర్శి కాలువలో పుష్కలంగా ప్రవహిస్తున్న జలాలు


పంపింగ్ చేస్తున్న మోటార్లను పరిశీలిస్తున్న అధికారులు

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండ

డీఈఈ హరిబాబు

కనిగిరి, జూలై 24: విద్యుదాఘాతం ఘటనలో దుర్మరణం చెందిన ముగ్గురు యువకుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈఈ హరిబాబు అన్నారు. స్థానిక డీఈఈ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రమాదానికి దారి తీసిన కారణాలను ఆయన వెల్లడించారు. పునుగోడు పరిధిలోని 11కేవి విద్యుత్ లైను గాలులకు తెగి పడిపోయిందని తెలిపారు. ఆ సమయంలో 11కేవీ సప్లయి ట్రిప్ అయిందని తెలిపారు. ప్రధానంగా విద్యుత్‌శాఖ నిబంధనల ప్రకారం ఏ కారణాల చేతనైనా విద్యుత్ ట్రిప్ అయితే ఎక్కడో షార్ట్ అయిందని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దీంతో సప్లయి ట్రిప్ అయిన తర్వాత 15 నిమిషాల పాటు తిరిగి సప్లయి చార్జి చేయబోమని చెప్పారు. 15 నిమిషాల్లో ఎవరైనా విద్యుత్ షార్ట్ విషయాలను సమాచారం అందిస్తారని తెలిపారు. ఒకవేళ సమాచారం అందని పక్షంలో తిరిగి సప్లయి రీచార్జ్ చేస్తామన్నారు. పునుగోడు ఘటనలో కూడా ఆ విధానాన్ని తీసుకున్నట్లు తెలిపారు. 15 నిమిషాలు ఆగిన తర్వాత రీచార్జ్ చేశామని వివరించారు. రీచార్జ్ చేసిన సమయంలో తెగి పడిన 11కేవీ వైరు చిల్లచెట్లపై పడి ఉండటంతో సప్లయి ట్రిప్ కాకుండా నిలబడిందన్నారు. ఒకవేళ గాలులకు ఎక్కడైనా సాధారణ ట్రాకింగ్ వలన జరిగి ఉండొచ్చని భావించినట్లు తెలిపారు. అదే సమయంలో విద్యార్థులు స్కూటీపై రోడ్డులో ఎడమవైపు చిల్లచెట్లు పక్కగా రావటంతో సప్లయి వైరు తగిలి మంటలు ఏర్పడి అక్కడికక్కడే మృతి చెందటం బాధాకరమన్నారు. దీంతో తిరిగి సప్లయి ట్రిప్ అయిందని వివరించారు. ఈ ఘటనలో విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం లేదని చెప్పారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటనకు విద్యుత్‌శాఖతోపాటు, ప్రభుత్వం కూడా వారి కుటుంబాలకు అండగా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మృతులు కుటుంబాలకు రూ. 5లక్షలు ఎక్స్‌గ్రేషియా అందజేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అయితే పింగాణీ ఇన్సులేటర్‌కు ఉన్న బోల్టు ఊడిన విషయాన్ని తోసిపుచ్చటం విశేషం. ఈ సమావేశంలో డీఈ ఆర్. ఉమాకంత్, ఏఈ పవన్‌కుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఈ హరిబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ ఎస్‌ఏ కరీం

గ్రామాల్లో ప్రమాదకర స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు గుర్తించండి

● ట్రాన్స్‌కో ఈఈ ఎస్‌కే కరీం

ముండ్లమూరు, జూలై 24 : ముండ్లమూరు, తాళ్లూరు సబ్ స్టేషన్‌ల పరిధిలో సిబ్బంది ప్రమాదకరమైన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వేలాడుతున్న విద్యుత్ లైన్, రోడ్డు క్రాసింగ్ దగ్గర లైన్‌లను గుర్తించాలని దర్శి డివిజన్ ట్రాన్స్ ఈఈ ఎస్‌ఏ కరీం ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక సబ్ స్టేషన్‌లో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జూనియర్ లైన్ మన్, లైన్‌మన్, ఎనర్జీ అసిస్టెంట్ సంయుక్తంగా గ్రామాలకు వెళ్ళి ప్రమాదకర విద్యుత్ లైన్‌లను గుర్తించాలన్నారు. ఈనెలాఖరు వరకు ప్రతి సిబ్బంది వారి పరిధిలో ఉన్న గ్రామాలకు వెళ్ళి శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు, ప్రమాదకరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న విద్యుత్ తీగలతో పాటు రహదారులు క్రాసింగ్ వద్ద విద్యుత్ తీగలను గుర్తించి తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతుల నుంచి వ్యవసాయ కనెక్షన్‌ల కోసం సిబ్బంది డబ్బులు వసూలు చేయకూడదన్నారు ఈ కార్యక్రమంలో ఏడీఈ కే పిచ్చయ్య, ఏఈ వీరబ్రహ్మం, సబ్ ఇంజనీరు ఇమ్మానియేలు బాబు, లైన్ ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, రెండు మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించండి

దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్

దొనకొండ, జూలై 24 : ఈ ఏడాది గ్రామాల్లో వ్యవసాయ భూములను కౌలుకు తీసుకొని సాగుచేస్తున్న కౌలు రైతులను గుర్తించి వారికి కౌలురైతు అర్హత కార్డులు అందించాలని దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కె. బాలాజీ నాయక్ సూచించారు. మండలంలోని పోలేపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సొంత పొలం సాగుచేస్తున్న రైతుల మాదిరిగానే కౌలు రైతులకు కూడా ప్రభుత్వ పథకాలు అందించేందుకు కౌలు కార్డులు తప్పనిసరి అన్నారు. వ్యవసాయ భూమి కౌలుకు తీసుకున్న రైతుకు ఆ ఏడాది పంట మీద మాత్రమే హక్కు కలిగి ఉంటాడని, పొలం మీద ఎటువంటి హక్కు ఉండదన్నారు. కౌలు రైతులు కౌలు కార్డు తీసుకోవటం వలన ప్రభుత్వం అందించే అన్నీ రకాల పథకాలను పొందేలా ఉపయోగపడుతుందన్నారు. దరఖాస్తులు చేసుకున్న మూడు రోజుల్లో కౌలు కార్డు మంజూరవుతుందని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రతి రైతుసేవా కేంద్రంలో గ్రామ రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులు సచివాలయాల సిబ్బంది గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించాలని కోరారు. మండలంలోని కౌలు రైతులందరూ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, వీఆర్వో గాలయ్య, గ్రామ కార్యదర్శి రామాంజనేయరెడ్డి, వీఏఏలు వీరాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్‌డీవో సుబ్బారెడ్డి

ధ్రువీకరణ పత్రాలు పొందాలి

తాళ్లూరు : కౌలుకుసాగు చేసుకుంటున్న రైతులు తప్పక పంట సాగు ధ్రువీకరణపత్రాలు పొందాలని ఒంగోలు రెవెన్యూ డివిజన్ అధికారి జీవీ సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని కొర్రపాటివారిపాలెం, తాళ్లూరు,విఠలాపురం, లక్కవరం, తూర్పుగంగవరం, దారంవారిపాలెం, నాగంబొట్లపాలెం గ్రామాల్లో కౌలు రైతులకు, భూయజమానులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

బుధవారం ప్రచార పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియోల్‌రాజు ,ఆయాగ్రామాల రైతుసేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు,డీబీఆర్పీ ఏరియా కోఆర్డినేటర్ గోపబోయిన వెంకట్రావు, గ్రామ రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా - డ్రైవర్ మృతి

సీఎస్‌పురం(పామూరు) జూలై 24 : ఆటో అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని అరివేముల వద్ద చోటు చేసుకొన్నది. మండలంలోని గోగులపల్లి గ్రామానికి చెందిన గర్రం గురవయ్య(65) ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు అద్దె నిమిత్తం తువ్వగుంట గ్రామంలో కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో అరివేముల గ్రామ ప్రవేశ మలుపులో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న గురవయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సీఎస్ పురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


మృతుడు డ్రైవర్ గురవయ్య

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

దొనకొండ, జూలై 24 : జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించేలా ఉపాధి సిబ్బంది అవగాహన కల్పించాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ పీవీ రమణ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో రైతులు పండ్లతోటలు నాటుకోవాలని, అందుకు ప్రభుత్వం అందించే సహకారం, నాటిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెగుళ్ల నివారణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వసంతరావునాయక్, ఉద్యానఅధికారి రమేష్, డుమా కోర్సు డైరెక్టర్ శ్యాంసన్, ఏపీవో తగరం దేవయ్య, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి, జూలై 24 : రైతులు పంటలసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం కోర్డినేటర్ డాక్టర్ బి. రమేష్ సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం షెడ్యూల్ కులాల రైతులకు మిరప పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడి ఖర్చులు తగ్గించుకొని నాణ్యమైన దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం శివ, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి

సీఎస్‌పురం(పామూరు) జూలై 24 : పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించి కూలీలను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు ఎం. రత్నారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని అరివేముల గ్రామంలో ఉపాధి పెండింగ్ బి ల్లులను వెంటనే చెల్లించాలన్నారు. ప నులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని సిబ్బందికి అందజేశారు.


రెవెన్యూ సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సుబ్బారెడ్డి

పెండింగ్ భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

● ఆర్డీవో సుబ్బారెడ్డి

ముండ్లమూరు, జూలై 24 : దీర్ఘ కాలంగా పెండింగ్ ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. హాజరైన వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గతంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలతో పాటు ప్రస్తుతం నూతన ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మీ కోసం కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించక పోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్జీదారుడికి ఎన్ని రోజుల్లో సమస్య పరిష్కరిస్తారో స్పష్టంగా తెలియజేయాలన్నారు.రెవెన్యూ రికార్డుల్లో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. మండలంలోని పసుపుగల్లులో విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు ఇటీవల స్పందనలో కలసి తమకు ఇచ్చిన భూములను ఇతరులు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. వెంటనే ఆక్రమణ దారులకు నోటీసులు ఇవ్వాలని తహసీల్దార్ మధుబాబును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు జీ పుల్లారెడ్డి, ఏ స్రవంతి, సీనియర్ అసిస్టెంట్ పీ శేసగిరిరావు, ఆర్ఐ ప్రసాదు తదితరులు ఉన్నారు.


శ్రీమేఘన న్యూట్రిన్ ఫీడ్స్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు

నాణ్యమైన దాణా తయారు చేయాలి

తాళ్లూరు, జూలై 24 : పశువులకు నాణ్యమైన దాణాతయారు చేసి అందించాలని అక్రిడిటేషన్ కమిటీసభ్యులు ఒంగోలు ఆర్‌డీవో జి.వి.సుబ్బారెడ్డి, పశువైద్యశాఖ ఉప సంచాలకులు ఎ.రమేష్‌బాబులు తెలిపారు. తాళ్లూరులోని శ్రీ మేఘన న్యూట్రిన్‌ఫీడ్స్ ప్లాంట్‌ను అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఉపసంచాలకులు డాక్టర్ రమేష్‌బాబు దాణా తయారీకి వినియోగించే ముడి పదార్థాల నిల్వలను తేమకు అవకాశం లేకుండా చేసుకోవాలన్నారు. వెటర్నరీ పాలిక్లీనిక్ ఉపసంచాలకులు డాక్టర్ దారా సురేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పొల్యూషన్ అనుమతి లేనందున వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పలుగ్రామాల్లోని పాలడెయిరీ ఫారాలను పరిశీలించారు. తాళ్లూరు గ్రామంలో పశువైద్యశాఖ ఉపసంచాలకులు రమేష్‌బాబు రైతులకు సబ్సిడీపైన గడ్డి జొన్నలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌పీవో జి.కాంతన్, ఏపీసీ వై.భాస్కర్ వర్మ, స్థానిక పశువైద్యులు వి.ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియోల్, మేఘన న్యూట్రిన్స్ ఫీడ్స్ ప్లాంట్ నిర్వాహకులు పోశం మధుసూదన్‌రెడ్డి, కోటరామిరెడ్డి పశువైద్య సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల పేర్లను ఆన్‌లైన్ చేయాలి

సీఎస్‌పురం(పామూరు) జూలై 24 : అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు అయిన ప్రతి లబ్ధిదారుని పేరును ఆన్‌లైన్‌లో తప్పని సరిగా నమోదు చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దేవాకృపావరం సూచించారు. వెలిగండ్ల ఐసీడీసీ ప్రాజెక్టు సెక్టారు మీటింగ్ బుధవారం సీఎస్‌పురంలో నిర్వహించారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తల పనితీరుపై సమీక్షించారు. బ్లాక్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సామ్యేల్, డీఈవో రసూల్, సెక్టార్ యాక్టివ్ సూపర్‌వైజర్ సరళ, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ దేవాకృపావరం



ర్యాగ్యాంగ్‌లు

- పురివిప్పుతున్న ర్యాగింగ్ భూతం

- ఐదేళ్ల అలసత్వం.. రెచ్చిపోతున్న విద్యార్థులు
- తూతూ మంత్రంగా పోలీసుల పర్యవేక్షణ
- గత ప్రభుత్వం నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం
- నర్సరావుపేట సంఘటనతో తల్లిదండ్రుల్లో కలవరం



ఒకప్పుడు విద్యాసంస్థల్లో ర్యాగింగ్ చేయాలనే ఆలోచన వస్తేనే సీనియర్లు హడలిపోయేవారు.....కొత్త విద్యాసంత్సరం ప్రారంభం కాగానే పోలీసు ఉన్నతాధికారులు ఉన్నత విద్యాసంస్థల్లో ప్రత్యక్షం అయ్యేవారు..విద్యార్థుల హాస్టల్స్, బస్సుల్లో ర్యాగింగ్ వల్ల ఎదురయ్యే సమస్యలపై విస్తృత ప్రచారం నిర్వహించేవారు..ర్యాగింగ్‌పై అవగాహన కల్పిస్తు విస్తృత స్థాయిలో సదస్సులు నిర్వహించేవారు..ప్రతి కళాశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యాజమాన్యాలతో ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు అయ్యే వి..ర్యాగింగ్ భూతంపై ఉక్కుపాదం మోపడంతోపాటు కఠిన శిక్షలు అమల చేసేవారు..ఇందుకు యాజమాన్యాలు తమవంతు సహకారం అందించేవి.



నరసరావుపేటలో విద్యార్థులను కర్రలతో కొడుతున్న సీనియర్ విద్యార్థులు

గుంటూరు(విద్య), జూలై 24: ఐదేళ్ళ క్రితం వచ్చిన జగన్ ప్రభుత్వంలో కళాశాలల్లో ర్యాగింగ్ కమిటీలు దాదాపు నిర్వీర్యం అయ్యాయి. ప్రతిపక్ష పార్టీ నాయకుల వేధింపులకే పరిమిత మైన పోలీసు వ్యవస్థ విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌పై నిర్లక్ష్యం వహించారు. తూతూ మంత్రంగా సమావేశాలు ఏర్పాటు చేయడంతోపాటు కళాశాలలపై నిఘా పూర్తి స్థాయిలో తగ్గిపోయింది. ఫలితంగా కళాశాలల్లో ర్యాగింగ్ భూతం చాపకింద నీరులా విస్తృతం అయింది. కొత్త విద్యార్థుల పాలిట ర్యాగింగ్ శాపంగా మారింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో నర్సరావుపేటలోని ఓ కళాశాల హాస్టల్‌లో జూనియర్ విద్యార్థి పట్ల సీనియర్ విద్యార్థులు ప్రవర్తించిన తీరు విద్యార్థులు, తల్లిదండ్రుల్ని ఉలిక్కిపడేలా చేసింది. జూనియర్ విద్యార్థిపై సీనియర్ విద్యా ర్థులు కర్రలతో దాడిచేస్తూ మానవతకే మచ్చ తెచ్చేలా వ్యవహారించిన తీరు సామాజిక మాధ్య మాల్లో వైరల్ అయింది.

ఇదీ ఉమ్మడి జిల్లా స్వరూపం..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ యూనిర్సిటీ, ప్రఖ్యాత డీమ్డ్ యూనివర్శిటీలు, ఇంజనీరింగ్, మెడిసిన్, నర్సింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలు దాదాపు 100పైగానే ఉన్నాయి. ఆయా విద్యాసంస్థల్లో దాదాపు 1.20లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు జిల్లాలో విద్యాను అభ్యసిస్తున్నారు. ఈనేపథ్యంలో నూతన ప్రభుత్వం ర్యాగింగ్‌పై విస్తృత చర్యలు తీసుకోవాల్సి ఉంది. ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి, పోలీసుల ఆధ్వర్యంలో అంతర్గతంగా పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి,పోలీసుల నంబర్స్ కళాశాల్లో అన్ని ప్రాంతాల్లోని నోటీసు బోర్డుల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఈ అయిదేళ్ళలోఎక్కడా ఇటువంటి చర్యలు తీసుకున్న దాఖాలు లేవు.కొన్ని చోట్లు తూతూ మంత్రంగానే సమావేశాలు నిర్వహించారని, ఇందులో తల్లిదండ్రుల్ని భాగస్వాములు చేయడం లేదు. ఫలితంగా ర్యాగింగ్ చాపకింద నీరులా విద్యాసంస్థల్లో విస్తరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి.

ర్యాగింగ్‌కు పాల్పడితే..ఇవీ శిక్షలు

విద్యార్థులను అసభ్య పదాలతో దూషించడం...వారి పట్ల అవమానకరంగా ప్రవర్తించడం వంటి నేరాలకు ఆరునెలలు జైలు శిక్షతోపాటు, జరిమానా విధిస్తారు...ఒక్కోసారి రెండూ అమలు చేయవచ్చు.

- ర్యాగింగ్ పేరుతో విద్యార్థుల్ని గాయపర్చడం,అసభ్యకరంగా ప్రవర్తించేలా చేయడం.. వారి పట్ల క్రూరంగా వ్యవహారించడం చేస్తే సంవత్సరం వరకు జైలుశిక్షణ, జరినామా విధిస్తారు. ర్యాగింగ్ చేస్తూ పట్టుబడినా, ర్యాగింగ్‌చేసినట్లు రుజువైనా ఒక్కోసారి అయిదు సంవత్సరాల పాటు జైలుశిక్ష, జరిమానా విధించడంతోపాటు విద్యార్థి ఏ విద్యాసంస్థలో కూడా చదకుండా టీసీపై రిమార్కువేస్తారు. అంతేకాదు అప్పటి వరకు సదరు విద్యార్థిపై ప్రభుత్వం వెచ్చించిన ఖర్చు వసూలు చేయడంతోపాటు, కళాశాల నుంచి పూర్తిస్థాయిలో డీబార్ చేస్తారు. ఇదీ కనీసం రెండు సంవత్సరాలు లేదా ఒక్కోసారి విద్యార్థి జీవితకాలం అమలు అయ్యే అవకాశం ఉంది.. ఇప్పటికే ఇంటర్ విద్యాసంత్సరంతోపాటు ఇంజనీరింగ్ కళాశాలలు ప్రారంభం అయ్యాయి. కొద్దిరోజుల్లో అన్ని విద్యాసంస్థలు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు విస్తృతం చేయనున్నాయి. ఈనేపథ్యంలో జూనియర్ విద్యార్థుల్ని సీనియర్స్ ర్యాగింగ్ చేయడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- విద్యార్థుల ప్రయాణించే బస్సుల్లో, హాస్టల్స్‌లో, విద్యార్థులు బస చేసే ప్రైవేటు హాస్టల్ గదుల్లో విస్తృత పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీలు చేయడం పాటు ర్యాగింగ్‌ను అరికట్టడానికి కళాశాలల యాజమాన్యాలకు నిర్థిష్టమైన దిశానిర్దేశం చేయాల్సి ఉంది.

అమృత్‌తో.. అద్భుతంగా..

- రైల్వేస్టేషన్లలో అంతర్జాతీయ ప్రమాణాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 12 స్టేషన్ల ఎంపిక
- రైల్వే బడ్జెట్‌లో పొందుపరిచిన కేంద్ర ప్రభుత్వం

గుంటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అత్యాధునికంగా.. అంతర్జాతీయ స్థాయిలో.. అద్భుతంగా.. ప్రయాణికులకు కొత్త అనుభూతి కలిగించేలా రైల్వే స్టేషన్లు అభివృద్ధి చెందనున్నాయి. కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ప్రకటించిన రైల్వేబడ్జెట్‌లో అమృత్ రైల్వేస్టేషన్లు, ప్రయాణికుల సౌకర్యాలకు అగ్ర తాంబూలం ఇచ్చింది. ఈ క్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 12 రైల్వేస్టేషన్లను అమృత్ రైల్వేస్టేషన్లుగా ఎంపిక చేసింది. కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమికి చెందిన డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ఉండటంతో ఉమ్మడి గుంటూరు జిల్లాకు భారీగానే మేలు జరుగుతోన్నది. ఇప్పటికే అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయాన్ని ఇప్పించనున్నట్లు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం రైల్వేకు కూడా ఆశాజనకంగా నిధులు కేటాయించింది. ముఖ్యంగా ప్రయాణికుల సదుపాయాలకు పెద్దపీట వేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 12 రైల్వేస్టేషన్లను అమృత్ స్టేషన్ ప్రాజెక్టుకి ఎంపిక చేసింది. దీంతో ఆయా స్టేషన్లకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నది. ఇప్పటికే చేపట్టిన వివిధ రకాల పనులతో స్టేషన్ల ముఖచిత్రాలే సమూలంగా మారిపోయాయి. ముఖ్యంగా స్టేషన్ బిల్డింగ్, సర్క్యులేటింగ్ ఏరియా, టిక్కెట్ కౌంటర్లు, ఫుట్ బ్రిడ్జీలు, ఎస్కలేటర్లు, లిఫ్టులతో ప్రయాణికులకు వాటిని సౌకర్యవంతంగా మార్చింది. తాజాగా కేంద్ర బడ్జెట్‌లో బాపట్ల, చీరాల, గుంటూరు, మాచర్ల, మంగళగిరి, నడికుడి, నరసరావుపేట, పిడుగురాళ్ల, రేపల్లె, సత్తెనపల్లి, తెనాలి, వినుకొండ రైల్వేస్టేషన్లను అమృత్ పథకం కింద ఎంపిక చేసినట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఇక గుంటూరు డివిజన్ పరిధిలో కంభం, దొనకొండ, గిద్దలూరు, మార్కాపురం రోడ్డు, నంద్యాల రైల్వే స్టేషన్లు కూడా ఉన్నాయి. దీంతో ఆయా స్టేషన్ల రూపురేఖలు మారిపోనున్నాయి. కాగా గతంలో పైన పేర్కొన్న రైల్వేస్టేషన్లలో చాలా వాటికి ఒకవైపు మాత్రమే ప్రవేశానికి అనుమతి ఉండేది. దీంతో ప్రయాణికులు రైల్వేస్టేషన్‌కు చేరుకోవడానికి చుట్టూత తిరిగి రావాల్సి వచ్చేది. అమృత్ స్టేషన్ కింద వీటికి రెండు వైపులా భవనాలు నిర్మించడం వల్ల సులభతరంగా స్టేషన్‌లోకి చేరుకోవచ్చు. వైఫై కియోస్క్‌లు ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తారు. కొన్ని రైల్వేస్టేషన్లలో ఫుడ్‌కోర్టులు వంటివి కూడా ఏర్పాటు చేసి సిటీ సెంటర్లుగా మారుస్తారు. ఆయా సదుపాయాల వల్ల ప్రయాణికులకు స్టేషన్‌లోకి ప్రవేశించగానే కొత్త అనుభూతి కలుగుతుంది.



మత్తులో.. వీరంగం

- విచ్చలవిడిగా లభిస్తోన్న గంజాయి
- ఆ మత్తులో చెలరేగిపోతున్న యువతరం
- తాజాగా అమృతలూరులో పోలీసులపైనే దాడి యత్నం
- గుంటూరు శివార్లలో గంజాయి మత్తులో విద్యార్థులు
- సెబ్ దాడి.. పట్టుబడిన ఇద్దరు.. ఒకరు ఎక్సైజ్ కానిస్టేబుల్ తనయుడు

చదువుకుని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాల్సిన విద్యార్థులు, పనులతో జీవనం సాగించుకోవాల్సిన యువత గంజాయి మత్తుకు బలవుతుంది. విచక్షణ మరిచి తామేమి చేస్తున్నామో కూడా తెలియనట్లుగా వ్యవహరిస్తోంది. గంజాయి కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు చేస్తున్న ప్రకటనలు ఎక్కడా కనిపించడంలేదు. విచ్చలవిడిగా దొరుకుతున్న గంజాయి మత్తులో విద్యార్థులు, యువకులు చెలరేగి పోతున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తు న్నాయి. తాజాగా అమృతలూరులో కొందరు యువకులు గంజా యి, మద్యం మత్తులో ఓ ఆర్టీసీ బస్సు ఎక్కి అడ్డుకో బోయిన ప్రయాణికులు, పోలీసులపై దాడికి దిగారు. ఇక గుంటూరు శివార్లలో కళాశాల వేళల్లో కొంద రు విద్యార్థులు మూకుమ్మడిగా గంజాయి మత్తులో జోగుతూ ఉండటం చూసి సెబ్ అధికారులే విస్తుపోయారు.

గుంటూరు, జూలై 24: అమృతలూరులో బుధవారం చోటుచేసుకున్న ఘటన స్థానికంగా భయాందోళనలు సృష్టించింది. గంజాయి, మద్యం మత్తులో గ్రామానికి చెందిన సంకే యశ్వంత్, కంచర్ల శరత్, ఆసోది సతీష్‌రెడ్డి అనే యువకులు ఆర్టీసీ బస్సు, పోలీసు వాహనంపై కూడా దాడికి పాల్పడ్డారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులను ఎక్కించుకునే నిమిత్తం తెనాలి నుంచి పొన్నూరు వెళ్లతున్న ఆర్టీసీ బస్సు నిలిచి ఉంది. ఈ క్రమంలో యశ్వంత్ అనే యువకుడు బస్సులో ప్రవేశించి విద్యార్థులు, ప్రయాణికులపై దౌర్జన్యం చేశాడు. బస్సును నడుపుతా అంటూ డ్రైవర్‌ను పక్కకు నెట్టే ప్రయత్నం చేశాడు. అయితే డ్రైవర్ చాకచక్యంగా తాళాలు తీసుకోగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ యశ్వంత్ బస్సు అద్దాన్ని పగలగొట్టాడు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళా పోలీసు వెంటనే ఎస్‌ఐ నవీన్‌కుమార్ సమాచారం అందించగా ఆయన మరికొంత సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ఎస్‌ఐ, సిబ్బంది మత్తులో ఉన్న యువకులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో మరింత రెచ్చిపోయిన యువకులు నానా దుర్భాషలాడుతూ, పోలీసులపై దురుసుగా ప్రయత్నించారు. వారిని తీసుకువెళ్లేందుకు తీసుకువచ్చిన వాహనం అద్దాలు కూడా పగలగొట్టారు. దీంతో స్థానికులు మరింత భయాందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు పోలీసులు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయికి అడ్డాగా మారిందా

అమృతలూరు, పెదపూడి, యలవర్రు, పాంచాళవరం గ్రామాల్లో విచ్చలవిడిగా గంజాయి అందుబాటులో ఉంటుందని స్థానికులు తెలిపారు. గంజాయి, మద్యం మత్తులో ఏమి చేస్తున్నారో కూడా తెలియకుండా కొందరు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ ఘటన కూడా ఆ కోవకు చెందినదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగినా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి గ్రామాల్లో గంజాయితో పాటు, మద్యం బెల్టు షాపుల ద్వారా ఏరులై పారుతుందన్న విషయం తెలిసిందే. ఇకనైనా పోలీసులు ప్రేక్షక పాత్ర వదిలి కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సెబ్ దాడి.. మత్తులో విద్యార్థులు

అద్దాలు పగిలిన ఆర్టీసీ బస్సు

గుంటూరు(కార్పొరేషన్): ఇంజనీరింగ్ విద్యార్థులు కొం దరు గుంటూరు నగర శివారు జాతీయ రహదారి ఆనుకుని ఉన్న బొంతపాడు గ్రామ సమీపంలో మూకుమ్మడిగా మత్తు మందు తీసుకుంటున్నారు. ఈ విషయం సెబ్ అధికారులకు సమాచారం అందింది. దీంతో సెబ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఇద్దరు విద్యార్థులు పట్టుబడగా మరి కొంత మంది విద్యార్థులు పరారయ్యారు. ఆ ఇద్దర్ని విచారించగా ఒకరు పల్నాడు జిల్లాకు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ కుమారుడని తేలింది. విద్యార్థుల వద్ద ఉన్న మత్తు మందును స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థులకు మత్తు మందు ఎక్కడి నుంచి వస్తుందనే సమాచారాన్ని సెబ్ ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు.

ఏరివేతకు కసరత్తు

- నకిలీ పింఛన్‌లపై అధికారుల దృష్టి
- గత ప్రభుత్వంలో పెద్ద ఎత్తున అనర్హులకు లబ్ధి
- అర్హులైన వారికి మొండిచెయ్యి



బాపట్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల మంజూరు విషయంలోనూ గత ప్రభుత్వంలో నేతలు అనేక అవకతవకలకు పాల్పడినట్లు తెలుస్తోంది. వైసీపీ నేతలు తమ విధేయులకు అర్హత లేకపోయినా లబ్ధిదారుల జాబితాలో చేర్చి వారికి ఆయాచిత మేలు చేకూర్చారు. ఇందుకోసం అధికారుల మీద తీవ్ర స్థాయిలో రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి తమ పబ్బం గడుపుకున్నారు. నిబంధనల ప్రకారం అన్ని అర్హతల ఉన్న వేలమం దిని రకరకాల కారణాలతో పింఛన్‌కు దూరం చేశారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే అనర్హుల ఏరివేతపై దృష్టిసారించింది. ఇందుకు సంబంధించి జిల్లాల్లో డీఆర్‌డీఏ అధికారులు క్షేత్ర స్థాయిలో ముమ్మర కసరత్తు చేస్తున్నారు. అనర్హులను ఏరివేయడం ఎంత ముఖ్యమో అర్హులకు పింఛన్ అందించడం కూడా అంతే ముఖ్యమన్న దృక్పథంతో అధికారులు పనిచేయాలనే స్పష్టమైన ఆదేశాలను ప్రభుత్వం ఇచ్చింది.

వైసీపీ నేతలు చెప్పిన వారికే..

దివ్యాంగుల ధ్రువీకరణలో గత ప్రభుత్వంలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. వైసీపీ నేతలు చెప్పినవారికే సదరం సర్టిఫికెట్లు మంజూరు అయ్యాయి. ఈ వ్యవహారంలో గత ప్రభుత్వం పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగానికి పాల్పడ్డట్లు ఆరోపణలున్నాయి. అనర్హుల జాబితాలో ఎక్కువ శాతం మంది దివ్యాంగుల కోటా కిందే లబ్ధి పొందారు. ఇదే కాకుండా గ్రామాల్లో వైసీపీ నేతల అనుచరులకు అర్హత లేకపోయినా పదవిని ఉపయోగించి పింఛన్ అందేలా చేశారు. భర్తలుండి ఒంటరి మహిళ పింఛన్ పొందుతున్న వారు, తప్పుడు వయసు ధ్రువీకరణతో లబ్ధి పొందడంతో పాటు కులవృత్తుల వారికే ఇచ్చే పింఛన్ సైతం వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించి అర్హుల నోట్లో మట్టి కొట్టింది. కిడ్నీబాధితులు, డప్పు కళాకారుల విషయంలో అర్హులకు కాకుండా బోగస్ వారికే పింఛన్లు అందుతున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులు గుర్తించారు. ఇక చేనేత పింఛన్ విషయంలో పేర్లు మార్చి మరీ గోల్‌మాల్ చేసినట్లు చీరాల పరిధిలో అధికారుల దృష్టికి వచ్చింది

కొమ్ముకాసిన అధికారుల్లో వణుకు..

పింఛన్ల వడపోతపై క్షేత్రస్థాయిలో ముమ్మరంగా కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో వైసీపీ నేతలు చెప్పినట్లు అలా తలాడించిన అధికారుల్లో వణుకు మొదలైంది. కొంతమంది అధికారులు ఒత్తిళ్లతో నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే, వైసీపీ ప్రాపకంతో పోస్టింగ్ తెచ్చుకున్న వారయితే వారి సేవలో తరించి ఎంతో మంది అనర్హులకు పిం ఛన్ అందడంలో వారి సహకాంరం అందించారు. టీడీపీ ద్వితీయశ్రేణి నేతలు ఎన్నోసార్లు వారి చుట్టూ తిరిగి అర్హతలున్న పింఛన్ అందని వారి జాబితాను అందించినప్పటికీ దానిని చెత్తబుట్టలో పడేసి వైసీపీ పై వీర విధేయత నిరూపించుకున్నారు. ప్రస్తుతం విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి వారందరి కుర్చీలు కదలడం ఖాయంగా కనిపిస్తోంది.

బాపట్ల జిల్లాలోనే దాదాపు 5,500 మంది...

అనర్హుల ఏరివేతలో భాగంగా కసరత్తు చేస్తున్న అధికారులు ఒక్క బాపట్ల జిల్లాలోనే దాదాపు 5,500 మంది అర్హత లేకపోయినా సామాజిక పింఛన్ తీసుకుంటున్నారని ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య దాదాపు 15,000 మందికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పింఛన్ల విచారణ ఇప్పటికే ఓ కొలిక్కి వచ్చింది. ఇదే సమయంలో అన్ని అర్హతలు ఉండడంతో పాటు రాజకీయ కారణాలతో పింఛన్ అందని వారు బాపట్ల జిల్లాలోనే 3,000 మందిని గుర్తించిన అధికారులు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే అర్హతలు ఉండి పింఛన్ అందని వారిసంఖ్య పదివేల మంది వరకు ఉండొచ్చని తెలుస్తోంది.

సామాజిక పింఛన్ విషయంలో..



నిబంధనల ప్రకారం అర్హులకు మాత్రమే దక్కాల్సిన సామాజిక పింఛన్ విషయంలో కూడా వైసీపీ రాజకీ యాలకు పాల్పడడం విస్మయపరుస్తోంది. వైసీపీ నేతల తైనాతీలకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూర్చిన గత ప్రభుత్వం అర్హులను మాత్రం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పించుకుని మొండి చెయ్యి చూపించింది. గ్రామాలలో టీడీపీ సానుభూతి పరులన్న ఒకేఒక్క కారణంతో అన్ని అర్హతలున్నప్పటికీ ఏదో ఒక కొర్రీవేసి పింఛన్‌కు దూరం చేశారు. ఈ మొత్తం అవకతవకలలో కొంత మంది అధికారులు కూడా అత్యుత్సాహం ప్రదర్శించారన్న విమర్శ ఉంది. అనర్హులకు సదరం సర్టిఫికెట్ల జారీ విషయంలో డాక్టర్ల పాత్రపై విచారణ జరపాలనే డిమాండ్లు పెద్ద ఎత్తున వస్తున్నాయి.

మరింత మందికి లబ్ధి...

కొత్త ప్రభుత్వం అనర్హుల పింఛన్ ఏరివేతపై దృష్టిపెట్టడంతో పాటు అర్హులకు జరిగిన అన్యాయంపై అదేస్థాయిలో స్పందించడం పట్ల వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించడంతో అన్ని అర్హతలు ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో పింఛన్‌కు దూరమయ్యామని, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న కసరత్తు వల తమకు న్యాయం జరగనుందనే అభిప్రాయాన్ని దరఖాస్తు దారులు వ్యక్తం చేస్తున్నారు. అనర్హులకు అందుతున్న పింఛన్‌ను తీవ్రంగా పరిగణించి తొలగించాలని, అవసరమైతే వారి దగ్గర నుంచి రికవరీ చేసే విషయాన్ని కూడా పరిగణించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

వలంటీర్ల పాత్రకూడా కీలకమే...

అనర్హులు భారీ సంఖ్యలో పింఛన్ అందుకుంటున్న వారి జాబితాలో ఉండడం వెనక వలంటీర్లు కూడా కీలకంగా పనిచేశారు. దరఖాస్తుల లాగిన్ వారికే ఇవ్వడంతో వైసీపీ నేతలతో కుమ్మక్కయి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో అర్హులను లబ్ధిదారులుగా చేర్చడానికి కూడా పెద్ద ఎత్తున డబ్బును డిమాండ్‌చేసి ఆ సొమ్మును వైసీపీ నేతలు, వలంటీర్లు పంచుకున్నారని లబ్ధిదారులు చెబుతున్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపించి అవకతవకలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు ఊపందుకుంటున్నాయి

తహసీల్దార్ల రిలీవింగ్‌లో జాప్యం

గుంటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల కోసం వచ్చిన తహసీల్దార్లను వారి సొంత జిల్లాలకు రిలీవింగ్ చేసే విషయంలో జాప్యం జరుగుతోన్నది. ఇప్పటికే ఈ విషయంలో సీసీఎల్‌ఏ ఉత్తర్వులు జారీ చేయగా గుంటూరు జిల్లాలో ఇంకా అమలుకు నోచుకోలేదు. పక్కన ఉన్న బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే తహసీ ల్దారను రిలీవింగ్ చేశారు. గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కూడా రిలీవింగ్ చేస్తే ఇక్కడి నుంచి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో విధులు నిర్వహించేందుకు వెళ్లిన వారంతా తిరిగి వస్తారు. వారికి అప్పుడు గతంలో పని చేసిన మండలాలు కాకుండే వేరే వాటిల్లో పోస్టింగ్ చేసే అవకాశం ఉంటుంది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా ప్రొటోకాల్ తదితర బాధ్యతల నిర్వహణ కోసం ఏమైనా రిలీవింగ్ చేయకుండా నిలుపుదల చేశారా అని రెవెన్యూవర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇదిలావుంటే ఎన్నికల విధుల కోసం ప్రకాశం, నెల్లూరు నుంచి వచ్చి గత నాలుగు నెలలుగా విధులు నిర్వహిస్తున్న కొందరు సొంత జిల్లాలకు వెళ్లేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. అధికార పార్టీ నేతలతో సిఫార్సులు చేయించుకుని ఏదో ఒక విధంగా ఇక్కడే కొనసాగేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. దీనిపై పూర్వ గుంటూరు జిల్లా తహసీల్దార్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సీసీఎల్‌ఏ ఆదేశాల మేరకు ఎవరి జిల్లాలకు వారు వెళ్లిపోవాల్సిందేనని, లేకుంటే తాము ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ దృష్టికి తీసుకెళతామన్నారు.

అమరావతి నిర్మాణాలపై.. అధ్యయనం

- పిల్లర్ల నాణ్యత తనిఖీ బాధ్యతలు చెన్నై ఐఐటీకి
- భవనాల పటిష్ఠతపై హైదరాబాద్ ఐఐటీ నిపుణులు
- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో గతంలో నిర్మిం చిన నిర్మాణాల పటిష్ఠత ప్రస్తుతం ఎలా ఉందన్న అంశంపై ఐఐటీలకు చెం దిన నిపుణులతో అధ్యయనం చేయిస్తున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. బుధవారం ఆయన అసెంబ్లీ ఆవరణలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతిలో సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు నూతన భవనాల కోసం రికార్డు స్థాయిలో వేసిన కాంక్రీట్ పునాది వైసీపీ నిర్వాకంతో ఈ ఐదేళ్లూ నీళ్లలో నానుతూ ఉండిపోయాయి. మేం చేయించిన అధ్యయ నం ప్రకారం కాంక్రీట్ పునాది చెక్కుచెదరలేదు. కానీ దానిపైన వేసిన పిల్లర్ల నాణ్యత ఎలా ఉంద న్నది మరోసారి తనిఖీ చేయించాలని భావించాం. ఆ పనిని చెన్నై ఐఐటీకి అప్పగించాం. అలాగే వివిధ రకాల నివాస భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. వాటి పటిష్ఠతను పరీక్షించే పనిని హైదరాబాద్ ఐఐటీ నిపుణులకు అప్పగించాం. వారి నివేదికలు వచ్చిన తర్వాత తదుపరి కార్యాచరణ చేపడతాం' అని మంత్రి తెలిపారు. రాజధాని నిర్మాణాల కోసం టీడీపీ ప్రభుత్వం టెండర్ల ద్వారా అప్పగించిన పనులు మధ్యలో నిలిచిపోయాయని, వాటిని పూర్తి చేయడానికి మళ్లీ కొత్తగా టెండర్లు పిలవాలని నిర్ణయించామని చెప్పారు. 'కృష్ణానది కరకట్ట పక్కన నిర్మిస్తున్న సీడ్ యాక్సెస్ రోడ్డు మరికొంత భాగం పూర్తి చేయాల్సి ఉంది. రైతుల నుంచి భూమి సేకరించాల్సి ఉంది. దీనితో పాటు మరో రెండు రోడ్లకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఈ రెండు రోడ్లు మంగళగిరి సమీపంలోని ఎయిమ్స్ ఆస్పత్రికి రెండువైపులా వస్తాయి. అక్కడ నుంచి చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారితో అనుసంధానం అవుతాయి. సీడ్ యాక్సెస్ రహదారి మాదిరిగా ఇవి కూడా విశాలమైన రోడ్లుగా వస్తాయి. దీనికి ప్రణాళికలు తయారు చేస్తున్నాం' అని మంత్రి నారాయణ తెలిపారు.


జాతీయ రహదారి నిర్మాణాలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటమురళీ

జాతీయ రహదారి నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

● కలెక్టర్ వెంకట మురళి

చీరాలటౌన్, జూలై 24 : వాడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకట మురళి అధికారులను ఆదేసించారు. బుధవారం కలెక్టర్, సంయుక్త కలెక్టర్ సుబ్బారావు వాడరేవు, కారంచేడు, ప్రాంతాలలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. చీరాల జాతీయ రహదారి మీదుగా నిర్మాణాలు జరగనున్న రహదారి బ్రిడ్జికి సంబంధించి వివరాలను తెలుసుకున్నారు. 2025 డిసెంబర్ నాటికి నిర్మాణాలు పూర్తిస్థాయిలో జరిగి వినియోగంలో ఉండాలన్నారు. 47 కిలో మీటర్ల వరకు నాలుగులైన్‌ల నిర్మాణాలు ఉంటాయని వివరించారు. సబంధిత ప్రణాళిక మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం పర్చూరు పంట కాలువ మీదుగా వెళుతున్న జాతీయ రహదారి, మేజర్ బ్రిడ్జి నిర్మాణాలను పరిశీలించి వాటిపై ఆరా తీశారు. వారి వెంట ఆర్డీవోలు రవీందర్, సూర్యనారాయణరెడ్డి, జాతీయ రహదారి ఇంజనీరింగ్‌లు ఏఈలు తదితర సిబ్బంది ఉన్నారు.

వాడరేవు - పిడుగురాళ్ల రహదారితో జిల్లాకు ప్రయోజనం

పర్చూరు : ఓడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణంతో నూతనంగా ఏర్పాటు అయిన బాపట్ల జిల్లాకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. ఎన్‌హెచ్‌ఏ 167 ఓడరేవు నుంచి పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణ పనులను బుధవారం కలెక్టర్, సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావుతో కలసి పరిశీలించారు. పర్చూరు మండలంలోని ఉప్పుటూరు- కారంచేడు మధ్య జరుగుతున్న పనులను పరిశీలించి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. మత్స్య సంపద, వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి చేయడానికి జాతీయ రహదారి ఎంతగానో దోహద పడుతుందన్నారు. ఓడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు ఏర్పాటు చేసే రహదారికి రూ.667 కోట్ల నిధులు విడుదలయ్యాయన్నారు. చీరాల మండలం ఓడరేవు వద్ద మొదలయ్యే జాతీయ రహదారి పర్చూరు వరకు సాగుతుందన్నారు. 35 కిలో మీటర్లమేర బాపట్ల జిల్లాలోనే రహదారి నిర్మాణం జరుగుతుందన్నారు. రహదారి నిర్మాణం కోసం 103 హెక్టార్ల భూమి అవసరం కానుందన్నారు. 22.30 హెక్టార్ల భూమి ప్రభుత్వానిది ఉండగా, మిగితా 82.70 హెక్టార్ల భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. జాతీయ రహదారి నిర్మాణ పనులలో నాణ్యత విషయంలో రాజీ పడరాదని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.


అన్న క్యాంటీన్‌కు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

పంద్రాగస్ట్‌కు అన్న క్యాంటీన్ పునఃప్రారంభం

● ప్రభుత్వ నిధులు రూ.5లక్షలు

● మున్సిపల్ సాధారణ నిధులు రూ.4లక్షలు

చీరాల, జూలై 24 : చీరాలలో పంద్రాగస్టు నాడు అన్నా క్యాంటీన్ పునఃప్రారంభం కానుంది. అందుకు తగ్గ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అందుకుగాను ప్రభుత్వ నిధులు రూ.5లక్షలు, మున్సిపల్ సాధారణ నిధులు రూ.4లక్షలతో పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. పేదల ఆకలిని కేవలం రూ.5లకు తీర్చే అన్నా క్యాంటీన్‌లను గత ప్రభుత్వం మూసివేసింది. అందులో భాగంగా చీరాల మున్సిపల్ పరిధిలో హైస్కూల్ రోడ్డులో ఉన్న అన్నా క్యాంటీన్ కూడా మూతపడింది. అన్నా క్యాంటీన్ భవనంపై ఉన్న పేరులో అన్నా అనేపేరు కనిపించకుండా రంగు వేశారు. తరువాత సదరు భవనాన్ని సచివాలయంకు కేటాయించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఆగష్టు 15వ తేదీన అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో సదరు భవనంలో ఉన్న సచివాలయాన్ని ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలో ఇప్పటి వరకు ఎంఈవో కార్యాలయంగా ఉన్న భవనం ఖాళీ కావడంతో ఆ భవనంకు సదరు సచివాలయంను మార్చారు. అన్నా క్యాంటీన్ ఉంటే తమకు ఎంతో ప్రయోజనం ఉంటుందని పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 15వ తేదీ కోసం ఎదురు చూస్తున్నామని ఉత్సాహంగా చెప్తున్నారు.


బాపయ్యనగర్ సముద్రతీరంలో స్థలాన్ని పరిశీలిస్తున్న మత్స్యశాఖ ఏడీ కృష్ణకిషోర్

జెట్టీ ఏర్పాటుకు స్థల పరిశీలన

చినగంజాం, జూలై 24 :మండలంలోని బాపయ్యనగర్, ఏటిమొగ ప్రాంతాల్లోని సముద్ర తీర ప్రాంతాలు, కుందేరు, రొంపేరు పరిసర ప్రాంతాలను బుధవారం మత్స్య శాఖ ఏడీ బి.కృష్ణకిషోర్, ఎఫ్‌డీవో ఎం.రవీంద్ర పరిశీలించారు. మండలంలోని సముద్రతీర ప్రాంతంలో ఫిషింగ్ జెట్టి ఏర్పాటుకు మత్స్యకారుల సొసైటీ అధ్యక్షులు, మత్స్యకారులతో కలిసి మత్స్యశాఖ అధికారులు స్థల పరిశీలన చేశారు. ఫిషింగ్ జెట్టి ఏర్పాటుకు ఏ ప్రాంతం అనుకూలంగా ఉంటుందని బాపయ్యనగర్, ఏటిమొగ సముద్ర తీరప్రాంతాలు, రొంపేరు, కుందేరు పరసర ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. ఈ ప్రాంతంలో ఫిషింగ్ జెట్టీని ఏర్పాటు చేసే బోట్లు నిలుపుదల చేయడానికి, మత్స్య సంపదను మార్కెటింగ్ చేసుకోవడానికి, చేపలు ఎండబెట్టుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం మత్స్యకారుల సొసైటీ అధ్యక్షులు గొల్లపోతు వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద పల్లెపాలెం మత్స్యకారుల సొసైటీ అధ్యక్షుడు దండుప్రోలు శ్రీరాములు, పల్లెపాలెం, ఏటిమొగ ఫిషరీస్ అసిసెంట్లు ఎస్.పుల్లారావు, ప్రతిభ, సాగర మిత్రులు వెంకటేష్, కౌలస్య, జి.లావణ్య, మత్స్యకారులు దండుప్రోలు తిరుపతిరావు, ప్రయళకావేరి వెంకటేశ్వర్లు, జి.నాగేంద్రబాబు, పోతయ్య, పోలయ్య, కోడూరి రాజు, పి.నాగరాజు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లో అక్రమాలు

● నేడు వైద్యశాఖ కార్యాలయంలో ఆర్డీ విచారణ

● 2002 నుంచి నియమితులైన వారు

హాజరుకావాలని ఆదేశం

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 24: వైద్యారోగ్యశాఖలో హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో వారు విచారణకు ఆదేశించారు. ఈమేరకు వైద్యశాఖ ఆర్డీ గురువారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ చేయనున్నారు. 2002 నుంచి ఇప్పటి వరకు హెల్త్ అసిస్టెంట్లుగా నియమితులైన వారంతా ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేసమయంలో జిల్లాలోని పీహెచ్‌సీల్లో పనిచేసే ఉద్యోగులు కూడా రావాలని ఆదేశించారు.

అంతా అయోమయం

పూర్తి కాని పొగాకు కొనుగోళ్లు

మళ్లీ సాగుకు సమయం ఆసన్నం

రైతుల వద్దనే ఇంకా మూడో వంతు పంట

అధికోత్పత్తిపై తేల్చని కేంద్రం

ఆందోళనలో రైతులు

ఇదేఅదనుగా వ్యాపారుల అక్రమ కొనుగోళ్లు

అవసరాల కోసం అమ్ముకుంటున్న కొందరు

నియంత్రించడంలో బోర్డు అధికారుల విఫలం

ఊహించని ధరలు.. ముమ్మరంగా కొనుగోళ్లు.. బేళ్ల కోసం బయ్యర్లు పోటీ.. ఇలా జోరుగా పొగాకు మార్కెట్ సాగడంతో మురిసిపోయిన రైతులు ప్రస్తుతం అయోమయంలో పడిపోయారు. అధిక పంట ఉత్పత్తి కొనుగోలు విషయంలో కేంద్ర వాణిజ్యమంత్రిత్వ శాఖ నుంచి స్పష్టత రాకపోవడం, అనుమతించిన మేర పంట కొనుగోళ్లు పూర్తయ్యాయని బోర్డు అధికారులు వేలం కేంద్రాలు నిలిపివేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. మళ్లీ పంట సాగుకు సమయం సమీపిస్తున్నా ఇంకా పాత సీజన్‌లో పండిన దానిలో మూడో వంతుకుపైగా రైతుల వద్దనే ఉంది. దాని అమ్మకాలపై వారిలో ఆందోళన నెలకొంది. ఇదేఅదనుగా వ్యాపారులు అక్రమ కొనుగోళ్ల జోరు పెంచారు. డబ్బు అవసరమైన కొందరు రైతులు చాటుమాటుగా అమ్ముకుంటున్నారు. కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ నుంచి సకాలంలో అనుమతులు తెప్పించడంలో సఫలీకృతం కాలేకపోయిన బోర్డు అధికారులు.. అక్రమ కొనుగోళ్లను నియంత్రించడంలోనూ విఫలమయ్యారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



ఒంగోలు (ఆంధ్రజ్యోతి)/కొండపి, జూలై 24 : రాష్ట్రంలో 2023-24 సీజన్‌లో 142 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతించింది. అందులో దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాల్లో 86.97 మిలియన్ కిలోలు పండించాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతంలో అనుమతించిన దాని కన్నా సుమారు 15వేల హెక్టార్లకుపైగా విస్తీర్ణంలో రైతులు పంట సాగు చేయడంతో దిగుబడి కూడా పెరిగింది. సుమారు 140 మిలియన్ కిలోల పంట ఉత్పత్తి వచ్చింది. ఆమేరకు అంచనా వేసిన బోర్డు అధికారులు ఫిబ్రవరి 29న కొన్నింటిలో, మార్చి 6న మిగిలిన కేంద్రాల్లో వేలం ప్రారంభించారు. తొలిరోజు గరిష్ఠ ధర కిలో రూ.230 లభించగా క్రమంగా పెరిగి రూ.366కు చేరింది. మీడియం, మేలు రకం తేడా లేకుండా ధరలు లభించగా లోగ్రేడ్‌కు సైతం భారీ డిమాండ్ ఏర్పడింది. గతంలో ఎన్నడూ లేనంతగా పలు కంపెనీల బయ్యర్లు పోటీపడటంతో సగటు ధర కిలో రూ.252పైగా లభించింది. అలా పొగాకు మార్కెట్ జోరుగా సాగింది. అయితే మూడువారాల నుంచి కొనుగోళ్ల నిలిచిపోయాయి,

రైతుల వద్దే 49 మిలియన్ కిలోల పొగాకు

దక్షిణాదిలోని వేలం నిలిచిపోయే నాటికి ఇంచుమించు 91 మిలియన్ కిలోల పంట కొనుగోలు జరిగింది. ఇంకా 49 మిలియన్ కిలోల పొగాకు రైతుల ఇళ్ల వద్ద ఉండిపోయింది. వేలం నిలిపివేసే సమయంలో అనుమతి ఇచ్చిన మేర కొనుగోళ్లు పూర్తయ్యాయని, అధికోత్పత్తి విషయమై అనుమతి కోసం కేంద్రానికి లేఖ రాశామని అధికారులు ప్రకటించారు. అయితే రోజులు గడుస్తున్నా అనుమతులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్య ఇలా ఉండగా వచ్చే సీజన్ పంట ఉత్పత్తిని పొగాకు బోర్డు ఆరు రోజుల క్రితం ఖరారు చేసింది. అంటే రానున్న సీజన్‌కు రైతులు సిద్ధమయ్యే సమయం ఆసన్నమవుతున్న విషయాన్ని గుర్తించారు. అయినా అధికోత్పత్తి కొనుగోళ్లపై కేంద్రం నుంచి స్పష్టత రాలేదు.

బ్యారన్‌కు సరాసరి 40 క్వింటాళ్ల అదనపు పంట

ప్రస్తుతం రైతుల వద్ద బ్యారన్‌కు సరాసరి 40 క్వింటాళ్ల వరకూ అదనంగా పండించిన పొగాకు నిల్వలు ఉన్నాయి. అనుమతించిన మేర పంట అమ్మకాలు పూర్తయ్యాయి. దాని ద్వారా వచ్చిన సొమ్ము బ్యాంకు రుణాలు, కూలీల ఖర్చులకు పోగా, ప్రస్తుతం విక్రయించే పొగాకుపైనే రైతులు ఆశగా ఉన్నారు. మొత్తం అమ్మకాలు పూర్తయితేనే లాభనష్టాల లెక్కలు తేలుతాయని వారు అంటున్నారు. వచ్చే నెలలో తిరిగి పొగాకు నారు మడులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. అదనంగా పండించిన పొగాకుకు సంబంధించి మరో వారంలో అనుమతులు వచ్చినా విక్రయాలు పూర్తయ్యే సరికి దాదాపు 50 రోజుల వరకు పట్టొచ్చని మార్కెట్, రైతు, అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

జోరుగా అక్రమ కొనుగోళ్లు

రైతుల వద్ద పొగాకు నిల్వలు ఉండటం, బోర్డు స్పష్టతనివ్వకపోవడంతో కొందరు వ్యాపారులు అక్రమ కొనుగోళ్లకు తెరతీశారు. ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో కిలో రూ.350 వంతున కొంటున్నారు. వీరికి డబ్బు అవసరమైన రైతులు కొందరు అమ్ముకుంటున్నారు. అయితే అధికోత్పత్తి అమ్మకాలపై కేంద్రం నుంచి సకాలంలో అనుమతులు తీసుకురాలేకపోయిన బోర్డు అధికారులు.. అక్రమ కొనుగోళ్లను కూడా నియంత్రించలేకపోతున్నారు. ఈ పరిస్థితులు రైతులను తీవ్ర ఆందోళన, అయోమయానికి గురిచేస్తున్నారు. తక్షణం ఇటు ప్రజాప్రతినిధులు, అటు బోర్డు ఉన్నతాధికారులు స్పందించకపోతే నష్టపోతామని వారు వాపోతున్నారు.

ఎన్ఎల్ఎస్‌లో కిలో గరిష్ఠ ధర రూ.400

దక్షిణాది కేంద్రాల్లో అధికారిక పంట విక్రయాలు పూర్తయి వేలం ఆగిపోగా ఉత్తరాది రీజియన్‌లో మాత్రం అధికారిక కొనుగోళ్లు ఇంకా కొనసాగుతున్నాయి. అక్కడ మేలు రకం పొగాకుకు భారీ డిమాండ్ ఏర్పడింది. గరిష్ఠ ధర ఏకంగా కిలో రూ.400 పలుకుతోంది. దక్షిణాదిలో ఇప్పటి వరకూ కిలో గరిష్ఠ ధర రూ.366 మాత్రమే లభించింది. దీంతో తక్షణం అధికోత్పత్తి అయిన పంట కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

పెనాల్టీ లేకుండా పంట కొనుగోలు చేయాలి

ముప్పరాజు శివన్నారాయణ, పొగాకు రైతు, కొండపి

పొగాకు ఉత్పత్తి వ్యయం ఏటికేడు రెట్టింపవుతోంది. కూలి రేట్లు, పొలాలు, బ్యారన్‌ల కౌలు గణనీయంగా పెరిగాయి. బోర్డు అనుమతిస్తున్న మేర పంట విక్రయం ద్వారా వచ్చే డబ్బులు తెచ్చిన అప్పులకు, కూలీలకు సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో అదనపు పొగాకును ఎటువంటి అపరాధ రుసుం లేకుండా విక్రయించుకోవడానికి అనుమతిస్తేనే కొంత వరకు గిట్టుబాటు అవుతుంది. ఆలస్యమైతే పొగాకు నాణ్యత తగ్గి రైతులకు మరింత నష్టం వాటిల్లే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం వెంటనే అదనపు పొగాకు అమ్మకాలకు అనుమతులు ఇవ్వాలి.

90 రోజుల్లోపు సమస్య పరిష్కారం

అవకాశం లేని పనులపై ముందే స్పష్టత

అభివృద్ధిలో అన్ని రంగాలకు ప్రాధాన్యం

అవినీతి, అశ్రద్ధను సహించను

'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఆంధ్రజ్యోతి, ఒంగోలు

'అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు ప్రజావసరాలను తీర్చేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తా. ఏరూపంలో సమస్యను నా దృష్టికి తీసుకొచ్చినా 90 రోజుల్లోపు పరిష్కారం చూపిస్తా. వీలైతే అదేరోజు తీరుస్తా. అవకాశం లేకపోతే ఆవిషయాన్ని ముందే చెప్తా. జిల్లా పరిధిలోనిది కాకపోతే ఏంచేయాలో తెలియజేస్తా. ప్రతి అధికారి, ఉద్యోగితో ఎలా పనిచేయించుకోవాలో నాకు తెలుసు. అవినీతి, అశ్రద్ధను సహించను' అని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. బుధవారం ఆమె ఆంధ్రజ్యోతిప్రతినిధితో మాట్లాడారు. అనేక అంశాలపై స్పష్టత ఇచ్చారు. సమయపాలన, స్వీయపరిశీలనకు ఆమె ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. అధికారులతో నిత్యం సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇలా ఎంతకాలం సాధ్యమని ప్రశ్నించగా వృత్తిలో ఉన్నంతకాలం అలాగే ఉండటం, ప్రజలకు న్యాయం చేయడమే తన లక్ష్యమన్నారు. అన్ని రంగాల అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో అవసరమైన మౌలిక సౌకర్యాలకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. సాగునీటి రంగానికి సంబంధించి ఆమె మాట్లాడుతూ 'వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంపై అధ్యయనం చేశా. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తున్నా. గుండ్లకమ్మ ప్రాజెక్టు, రామతీర్థం రిజర్వాయర్ సందర్శన అందులో భాగమే. మూలనపడిన తాగునీటి పథకాల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇస్తాం. ఇటు తాగునీటి పథకాలపై ప్రత్యేక పరిశీలన చేస్తున్నాం. దర్శిలోని ఎస్ఏపీ స్కీం సందర్శన అందులో బాగమే. వ్యవసాయాధార జిల్లాలో రైతులు, రైతు కూలీల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ పథకాలు జోడించి పనిచేయడమే నా లక్ష్యం' అని అన్సారియా స్పష్టం చేశారు.

ఎలా పనిచేయించుకోవాలో తెలుసు

జిల్లాలోని అధికారులు, ఉద్యోగులతో ఎలా పనిచేయించుకోవాలో తెలుసని కలెక్టర్ చెప్పారు. గ్రామ, మండలం నుంచి జిల్లాస్థాయి వరకూ బాగా పనిచేసే అధికారులే రావాలని కోరుకుంటున్నానన్నారు. జిల్లాలోని మంత్రులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని ముందుకెళ్తానన్నారు. అటు ప్రజాప్రతినిదులు, ఇటు ప్రజల నుంచి మంచి సహకారం లభిస్తున్నదన్న ఆమె దాన్ని నిలుపుకునేందుకు యంత్రాంగం పరిధిలో లోపం లేకుండా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.

టిడ్కో ఇళ్ల వద్ద గ్రావెల్ తవ్వకాలు

● అడ్డుకున్న ఇంజనీర్లు


అద్దంకి కొండ సమీపంలో టిడ్కో ఇళ్ల వద్ద ఎక్స్‌కవేటర్‌తో తవ్విన గ్రావెల్

అద్దంకి, జూలై 24 : అక్రమార్కులు టిడ్కో ఇళ్ల వద్దా వదలకుండా గ్రావెల్ తవ్వకాలను చేస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ నేతలు అద్దంకి కొండను ఇష్టారాజ్యంగా తవ్వి మరో రుషికొండగా మార్చారని టీడీపీ నేతలు అప్పట్లో విమర్శించారు. అప్పట్లో వారి ఆందోళనతో అద్దంకి కొండపై గ్రావెల్ తరలింపు నిలిపి వేశారు. అయితే ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అదే అద్దంకి కొండపై టిడ్కో ఇళ్ల చెంతనే ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తూ గ్రావెల్‌ను రియల్ ఎస్టేట్ వెంచర్‌లకు తరలించడం మరింత విమర్శలకు తావిస్తుంది. అద్దంకి కొండ నుంచి గ్రావెల్‌ను అప్పట్లో పెద్ద ఎత్తున తరలించడంతో వైసీపీ నేతలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రైవేటు వెంచర్‌లతో పాటు ఇతర గ్రామాలకు కూడా గ్రావెల్ తరలించి అప్పటి వైసీపీ నేతలు సొమ్ము చేసుకున్నారన్న విమర్శలు వచ్చాయి. తీవ్ర విమర్శలు రావడంతో గ్రావెల్ తవ్వకాన్ని సుమారు సంవత్సర కాలంగా పూర్తిగా నిలిపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్లు త్వరలో పనులు పూర్తయి లబ్ధిదారులకు ఇచ్చే పరిస్థితులలో టిడ్కో ఇళ్లకు సమీపంలో గ్రావెల్ తవ్వకాలు చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. విషయం తెలుసుకున్న టిడ్కో అధికారులు మంగళవారం రాత్రి గ్రావెల్ తవ్వకాన్ని అడ్డుకున్నారు. దీంతో అద్దంకి కొండ నుంచి గ్రావెల్ తవ్వకం నిలిపి వేశారు. మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఎఈ నాగేశ్వరరావు తెలిపారు. భవిష్యత్‌లో కూడా టిడ్కో ఇళ్ల సమీపంలో గ్రావెల్ తవ్వకాలు జరగకుండా ఉండే విధంగా కందకం తవ్వించినట్లు ఏఈ నాగేశ్వరరావు తెలిపారు.

ఆ ఇంటిపై కన్నేసిన హంతకులు ఎవరు..?

పోలీసులకు సవాల్‌గా వృద్ధురాలి హత్య

ఇప్పటికే సుమారు 20 మందికి పైగా అనుమానితుల విచారణ

మృతదేహానికి నేడు అంత్యక్రియలు నిర్వహించనున్న కుటుంబ సభ్యులు


హత్య జరిగిన ఇల్లు (ఇన్‌సెట్లో) విశ్రాంత ఉపాధ్యాయిని పిల్లి లలిత (ఫైల్)

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూలై 24 : బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెం బాయ్స్ హైస్కూల్ వెనుక జెండా చెట్టు సమీపంలో మంగళవారం జరిగిన వృద్ధురాలి హత్య ఘటన విచారణను పోలీసులు ముమ్మరంగా చేస్తున్నారు. సబ్ డివిజన్ పరిధిలోని సుమారు 100 మందికి పైగా సిబ్బంది కేసు దర్యాప్తులో పాల్గొంటున్నారు. అంతేకాకుండా మండల పరిధిలోని మహిళా పోలీసులు సైతం ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. సుమారు 20 మంది అనుమానితులిని స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. బుధవారానికి ఎటువంటి పురోగతి లబించలేదు. చుట్టుపక్కలా ఎక్కడా కూడా సీసీ కెమెరాలు సైతం లేకపోవడంతో హత్య కేసు పోలీసులకు సవాల్ మారింది. ప్రస్తుతానికి కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అలాగే కుమారులు గురువారం రానుండగా అంత్యక్రియలు కూడా ఆదేరోజు జరుగనున్నాయి.

కుటుంబ నేపథ్యం

పిల్లి లలిత (78) తెలుగు ఉపాధ్యాయిని. భర్త రామయ్య కూడా విశ్రాంత ఉపాధ్యాయుడు. చాలా కాలం కిందటే ఆయన మృతి చెందారు. 2004లో స్థానిక బాయ్స్ హైస్కూల్‌లో ఉద్యోగ విరమణ పొందిన లలిత ఒంటరిగా ఉంటున్నారు. పెద్ద కుమారుడు కల్యాణ్ ఈశ్వర్ బాబు ఫ్రాన్స్‌లో ఉద్యోగం, చిన్న కుమారుడు సామ్రాట్ కాలిఫోర్నియాలో ఉద్యోగం, కుమార్తె దోష వర్థిత విజయవాడలో నివాసం ఉంటున్నారు. అయితే లలిత చుట్టుపక్కల వారితో ఎంతో మర్యాదగా ఉండేవారు. ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. ఈక్రమంలో ఆమె మృతిపై పెద్ద సంఖ్యలోనే స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

పోలీసులకు సవాల్

ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు చాలా జాగ్రత్తగా ఉండేవారు. లోపలికి చుట్టు పక్కల వారిని కూడా పొరబాటున కూడా అనుమతించేవారు కారు. నిత్యం ఇంటి బయట గేటు మరియు హాల్‌కు తాళాలు వేసే ఉంటాయి. ఈ నేపథ్యంలో పక్కా ప్రణాళికతో నేరుగా ఇంట్లోకి ప్రవేశించి హత్యకు పాల్పడడం సంచలనం రేపుతోంది. ఆమె గొంతులో కత్తి గాటు ఆనవాళ్లు ఉన్నాయి. అలాగే ముక్కు నోటి నుంచి తీవ్ర రక్తస్రావం. అంతేకాకుండా మృతదేహం పూర్తిగా రక్తపు మడుగులో ఉండడం అందరినీ కలవరపాటుకు గురిచేస్తుంది. ఇంట్లో ఉన్న సుమారు రూ.లక్ష నగదు అహరించినట్లు సమాచారం. అయితే ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలు ఏమయ్యాయో తెలియాలి.

విషయం తెలిసిందిలా

నిత్యం ఏదో ఒక సమయంలో కుమారులు తల్లితో ఫోన్‌లో మాట్లాడుతూ ఉంటారు. ఈక్రమంలోనే మంగళవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో పెద్ద కుమారుడు తల్లికి పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో స్థానికంగా ఉండే మిత్రుడిని ఇంటికి వెళ్లి చూడమనగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పైగా రాత్రి సుమారు 7 గంటల సమయంలో ఇంట్లో టీవీ సౌండ్ పెద్దగానూ, లైట్లు తీసి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. బహుశా ఈ సమయంలోనే ఘటన జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఏదేమైనా ఈపూరుపాలెంలో వరుస హత్యలు స్థానికులను కలవరపాటుకు గురి చేస్తున్నాయి.

ఇసుక అక్రమాలలో ప్రభుత్వ పెద్దలే సూత్రధారులు

● జేపీ వెంచర్ ముసుగులో వ్యాపారం

● విచారణకు ఎమ్మెల్యే ఏలూరి డిమాండ్


మాట్లాడుతున్న ఏలూరి

పర్చూరు. జూలై 24 : వ్యవస్థలను అడ్డం పెట్టుకొని గత ప్రభుత్వ పెద్దలే ఇసుక అక్రమ వ్యాపారానికి తెరలేపారని అట్టివారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు డిమాండ్ చేశారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులను అడ్డపెట్టుకొని అడ్డగోలు అక్రమాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం సాగించిన అరాచకం, దౌర్జన్యాలపై అనేక సందర్భాల్లో ప్రజా పోరాటాలు నిర్వహించామని గుర్తు చేశారు. వాటిని గత వైసీపీ లెక్కచేయకుండా అక్రమార్జనే లక్ష్యంగా ఇసుక దందాకు పాల్పడిందన్నారు. ప్రభుత్వానికి కట్టాల్సిన రాయల్టీ కట్టలేదన్నారు. దీంతో ఇసుక వ్యాపారానికి లెక్కాపత్రం కూడా లేకుండా పోయిందన్నారు. జేపీ వెంచర్స్ ముసుగులో ఇసుక అక్రమ వ్యాపారం సాగిందన్నారు. దాని వెనుక ఎవరెవరు ఉన్నారన్న విషయాన్ని విచారించి, నిగ్గుతేల్చాలన్నారు. ఆస్తులు కొల్లగొట్టేందుకే జగన్‌రెడ్డి తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడంపై ఏలూరి హర్షం ప్రకటించారు. రద్దు చేస్తూ బిల్లును ప్రవేశపెట్టిన రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

మురుగు కాలువలు అధ్వానం

- పట్టణ పరిధిలో నిర్మాణం జరగాల్సినవి 130 కిలోమీటర్లు
- రూ.8కోట్ల వ్యయంతో ఎస్టీపీకి టెండర్లు పూర్తి
- ప్రభుత్వం మారింది .. పరిస్థితులు మారేనా..!



దండుబాట రోడ్డు చివర ప్రధాన డ్రైన్ ఇలా



ఈపురుపాలెం స్రైట్‌కట్ వెళ్లే ప్రధాన మురుగుకాలువ దుస్థితి



మురుగుపారుదల లేని ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, డీఈఈ, ఏఈ తదితరులు

చీరాల, జూలై 24 : మున్సిపల్ పరిధిలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగు పారుదల లేక నీరు నిల్వ ఉంటుంది. వర్షాల సమయం. సీజనల్ వ్యాధుల ప్రబలే అవకాశముండడంతో వాటిని అధిగమించేందుకు ఉన్న వనరులను వినియోగించుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత పాలకులు, అధికారులపై ఉంది.

మున్సిపల్ పరిధిలో మొత్తం రోడ్ల పొడవు 135 కిలోమీటర్లు. అందులో 120 కిలోమీటర్లు మేర రోడ్ల నిర్మాణం జరిగింది. మరో 15 కిలోమీటర్లు మేర రోడ్ల నిర్మాణం జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రోడ్లకు ఇరువైపులా డ్రైన్ల నిర్మాణం సుమారు 270 కిలోమీటర్లు మేర జరగాలి. అయితే ఇప్పటి వరకు 140 కిలోమీటర్లు మేర మాత్రమే డ్రైన్ల నిర్మాణం జరగింది. మరో 130 కిలోమీటర్లు మేర డ్రైయిన్లు నిర్మాణం జరగాల్సి ఉంది. డ్రైయిన్లు నిర్మాణం జరిగిన ప్రాంతంలో కూడా కొన్ని చోట్ల పారుదల సక్రమంగా లేదు. ఇక డ్రైన్లు లేని ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉందని అక్కడి ప్రజలు వాపోతున్నారు.

ప్రధాన డ్రైన్ల పరిస్థితి ఏంటి..?

మున్సిపల్ పరిధిలో మొత్తం 33 వార్డులు ఉన్నాయి. అందులో బోసునగర్ నుంచి దండుబాట వరకు ఉన్న 16 వార్డులలకు సంబంధించిన మురుగు దండుబాట నుంచి ఎఫ్‌సీఐ గోడౌన్‌ల పక్కగా ఈపురుపాలెం స్రైయిట్‌కట్‌కు వెళ్లి కలుస్తుంది. ఇక మిగిలిన 17 వార్డులకు సంబంధించిన మురుగు మసీదు సెంటర్ నుంచి ఏరియా వైద్యశాల రోడ్డులోని ప్రధాన డ్రైన్, నల్లగాంధీ బొమ్మ సెంటర్ నుంచి ప్రధాన డ్రైన్ల ద్వారా కుందేరులో కలుస్తుంది. అయితే ఆ ప్రక్రియ కొంతమేర సక్రమంగా లేదు.

ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణానికి మోక్షం ఎప్పుడో?

సాధారణంగా సముద్రంలో కలసే మురుగును కూడా ముందస్తుగా శుద్ధి చేసి ఆ నీటిని మాత్రమే సముద్రంలో కలిసేలా చర్యలు చేపట్టాలి. ఇది ఎన్‌జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) నిబంధన. అందుకు గాను దండుబాటలో ఎఫ్‌సీఐ గోడౌన్స్ వెనుక 1.24 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. అందులో ఎస్‌టీపీ(సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మాణం చేయాలని కాగితపు పనులు పూర్తయ్యాయి. అందుకుగాను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులు రూ.8కోట్లు వ్యయంతో ఎస్‌టీపీ ప్లాంట్‌ను నిర్మించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. రాష్ట్రంలో 40 మున్సిపాలిటీల్లో ఎస్‌టీపీల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. అందులో చీరాల మున్సిపాలిటీ ఒకటి. ఇక రెండో వైపు ప్రధాన కాలువకు ప్రభుత్వస్థలం అందుబాటులో లేకపోవడంతో మండల పరిధిలోని దేవాంగపురిధిలో స్థల పరిశీలన చేశారు. తదుపరి చర్యలు అటకెక్కాయి. అంతకు ముందు యుఐడీఎస్ఎస్ఎంటీ (అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ స్కీం ఫర్ స్మాల్ అండ్ మీడియం టౌన్)కు సంబంధించి మంజూరైన రూ.40 కోట్లు కూడా సద్వినియోగం చేసుకోలేకపోయారు.

వైసీపీ పాలనలో కానరాని ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు

వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు కాలేదు. దీంతో ఆశించిన మేర సబ్‌ప్లాన్ నిధులతో అభివృద్ధి చేపట్టాల్సిన ప్రాంతాల్లో పురోగతి ఆశించిన స్థాయిలో లేకుండా పోయింది. మొత్తమ్మీద ప్రభుత్వం మారింది. పరస్థితులు మారి అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి పాలకులు, అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు.



శింగరకొండపాలెంలో స్తంభాలకు తొలగించిన మొక్క తీగ

స్తంభాలకు అల్లుకున్న మొక్క తీగ తొలగింపు

అద్దంకి, జూలై 24 : విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయిన మొక్కల తీగలను బుధవారం తొలగించారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన స్తంభాలకు తీగలు అనే కథనంపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. శింగరకొండపాలెం సమీపంలో, బొమ్మనంపాడు రోడ్డులోని జగనన్న కాలనీ వద్ద విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్లకు అల్లుకుపోయిన మొక్కల తీగలను తొలగించివేసినట్లు ఏఈ శివప్రసాద్ తెలిపారు.

వేటపాలెంలో కుక్కల బెడద

వేటపాలెం(చీరాల), జూలై 24 : వేటపాలెం పంచాయతీ పరిధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. దీంతో ప్రజలతో పాటు పశువులు కూడా కుక్కకాటుకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి రెండు లేగదూడ్లను కుక్కలు కరిచాయి. దీంతో పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు వీధుల్లో తోడు లేకుండా వెళ్లాలంటే భయపడుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

27న సర్వసభ్య సమావేశం

పంగులూరు, జూలై 24 : పంగులూరు మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 27న ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో కె.మ్యాత్యూబాబు తెలిపారు. శనివారం ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

ఎంపీడీవో కుటుంబానికి న్యాయం చేయాలి

అద్దంకిటౌన్, జూలై 24 : ఒత్తిళ్లు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణ మృతికి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని అద్దంకి ఎంపీడీవో జీవీ సత్యనారాయణ కోరారు. బుధవారం తన కార్యాలయంలో వెంకట రమణ మృతి పట్ల ఎంపీడీవో, ఇతర ఉద్యోగులు నివాళులర్పించారు. ఈ ఘటనపై స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది కొద్ది సేపు మౌనం పాటించడంతో పాటు బాధ్యులపై చర్యల కోసం నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు.

పంగులూర : ఏలూరు జిల్లా నరసాపురం ఎం.పీ.డీ.ఓ. వెంకటరమణారావు మృతి ఎంతో విషాదకరమని పంగులూరు ఎం.పీ.డీ.ఓ. మ్యాత్యూబాబు అన్నారు. విధి నిర్వహణలో ఎదురయిన వత్తిడి కారణంగా కాలువలో పడి మరణించిన వెంకటరమణారావు చిత్రపటానికి మ్యాత్యూబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటరమణారావు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో ఎం.పీ.డీ.ఓ మృతి పట్ల కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపి రెండు నిముషాలు మైనం పాటించారు.

ఉత్సాహంగా గ్రామీణ క్రీడలు



ఆటలు ఆడుతున్న విద్యార్థినులు

అద్దంకిటౌన్, జూలై 24 : మండలంలోని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గ్రామీణ క్రీడా పోటీలను పీఈటీ కే.హనుమంతరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తొక్కుడు బిళ్ల, గట్టు ముందు గట్టు వెనుక, ఇసుకలో పుల్ల, గన్నాలాట, చెండాట, అష్టాచెమ్మలాంటి ఆటలు ఆడించారు. ఈ ఆటలలో విజేతలైన విద్యార్థులకు కార్యక్రమం చివరి రోజు సోమవారం బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి, దామా నాగేశ్వరరావు, శంకరరావు, శ్రీనివాసరావు, వెంకటరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కోసం విద్యార్థుల ఎంపిక

ఇంకొల్లు, జూలై 24 : ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ సునీల్‌గౌతమ్ ఆదేశాల మేరకు ఇంకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో 8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రెండు సంవత్సరాల ఎన్‌సీసీ సర్టిఫికేట్లు పొందేందుకు బుధవారం ఇంకొల్లులో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఆర్మీ సిబ్బంది హవల్దార్ సుభాష్‌చంద్ర, హవల్దార్ వెంకటేష్ కుమార్ 70 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఎన్‌సీసీ అధికారి ఆలవలపాటి శ్రీమన్నారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన

మార్టూరు, జూలై 24 : సమస్యల పరిష్కారం కోసం గత నాలుగురోజుల నుంచి మండలంలోని బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు బుధవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కార్యాలయం ముందు నిరసన చేస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు కార్యక్రమంలో నాయకులు బత్తుల హనుమంతరావు, యూనియన్ నాయకులు శ్రీనివాసరాజు ఇమ్మానియేలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లావాదేవీతో మోసపోయిన మహిళ

ఇంకొల్లు, జూలై 24 : మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన పాటిబండ్ల పద్మావతి ఆన్‌లైన్ లావాదేవితో మోసపోయినట్లు గమనించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదైయింది. ఓ అగంతకుడు పద్మావతికి ఫోన్ చేసి మేము బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నాం.. మీ బంగారం వేలంకు వచ్చింది ఆపుతానని నమ్మబలికాడు. దీంతో పద్మావతి ఫోన్‌పే ద్వారా రూ.37 వేలు చెల్లించింది. అనంతరం బ్యాంకుకు వెళ్లి బంగారం వేలానికి సంబంధించి ఫోన్‌పేలో కట్టినట్లు అధికారులకు తెలపగా వారు నివ్వెరపోయి మీరు బ్యాంకు సిబ్బందికి ఫోన్ పే చేయలేదని, ఎవరో మోసం చేశారని చెప్పారు. దీంతో పద్మావతి పోలీసుస్టేసన్‌లో ఫిర్యాదు చేయగా సైబర్ క్రైం కింద కేసు నమోదు చేశారు.

మున్సిపల్ ఛైర్మన్‌కు శుభాకాంక్షలు

చీరాల, జూలై 24 : కొంతకాలం అమెరికాలో ఉండి వచ్చిన మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు బుధవారం తన కార్యాలయానికి వచ్చారు. ఆ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు, అధికారులు జంజనంకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆ సందర్భంగా పట్టణంలో జరుగుతున్న పలు అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. ప్రస్తుతం వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఛైర్మన్ అధికారులకు సూచించారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు, నాయకులు వర్తమాన పరిస్థితులపై చర్చించుకున్నట్లు సమాచారం. భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరిగినట్లు తెలిసింది.



జంజనంకు శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్లు, నాయకులు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో నిర్మల

విలువైన బోధన అందించాలి

డిప్యూటీ డీఈవో నిర్మల

బల్లికురవ, జూలై 24 : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం విలువైన విద్యను అందించాలని విద్యాశాఖ చీరాల డివిజన్ డిప్యూటీ డీఈవో ఎం.నిర్మల ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఉప్పుమాగులూరు ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈవో అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అన్ని వసతులు కల్పించిందన్నారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ప్రభుత్వ బడిలో చదివిన వారే నేడు ఎంతో ఉన్నత స్థితుల్లో ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం ఆమె ఉపాధ్యాయులతో మాట్లాడిన నిర్మల వెనుకబడిన విద్యార్థులను గుర్తించి మెరుగ్గా తీర్చిదిద్దాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని శుభ్రంగా అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఏడుకొండలున్నారు.

బదిలీ అయిన కానిస్టేబుల్ రిలీవ్

బల్లికురవ, జూలై 24 : పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం బల్లికురవ పోలీసు స్టేషన్ నుంచి పర్చూరు స్టేషన్‌కు బదిలీ అయిన కానిస్టేబుల్ రాములునాయక్ విధుల నుంచి రిలీవ్ అయ్యారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో బదిలీ అయినా కదలని పోలీసు సిబ్బంది అన్న వార్తపై ఉన్నతాధికారులు స్పందించారు. బదిలీ ఉత్తర్వులు వచ్చిన ముగ్గురు కానిస్టేబుళ్లను రిలీవ్ చేయాలని పోలీసు స్టేషన్‌కు ఆదేశాలిచ్చారు. దీంతో ఆనిస్టేబుల్ రాములునాయక్‌ను రిలీవ్ చేశారు. మిగిలిన వారిని కూడా రిలీవ్ చేస్తామని ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. బదిలీ అయిన గ్రానైట్ క్వారీల వద్ద సిబ్బంది హల్ చల్ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. బదిలీ ఉత్తర్వులు వచ్చిన ఒకరు తాను ఏఎస్ఐని అంటూ కొందరి వద్ద పెద్ద ఎత్తున వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి.

నిండుతున్న చెరువులు

ఇంకొల్లు, జూలై 24 : మండలంలోని కొన్ని గ్రామాల చెరువులకు సాగర్ జలాలు చేరాయి. పావులూరు మైనర్ కాలువ నుంచి గత రెండు రోజులుగా ఇంకొల్లు నాగుల చెరువుకు ట్రాక్టర్లు, విద్యుత్ మోటార్లతో నీటిని పంపింగు చేస్తున్నారు. పూర్తిగా ఎండిపోయిన భీమవరం చెరువును రెండు రోజులుగా సాగర్ జలాలతో నింపుతున్నారు. బుధవారం హనుమోజీపాలెం చెరువుకు నీళ్లు చేరాయి. ద్రోణాదుల మేజర్ నుంచి ఇడుపులపాడు, సూదివారిపాలెం చెరువులు నీరు చేరుతుంది. ఈ చెరువులు 30 శాతం వరకు నిండాయి. పమిడిపాడు మేజరు నుంచి దుద్దుకూరు చెరువుకు అరకొరగా వస్తున్నాయి. అంకిరెడ్డిపాలెం, పూసపాడు, కొణికి, ఇంకొల్లు పెద్దచెరువుకు ఇంకా చుక్కనీరు రాలేదని, ప్రాధాన్యతాక్రమంలో చెరువులను నింపుతున్నామని, మరో వారం రోజులపాటు నీటి ప్రవాహం తగ్గకుండా విడుదల చేస్తే మండలంలోని మంచి నీటి చెరువులు నిండుతాయని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జ్యోతి తెలిపారు.

ఇళ్ల చుట్టూ మురుగు లేకుండా చూడాలి

బల్లికురవ, జూలై 24 : వర్షాకాలం కావడం వలన ప్రజలు గృహాల చుట్టూ మురుగు నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని లేకుంటే దోమలు ఎక్కువై సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రవితేజ తెలిపారు. విష జ్వరాలు, చికున్ గున్యా సోకిన అంబడిపూడి గ్రామంలో వైద్యాధికారి తన బృందంతో కలిసి బుధవారం ఇంటింటి సర్వే చేపట్టారు. పలు గృహాల వద్ద ఖాళీ కొబ్బరి బొండాలు, మురుగు గుంటల వద్ద దోమలు అధికంగా ఉన్నట్లు గుర్తించి వీటి ద్వారానే విష జ్వరాలు వస్తాయని, వెంటనే తొలగించాలన్నారు. జ్వరాల వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై నివేదిక ఇవ్వండి



ఆక్రమణకు గురైన ఊరచెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ సుబ్బారావు, ఆర్డీవో

అద్దంకి, జూలై 24 : అద్దంకిలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములపై వెంటనే సమగ్ర నివేదిక అందజేయాలని జాయింట్ కలెక్టర్ సుబ్బారావు స్థానిక అధికారులను ఆదేశించారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 20వ తేదీన ప్రచురితమైన వైసీపీ నేతల చెరలో ప్రభుత్వ భూములు అనే కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. అద్దంకి పట్టణంలోని ఊరచెరువులో ప్రభుత్వ భూమిని ఆ క్రమించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఊరచెరువు పూర్తి విస్తీర్ణాన్ని నిర్ధారించాలని ఆదేశించారు. గతంలో ఎంత మేర ఆక్రమణకు గురైంది, ప్రస్తుతం ఎంతమేర ఆక్రమణలు జరిగాయి అనే దానిపై సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. అదే సమయంలో మిగిలిన చోట్ల కూడా ఆక్రమణలకు గురైన స్థలాలపై కూడా నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించారు. అద్దంకి కొండ సమీపంలో శ్రీ ప్రసన్నాంజనేయ స్టోన్ క్రషర్‌కు గతంలో వినియోగించి, ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వెంచర్‌గా మారిన స్థలాన్ని కూడా పరిశీలించారు. చీరాల ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సుధారాణి, డివిజనల్ సర్వేయర్ పరిశుద్ధరావు, ఆర్ ఐ శంకర్, ఏఎస్‌వో అమరనాథ్ ఉన్నారు.



రైతులకు అవగాహన కలిగిస్తున్న డీడీఏ

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

ఇంకొల్లు, జూలై 24 : సేంద్రియ వ్యవసాయం వలన తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని బాపట్ల జిల్లా డీడీఏ ఎం.విజయనిర్మల పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని దాని ఫలితాల ఆధారంగా ఎరువులను వాడినట్లయితే తక్కువ ఖర్చుతో దిగుబడులు సాధించవచ్చన్నారు. లాభసాటి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా.మురళీధరనాయక్ మాట్లాడుతూ పంటలో సోకే పురుగులను నియంత్రించేందుకు లింగాకర్షణ బుట్టలను వాడాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ రత్నకుమారి, ఏవో వేణుగోపాల్, రైతులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు ఆహ్వానం

అద్దంకిటౌన్, జూలై 24 : కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల అద్దంకిలో కంప్యూటర్ సైన్స్ సబ్జెక్ట్ కోసం అతిథి అధ్యాపక పోస్టుల కోసం దరకాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ పోస్టుకు దరకాస్తు చేసుకునే వారు పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, అలాగే నెట్, స్లెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అసక్తిగల వారు బయోడేటాతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు జిరాక్స్ కాపీలతో ఈనెల 30వ తేదీ ఉదయం 10:30 గంటలకు జరుగుతు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.



జాషువా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సభ్యులు

జాషువాకు ఘన నివాళి

అద్దంకిటౌన్, జూలై 24 : గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా బుధవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో జాషువా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాషువా గొప్ప కవి మాత్రమే కాక, మంచి సంఘ సంస్కర్త అని, తన కవితలు, పద్యాలు ద్వారా సమాజంలోని కులమత, అంటరానితనంతో పాటు ఇతర రుగ్మతలను పారదోలిన మహాకవి జాషువా అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, వారణాసి రఘురామశర్మ, మలాది శ్రీనివాసరావు, అన్నమనేని వెంకట్రావు, జ్యోతి చంద్రమౌళి, రామాంజనేయులు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, తాళ్లూరి బాబురావు పాల్గొన్నారు. కొత్త పసుమర్తిపాలెంలోని గుర్రం జాషువా విగ్రహం వద్ద జాషువా సాహిత్య వేదిక, రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ సంయుక్త ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆడ పిల్లలను చదివించాలి

పంగులూరు, జూలై 25 : తల్లిదండ్రులు ఆడ పిల్లలను విధిగా చదివించి వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని సీడీపీవో కృష్ణకుమారి కోరారు. రేణంగివరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జరిగిన బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమంలో కొరిశపాడు సీడీపీవో కృష్ణకుమారి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాన్ని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ముప్పవరం సెక్టార్ సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీ సిబ్బంది కృష్ణకుమారి, షైనీ, కిశోరబాలికలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకపోతే జరిమానా




వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అంకమ్మరావు

పర్చూరు, జూలై 24: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తే జరిమానా తప్పదని జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి. అంకమ్మరావు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ, మోటార్ వెహికల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వాహనదారులకు హెల్మెట్ ధరించటం వల్ల కలిగే ప్రయోజనాలు, ధరించకపోతే కలిగే అనార్థాలు, జరిమానాలపై అవగాహన కల్పించారు. అలాగా ఆటో డ్రైవర్లు ఓవర్ లోడ్‌తోపాటు నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రావి రమేష్‌బాబు, పి.జాన్‌బాబు, పోలీస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం : సోపిరాల రైల్వే గేటు సెంటర్‌లో చీరాల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదుస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది జి.విఠల్‌రెడ్డి మాట్లాడుతూ నూతన చట్టాల ఆధారంగా హెల్మెట్ లేని వాహనదారులకు భారీ జరిమానా విధించనున్నట్లు తెలిపారు. హెల్మెట్ వాడకంపై అవగాహన, నూతన చట్టాలపై మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే వారికి పడే జరిమానాలను వివరించారు. కార్యక్రమంలో చినగంజాం పీఎల్‌వీ వెంకటరామారావు, సోషల్ వర్కర్, మతిన్‌రావు, హెడ్ కానిస్టేబుల్ వి.శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

అద్దంకి, జులై24: కొత్త విద్యుత్ లైన్ ల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని మోదేపల్లి లో జరుగుతున్న కొత్త విద్యుత్ లైన్ ల ఏర్పాటు పనులను బుధవారం ఈఈ మస్తాన్‌రావు పరిశీలించారు. ఇంకా చేయాల్సిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. డిఈఈ సత్యనారాయణ, ఎఈ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



● నగరంలోని ప్రభుత్వ వైద్య విద్య కళాశాల హాస్టల్లోకి గత నెల 19వ తేదీ ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి మెడికోల సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు దోచుకెళ్లారు. విషయాన్ని వెంటనే గమనించిన వైద్య విద్యార్థులు దర్గా మిట్ట పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. తమ మొబైళ్లను ట్రాక్ చేస్తే వెంటనే దొంగలను పట్టుకోవచ్చని పోలీసులకు మొరపెట్టుకున్నారు. కానీ వారిలో చలనం కరువైంది. చివరకు ఉన్నతాధికారులతో సిఫారసు చేయించడంతో కేసు నమోదు చేశారు. ఆ తరువాత విచారణ కూడా సరిగ్గా చేయలేదని విద్యార్థులు వాపోయారు. సీసీ ఫుటేజీలలో నిందితుల ఫొటోలను అందించినా పోలీసులు తేలిగ్గా తీసుకున్నారు. చివరకు పోలీసులు మీరు పోగొట్టుకున్న వస్తువుల చివరి లొకేషన్ చెన్నై పోర్టులో చూపించిందని, మళ్లీ ఫోన్లు ఆన్ చేస్తే తప్ప చేసేదేమీ లేదంటూ చేతులెత్తేశారు.

● బుచ్చిరెడ్డిపాళెంలో చిరువ్యాపారం చేసుకుంటున్న ఓ మహిళ తన కుమార్తెను గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లారంటూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయినా పోలీసులు పట్టించుకోకపోవడంతో జనసేన నాయకుల సహకారంతో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి తమ గోడు వినిపించింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సూచనల మేరకు సీఐ కేసు నమోదు చేయించారు.

● నెల్లూరు కార్పొరేషన్‌లో కమిషనర్ సంతకం ఫోర్జరీ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. అయితే ఈ కేసు విషయంలో దర్గామిట్ట పోలీసులను ఏ విషయం అడిగినా తమకు సంబంధం లేదంటూ సమాచారం ఇస్తున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసిన రోజు సదరు ఇన్‌స్పెక్టర్‌ను సమాచారం అడిగితే తనకేమీ సంబంధం లేదని, కేసు నెంబర్ అడిగితే చెప్పానని, ఎవరు కేసు నమోదు చేస్తున్నారో కూడా తెలియదంటూ బదులిచ్చారు.

● ప్రతి సోమవారం నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జరిగే పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి 80 కంటే తక్కువ ఫిర్యాదుదారులు రాని సందర్భాలు లేవు. వీటిలో 60 శాతం మంది ఫిర్యాదుదారులు తాము అన్యాయానికి గురయ్యామని, పోలీసుస్టేషన్‌లో న్యాయం జరగడం లేదంటూ తమ గోడు జిల్లా పోలీసు అధికారులకు విన్నవించుకుంటూనే ఉన్నారు.



ఎలాగో మారిపోతాం..

ఇంకెందుకు కేసులు!?

- నమోదుకు వెనుకడుగు... విచారణలో తీవ్రజాప్యం
- సిఫారసు ఉంటేనే ఎఫ్ఐఆర్ నమోదు
- స్టేషన్లలోనూ బాధితులకు దక్కని న్యాయం
- విమర్శలకు తావిస్తున్న కొంతమంది పోలీసు అధికారుల తీరు
- రోజురోజుకు క్షీణిస్తున్న శాంతిభద్రతలు
- కొత్త పోలీస్ బాస్ వచ్చినా.. గాడిన పడని పాలన

జిల్లాలో పోలీసుల తీరు ఇదండి. ప్రజలకు రక్షణగా నిలవాల్సిన పోలీసులే ముఖం చాటేస్తున్నారు. తమకు న్యాయం చేయండని మొరపెట్టుకున్నా బేఖాతరు చేస్తున్నారు. ఇందుకు గత ప్రభుత్వ పాలకుల వ్యవహార శైలీ లేదా నిర్లక్ష్యం తెలియదు కానీ బాధితుడికి మాత్రం అన్యాయం జరుగుతోంది. వైసీపీ పాలనలో అప్పటి ప్రజాప్రతినిధుల అడుగుజాడల్లో నడిచిన కొంతమంది పోలీసులు కేసుల నమోదులోనూ అలాగే వ్యవహరించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా వారిలో మార్పు రాలేదు. అప్పటి ఎస్పీగా ఉన్న తిరుమలేశ్వరరెడ్డిని ఎన్నికల విధుల నుంచి తొలగించడం, పలువురు అధికారులను బదిలీ చేయడం, కొత్త అధికారులు బాధ్యతలు చేపట్టడంతో సామాన్య ప్రజల బాధలను పట్టించుకోవడంలో నిర్లక్ష్యం వహించడం ప్రారంభించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసేలోపు ఎలాగో ప్రభుత్వం మారిన తరువాత కొత్త అధికారులు వస్తారు.. ఈలోపు కేసులు నమోదు చేయడం, వాటిని ఛేదించడం కోసం పరుగులు తీయడం ఎందుకు అనుకున్న అధికారులు జాప్యం చేయడం ప్రారంభించారు.

● స్టేషన్ల వద్ద నిరీక్షణ

'మాకు అన్యాయం జరిగింది మహాప్రభో..' అంటూ పోలీసుస్టేషన్ల మెట్లు ఎక్కి తమ గోడు వినిపించుకుంటున్నా కొందరు పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సీఐ లేదా ఎస్ఐల కోసం గంటల కొద్దీ స్టేషన్ల బయట ఎదురుచూస్తున్నా.. చివరకు ఆ అధికారి వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నా 'అవునా.. అలా జరిగిందా.. చూద్దాములే.. చేద్దాములే' అని వ్యంగ్యంగా మాట్లాడుతున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఇచ్చిన ఫిర్యాదుల పరిస్థితి ఏమిటని తెలుసుకునేందుకు కూడా రోజుల తరబడి స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నా సమాధానం చెప్పే వారు కనిపించడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● కొత్త ప్రభుత్వం ఏర్పడినా!?

ఎన్నికల ప్రక్రియ పూర్తయి ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినా పోలీసుల్లో మాత్రం మార్పు రానంటోంది. జిల్లాలో డివిజన్, సర్కిల్, పోలీసుస్టేషన్లలో ఉన్న అధికారులు 'ఎలాగో బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఈ కొద్ది రోజులకు కేసులు నమోదు చేయడం, రికవరీ కోసం పరుగులు తీయడం ఎందుకని భావించి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా కేసులు నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 45 రోజులు పూర్తవుతున్నా అధికారులను మార్చడంలో జాప్యం జరుగుతుండటం, ఫిర్యాదుదారుల నుంచి ఒత్తిడి పెరగడం, ఉన్నతాధికారులకు సమాధానాలు చెప్పలేక తూతూమంత్రంగా అధికారులు కేసు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కేసులు నమోదు చేసినా వాటిని ఛేదించడంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేసేందుకు మక్కువ చూపడం లేదని ఏఎస్పీ స్థాయి అధికారులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా కొంతమంది పోలీసు అధికారుల నిర్లక్ష్యం జిల్లాలో శాంతి భద్రతల విఘాతానికి పెద్ద కారణమవుతుంది. ఇటీవల జిల్లా పోలీసు బాస్‌గా బాధ్యతలు చేపట్టిన జీ కృష్ణకాంత్ అయినా పోలీసుస్టేషన్లలోని పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల పనితీరులో మార్పు వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

- నెల్లూరు (క్రైం)





జీజీహెచ్ నిర్వహణకు రూ.3 కోట్లతో ప్రతిపాదనలు

- చిన్నపిల్లల విభాగానికే రూ.30 లక్షలు అవసరం
- పలు విభాగాలకు మరో రూ.70 లక్షలు

నెల్లూరు (వైద్యం), జూలై 24 : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) పలు విభాగాలలో నెలకొన్న పనుల నిర్వాహణకు రూ.3 కోట్లతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)కు ప్రతిపాదనలు పంపనున్నారు. ఏపీఎంఎస్ఐడీసీ (ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఈ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇటీవల జరిగిన వీడియా కాన్ఫరెన్స్‌లో జీజీహెచ్‌లో పలు నిర్మాణాలు, మరమ్మతులకు సంబంధించి ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు డీఎంఈ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఏ ఏ పనులకు ఎంత అవసరం అవుతుందో పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలు పంపాలని డీఎంఈ ఆదేశాలు జారీ చేశారు. దీనికి అనుగుణంగా ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేసి డీఎంఈకి పంపుతున్నారు. ఈ నిధులు వస్తే ఆసుపత్రిలో పలు సమస్యలు పరిష్కరించవచ్చని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు చెబుతున్నారు. ప్రధానంగా చిన్నపిల్లల విభాగంలో అభివృద్ధి పనులకే రూ.30 లక్షలు అవసరం అవుతుంది. అలాగే పల్మనాలజీ, ఐపీ బ్లాక్, పాత భవనంలో పలు నిర్మాణాలు, నిర్వాహణకు మరో రూ. 70 లక్షలు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆయా విభాగాలలో ఏసీ, లిఫ్ట్‌ల మరమ్మతులతోపాటు అగ్నిమాపక పరికరాల ఏర్పాటు, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వాహణ, వివిధ ట్యాంకులకు మరమ్మతులు చేయాల్సి ఉంది. గురు, శుక్రవారాల్లో డీఎంఈకి ఈ ప్రతిపాదనలు పంపుతున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. డీఈఈ ఎస్ఎస్ రావు మాట్లాడుతూ తాము పంపిన ప్రతిపాదనల ప్రకారం నిధులు విడుదలయితే జీజీహెచ్‌లో అభివృద్ధి పనులు చేసే వీలు ఉంటుందని తెలిపారు.

సంగం హౌసింగ్ ఏఈ సస్పెన్షన్

సంగం, జూలై 24 : స్థానిక హౌసింగ్ ఏఈ షేక్ కరీముల్లాను కలెక్టర్ ఆనంద్ బుధవారం సస్పెండ్ చేశారు. పేదల గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన సిమెంట్, ఐరన్ లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా కరీముల్లా అక్రమాలకు పాల్పడినట్లు పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో కలెక్టర్ స్పందించి ఉన్నతాధికారులతో విచారణ చేయించారు. 1829 సిమెంట్ బస్తాలు, 17,495 కేజీల ఇనుము పక్కదారి పట్టినట్లు విచారణ అధికారులు గుర్తించి కలెక్టర్‌కు నివేదికలు అందచేశారు. దీంతో ఏఈ కరీముల్లాను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

● జట్లకొండూరు కార్యదర్శి కూడా..

మనుబోలు : మండలంలోని జట్లకొండూరు పంచాయతీ కార్యదర్శి ఆత్మకూరు వెంకటరమణను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓ ఇంజనీరింగ్ కళాశాలకు బోరు అనుమతులు, ఆస్తిపన్ను పత్రం తప్పుగా ఇచ్చే విషయమై కార్యదర్శిపై ఇద్దరు వ్యక్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ నెల్లూరు డీఎల్‌పీవోని విచారణకు ఆదేశించగా, వాస్తవమని తేల్చారు. ఈ మేరకు సస్పెన్షన్ ఉత్తర్వులను డీపీవో ఈవోఆర్‌డీ జీవీఎస్‌వీప్రసాద్‌కు కలెక్టర్ పంపారు. జట్లకొండూరు పంచాయతీతోపాటు మేజర్ పంచాయతీ అయిన మనుబోలుకు ఇన్‌చార్జి కార్యదర్శిగా, అక్కంపేట, బండేపల్లి పంచాయతీలకు డీడీవోగా వెంకటరమణ పని చేస్తున్నారు.

అటవీ శాఖలో ఇంటి దొంగలు

- పర్యవేక్షకులే ఎర్రచందనం భక్షకులు
- దుంగలు తరలిస్తూ టాస్క్‌ఫోర్స్‌కు పట్టుబడ్డ బేస్‌క్యాంప్ సిబ్బంది
- నలుగురి అరెస్టు.. పరారీలో ఒకరు
- తెరవెనుక ఉన్నవారిపై ఆరా



మర్రిపాడు, జూలై 24 : అటవీ శాఖలో ఇంటిదొంగల గుట్టురట్టవుతోంది. పర్యవేక్షకులే ఎర్రచందనం దుంగలను రవాణా చేస్తు న్నట్లు టాస్క్‌ఫోర్స్ బృందం గుర్తించింది. కడప-నెల్లూరు జిల్లా సరిహద్దులోని వెలుగొండ అడవి నుంచి ఎర్రచందనం దుంగలు తరలిస్తూ బేస్ క్యాంప్ (తాత్కాలిక, ఒప్పంద ప్రాతిపదిక) సిబ్బందిలో నలుగురు సోమవారం రాత్రి టాస్క్ ఫోర్సు బృందానికి పట్టుబడ్డారు. మరొకరు పరారయ్యారు. ఓ ట్రాలీ ఆటోతో పాటు 64 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు పడమటినాయుడుపల్లికి చెందిన రసూల్, ప్రసాద్, సింగణ పల్లికి చెందిన చిన్నా, వింజుమూరుకు చెందిన ఒకరు ఉన్నారు. చుంచులూరుకు చెందిన ప్రసాద్ తప్పించుకున్నట్లు సమాచారం. ఆత్మకూరు రేంజ్ పరిధిలోని మర్రిపాడు మండలం కదిరి నాయుడుపల్లి, చాబోలు, కృష్ణాపురం, మర్రిపాడు, సింగణపల్లి బీట్లు ఉన్నాయి. ఈ ప్రాంతాల నుంచి అడవి కర్ర వంటి వాటిని ఎవరూ తీసుకెళ్లకుండా, ఇతరులు అడవిలోకి రాకుండా పర్యవేక్షణ కోసం 10మంది బేస్ క్యాంప్ సిబ్బందిని అధికారులు నియమించుకొని ఉన్నారు. అయితే, ఈ పర్యవేక్షకులే ఈ అక్రమాలకు పాల్పడుతున్నట్లు సోమవారం వెలుగుచూసింది. ఎర్రచందనం దుంగల రవాణాలో ఈ ఐదుగురే కాకుండా ఇంకా ఎవరైనా ఉన్నరా!? అన్న కోణంలో విచారిస్తూ వారి ఫోన్లను టాస్క్‌ఫోర్సు బృందం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పట్టుబడిన వారు ఇప్పటికే పలుమార్లు ఎర్రచందనం తరలించినట్లు గుర్తించింది.

నగర వాసులకు మెరుగైన సేవలు

- ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాల అమలుకు కృషి
- బాధ్యతల స్వీకరణలో కమిషనర్ సూర్యతేజ



బాధ్యతలు స్వీకరించిన అనంతరం తన పేరిట మొక్క నాటి నీరు పోస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు (సిటీ), జూలై 24 : నెల్లూరు నగర వాసులకు మెరుగైన సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని, తనను స్వయంగా కలుసుకుని ప్రజలు తమ సమస్యలు తెలియజేయవచ్చని నగర పాలక సంస్థ నూతన కమిషనర్ మల్లవరపు సూర్యతేజ అన్నారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కమిషనర్‌గా కలెక్టర్ ఆనంద్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను అమలు చేసేందుకు చిత్తశుద్ధితో పని చేస్తానన్నారు. నెల్లూరు నగరాన్ని అన్నింటా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేసుకుని అందుకు అనుగుణంగా పని చేస్తానని చెప్పారు. అనంతరం కార్యాలయంలోని పలు విభాగాలను ఆయన పరిశీలించారు. కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌లను మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కార్పొరేషన్ కార్యాలయంలో తన పేరిట మొక్కనాటిన ఆయన తోటి ఉద్యోగులు కూడా ఇదేబాటలో నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం అన్నక్యాంటీన్ల ఏర్పాటుపై ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ సమీక్షించారు. కాగ, కొత్తగా నియమితులైన ఎంహెచ్‌వో డాక్టర్ చల్లా చైతన్య కూడా బుధవారం బాధ్యతలు చేపట్టి, కమిషనర్‌తో భేటీ అయ్యారు.





ఈ గుంతలను ఎప్పుడు పూడ్చుతారో!?

జిల్లాకు 1,300 గోకులం యూనిట్లు

నెల్లూరు (వ్యవసాయం), జూలై 24 : పాడిరైతులకు ఆర్థిక చేయూత అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయానికి అనుబంధంగా పాడిపరిశ్రమకు చేయూత అందిస్తూ 2014-19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పురుడు పోసుకున్న గోకులం పథకాన్ని తిరిగి పాడిరైతులకు చేరువ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాకు సుమారు 1300 యూనిట్లు కేటాయించింది. జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు చేయనున్నారు. ఇందులో సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాకు కేటాయించిన యూనిట్లను మండలాల వారీగా కేటాయింపులు ఇంకా చేయలేదని అధికారులతో సమీక్షించి కేటాయింపులు చేస్తామని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కోటేశ్వరరావు తెలిపారు. కాగా, సొంత స్థలం కలిగిన వారే ఈ పథకానికి అర్హులు.

'అమృత్ భారత్'కు 3 రైల్వే స్టేషన్ల ఎంపిక

- నెల్లూరు, గూడూరు, సూళ్లూరుపేట
- ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూలై 24 : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని మూడు రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేయనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ బుధవారం ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో ప్రత్యేకంగా విజయవాడ డివిజన్‌కు సంబంధించి 73 స్టేషన్లను ఈ పథకం లో చేర్చారు. ఈ జాబితాలో నెల్లూరుతో పాటు గూడూరు, సూళ్లూరు పేట రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఇప్పటికే పునరా భివృద్ధి పథకం ద్వారా రూ.102 కోట్లతో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. తాజాగా బడ్జెట్‌లో అమృత్ భారత్ పథకం కింద ప్రత్యేక నిధులతో ఈ మూడు స్టేషన్లను అభివృద్ధి చేయనున్నట్లు కేంద్రమంత్రి ప్రకటించారు.



నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషనులో జరుగుతున్న అభివృద్ధి పనులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : యూటీఎఫ్

వివరాలు 8

పండుగ ముగిసింది.. చెత్త మిగిలింది!

బారాషహీద్ దర్గాలో ఎంతో ఆర్భాటంగా రొట్టెల పండుగను నిర్వహించిన అధికారులు ఆ తర్వాత పారిశుధ్యం మెరుగు పరచడంలో చేతులెత్తేశారు. పండుగ ముగిసి రెండు రోజులు గడిచిపోయాయి. అయితే, దర్గా ప్రాంగణంలో ఎటుచూసినా చెత్తకుప్పలు పేరుకుపోయాయి. వివిధ పనుల కోసం తవ్విన గుంతలను కూడా అలాగే వదిలేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రమాదాలకు నిలయాలుగా మారకముందే గుంతలు పూడ్చాలని, చెత్తాచెదారం తొలగించాలని భక్తులు కోరుతున్నారు

- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నెల్లూరు





గుట్టలు పేరుకుపోయిన చెత్తాచెదారం


ఆత్మకూరు : ఇన్‌చార్జి ఎంపీడీవో ఉషారాణికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు


చేజర్ల : ఎంఈవో-2కి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ సభ్యులు


అనంతరసాగరం : తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : యూటీఎఫ్

ఆత్మకూరు, జూలై 24 : విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాధరం కోరారు. బుధవారం స్థానిక నేతలతో కలిసి ఇన్‌చార్జి ఎంపీడీవో టీ ఉషారాణికి, ఎంఈవో చలపతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 117ను రద్దుచేయాలని, ప్రీప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతులను ఒకే పాఠశాలలో నిర్వహించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్‌ను, ఒకే పరీక్ష విధానాన్ని అమలు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నేతలు మోహన్‌రావు, ఖాదర్‌బాష, హరికృష్ణ, మురళీకృష్ణ, జిలాని, బీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల : ఎంఈవో-2 డీసీ మస్తానయ్యకు యూటీఎఫ్ నాయకులు ఆర్‌వీ.కృష్ణారెడ్డి ఎస్.రమణయ్య, తదితరులు వినతిపత్రం అందజేశారు.

అనంతసాగరం : తహసీల్దారు నరసింహారావు, ఎంపీడీవో తాజ్ మస్రూర్‌లకు యూటీఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లురెడ్డి, మహబుబ్‌బాష, రంతుల్లా, సుబ్బరాయుడు, తాజ్‌వుద్దీన్ తదితరులు వినతిపత్రం అందించారు.

వరికుంటపాడు : విద్యా, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో నాయకులు వినతిపత్రాలు అందజేశారు. యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కరీముల్లా, సుబ్రమణ్యం, సుబ్బారావు, హరిశ్చంద్రప్రసాద్, కాంతారావు, దామోదరరావు, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దారుగా జహీర్‌ఖాన్


జహీర్‌ఖాన్

ఉదయగిరి రూరల్, జూలై 24: మండల ఇన్‌చార్జి తహసీల్దారుగా షేక్ జహీర్‌ఖాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు నెహ్రూబాబు బాపట్ల జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఉన్నతాధికారులు కార్యాలయంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న జహీర్‌ఖాన్‌ను ఇన్‌చార్జి తహసీల్దారుగా నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

తూము మరమ్మతులు పూర్తి

అనంతసాగరం, జూలై 24: ఎట్టకేలకు అనంతసాగరం చెరువు మొదటి తూము మరమ్మతులు పూర్తయినట్లు టీడీపీ మండలాధ్యక్షురాలు మునగపాటి సునీత, నాయకులు చల్లా శివారెడ్డి, కేతా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో ఈ పనులు జరిగాయన్నారు. దీంతో బుధవారం కాలువకు నీరు విడుదల చేసినట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

అనంతసాగరం, జూలై 24: తమ కాలనీలోని ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనంతసాగరం గిరిజన కాలనీవాసులు బుధవారం సీపీఎం నాయకులతో కలసి ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నయని, కాలనీలో విద్యుత్ సదుపాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా కొంత మేరకు పైపులు వేసి కాంట్రాక్టర్ వెళ్లిపోవడంతో నీటి సమస్యతో అల్లాడుతున్నామని చెప్పారు. అనంతరం ఎంపీడీవో తాజ్‌మస్రూర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అన్వర్‌బాష, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో భారీ అవినీతి

చేజర్ల, జూలై24: పుట్టుపల్లిలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో భారీ అవినీతి జరిగిందని సర్పంచి అమ్మినేని పురుషోత్తం నాయుడు పేర్కొన్నారు. బుధవారం గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. స్థానిక నాయకులతో ఫీల్డ్ అసిస్టెంట్ కలిసి పక్కా అవినీతికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఏపీవోకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అలాగే జగనన్న కాలనీలో బేస్‌మెంట్ వరకు పూర్తయితే శ్లాబు వరకు అయినట్లు బిల్లులు మంజూరు చేసుకుని దాదాపు రూ. 18 లక్షలకు పైగా అవినీతికి పాల్పడినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన అవనీతిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పొదుపును అలవాటు చేసుకోవాలి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్) : పల్లెప్రజలు పొదుపును అలవాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఉదయగిరి పోస్టల్ ఇనస్పెక్టర్ సాయికృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నందిపాడు సబ్ పోస్టాఫీసు పరిధిలోని తిమ్మానాయుడుపేట బ్రాంచ్ పోస్టాఫీసునందు తపాలా బీమా తీసుకొని మరణించిన కుటుంబ సభ్యులకు నగదు చెక్కులు పంపిణీ చేశారు. నందిపాడు సబ్ పోస్టుమాస్టర్ రేవూరు పెంచల నరసయ్య, బీపీఎం పెంచలనరసింహులు, ఏబీపీఎం ఖా జారంతుల్లా పాల్గొన్నారు.

మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసు

సంగం : మూడవ సచివాలయం పరిధిలోని వెంకటేశ్వరపురంలో పంచాయతీ అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవన నిర్మాణదారుడికి బుధవారం ఈవోఆర్డీ నోటీసులు అందచేశారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పంచాయతీ అనుమతి లేకుండా భవనాన్ని నిర్మిస్తున్నాడు. దీనిపై జూన్ 16న నిర్మాణదారుడికి నోటీసు అందచేశారు. అయినా లెక్కచేయకుండా పునాదులు ప్రారంభించారు. వాటిని పూడ్చాలని ఈనెల 15న రెండో నోటీసు అందచేశారు. నోటీసు తీసుకోకపోవడంతో పాత ఇంటి ప్రహరీకి అంటించారు. అయినా మళ్లీ బుధవారం నోటీసు ఇచ్చారు. మూడు రోజుల్లోపు వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

మొక్కుబడిగా ప్రత్యేక గ్రామసభలు

కలువాయి : తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రామసభలను మొక్కుబడిగా జరుపుతున్నారు. అన్నీ గ్రామాల్లోనూ ఈనెల 26 వరకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలి. ఈ సభలకు కీలకమైన మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ డుమ్మా కొట్టడం గమనార్హం. బుధవారం కలువాయిలో జరిగిన గ్రామసభకు కూడా ఆయన రాకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి మొక్కుబడి గ్రామసభల వల్ల ఉపయోగం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

మంత్రి లోకేష్‌తో టీడీపీ నేత కొమ్మి భేటీ



చేజర్ల, జూలై24: రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం రాత్రి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్మి లక్ష్మయ్య నాయుడు వెలగపూడిలోని సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై ఆయన చర్చించారు. లోకేష్‌ను కలిసిన వారిలో డాక్టర్ కొమ్మి ప్రదీప్, టీడీపీ నేత నరసింహారావులు కూడా ఉన్నారు.

● **ఉదయగిరి రూరల్:** రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరపు అచ్చెన్నాయుడిని బుధవారం సచివాలయం లో రాష్ట్ర స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు పీవీ రమణయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చేస్తున్న సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను వివరించారు. మంత్రిని కలిసిన వారిలో స్వచ్ఛంద సంస్థల రాష్ట్ర కార్యదర్శి పీకే ప్రకాష్, సలహాదారు మామిడిపల్లి బాలగంగాధర్, కార్యవర్గ సభ్యుడు వెంకటశ్రీనివాస్ తదితరులున్నారు.

బీసీ బాలికల గురుకులం మంజూరు

● త్వరలోనే ఆత్మకూరులో ప్రారంభం


ఆత్మకూరులో పాత మున్సిపల్ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు, జూలై 24 : ఆత్మకూరుకు బీసీ బాలికల గురుకుల పాఠశాల మంజూరైంది. అయితే నిర్వహణకు భవనాలు కొరవడ్డాయి. దీనికితోడు అద్దె భవనాలు సైతం అందుబాటులో లేక, ఆరేళ్లుగా ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో యుద్ధప్రాతిపదికన గురుకుల పాఠశాల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే 50 మంది 5వ తరగతి విద్యార్థులకు సీట్లు ఖరారయ్యాయి. విజయలక్ష్మిని ప్రిన్సిపాల్‌గా నియమించారు. త్వరితగతిన తరగతులు ప్రారంభించాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సైతం ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురుకులం ప్రారంభానికి అనువైన భవనం కోసం అధికారులు వెతుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో ఆర్డీవో కే మధులత, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి వై వెంకటయ్య, ఏబీసీడబ్ల్యూ ఎం శ్రీదేవి బుధవారం ఆత్మకూరులో పలు భవనాలను పరిశీలించారు.

త్వరలో ప్రారంభిస్తాం

ఆత్మకూరులో త్వరలో బీసీ బాలికల గురుకుల పాఠశాలను ప్రారంభిస్తాం. అందుకు అనువైన భవనం కోసం వెతుకులాడుతున్నాం. అనుకూలమైన భవనం ఎంపిక చేసిన వెంటనే గురుకులాన్ని ప్రారంభిస్తాం.

- వై వెంకటయ్య, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి

ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలి

సీతారామపురం, జూలై 24: మండల పరిధిలోని సింగారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని సచివాలయం వద్ద సర్పంచ్ దుర్గం సంపూర్ణ అధ్యక్షతన బుధవారం ఓడీఎఫ్, జలజీవన్ అంశాలపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గం సంపూర్ణ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలని ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామనాధరెడ్డి, ఈఓపీఆర్‌డి భార్గవి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

వరికుంటపాడు : ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మరుగుదొడ్ల గుర్తింపు సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రత్యేక ఆధార్ శిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకొనేలా చూడాలన్నారు. అనంతరం పంచాయతీల వారీగా నివేదికలను సేకరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనీమస్సి, ఈవోపీఆర్డీ సికిందర్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గంధ మహోత్సవ గోడపత్రికల ఆవిష్కరణ


గంధమహోత్సవం గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న దర్గా కమిటీ

ఉదయగిరి రూరల్, జూలై 24: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ ఔలియా వారి 219వ గంధమహోత్సవం గోడపత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ మాట్లాడుతూ వచ్చేనెల 2న సందల్‌మాలి కార్యక్రమంతో గంధమహోత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు రోజ్‌ధార్ మన్సూర్, కార్యదర్శి ఖాదర్‌బాషా, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ రియాజ్, కావ్య ట్రస్టు ప్రతినిధి సికిందర్, లియాఖత్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీటీసీ మృతి


మాదాల రామచంద్ర(ఫైల్)

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 24: మండలం లోని నర్రవాడ ఎంపీటీసీ, టీడీపీ సీనియర్ నాయకులు మాదాల రామచంద్ర (60) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. పని నిమిత్తం గత మూడు రోజుల క్రితం విజయవాడకు వెళ్లారు. ఈ క్రమంలో ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో సహచరులు హుటాహుటిన ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. ఆయన మృతిపట్ల మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

మాదాల మృతి బాధాకరం : కాకర్ల

ఉదయగిరి రూరల్, జూలై 24: దుత్తలూరు ఎంపీటీసీ మాదాల రామచంద్ర మృతి బాధాకరమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. విజయవాడలో గుండెపోటుకు గురై ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మాదాల మృతిచెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అసెంబ్లీ నుంచి హుటాహుటిన వైద్యశాలకు వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. మాదాల మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటని, వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

దుత్తలూరు మండలం నర్రవాడ ఎంపీటీసీ, టీడీపీ సీనియర్ నాయకుడు మాదాల రామ చంద్ర మృతి బాధాకరమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కలిగిరిలో ట్రాఫిక్ కష్టాలు

● పట్టించుకోని అధికారులు ● ప్రజల అవస్థలు


కూరగాయల దుకాణాల వద్ద రోడ్డుపై అడ్డదిడ్డంగా ఆటోలు

కలిగిరి, జూలై 24: పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతమైన కలిగిరమ్మ ఆలయం వద్ద ప్రతినిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో బాగా రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతంలో కూరగాయల మార్కెట్, వాణిజ్య దుకాణ సముదాయాలు, హోటళ్లు ఉండడంతో జనసంచారం బాగా ఉంటుంది. ఈ ప్రదేశం నుంచే విజయవాడ, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలకు మండలవాసులు ప్రయాణం చేస్తారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి ఒక్క కానిస్టేబుల్ కూడా కనిపించడు. కూరగాయల దుకాణాల ముందు నడిరోడ్డుపై ఆటోలు నిలిపి, కూరగాయలను దించడం, తరలించడం చేస్తారు. ఈ క్రమంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. కూతవేటు దూరంలో పోలీస్‌స్టేషన్ ఉన్నా వారు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసుశాఖ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని మండల వాసులు కోరుతున్నారు.

సొంత జిల్లాలకు వెళుతున్న తహసీల్దార్లకు సన్మానం

కావలి,జూలై24: తహసీల్దార్ నగేష్ సొంత జిల్లా పల్నాడుకు బదిలీ కావడంతో బుధవారం ఎన్డీఏ కూటమి నేతలు ఆయన్ను సత్కరించారు. తహసీల్దార్ నిజాయితీగా పనిచేసి ప్రశాంతంగా, సజావుగా ఎన్నికలు జరిగేందుకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, చవల రామకృష్ణ, గాదంశెట్టి వేణు, పల్లపు మోహన్, జనసేన నేత పొబ్బాసాయి విఠల్, తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : ఎన్నికలకు ముందు బాపట్ల జిల్లా నుంచి బదిలీ పై వచ్చిన తహసీల్దార్ జీ శ్రీచరణ్ బుధవారం రిలీవ్ అయ్యారు.ఈ సందర్భంగా కార్యాలయంలోని డీటీ టీ ప్రసాద్, వీఆర్‌వోలు, సిబ్బంది ఆయన్ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు.తనకు సహకరించిన సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అల్లూరు : తహసీల్దార్ దుర్గేశ్వరరావు బదిలీ అయ్యారు. ఆయనకు బుధవారం కార్యాలయ సిబ్బంది కార్యాలయంలో ఆయనకు ఘనంగా సత్కారం చేశారు. కార్యక్రమంలో డీటీ నాగలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సుధీర్, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : తహసీల్దార్ మస్తానయ్యను ఎంపీడీవో సుజాత కార్యాలయ సిబ్బంది బుధ వారం ఘనసన్మానం చేశారు. కార్యక్రమంలో డీటీ కోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జిలానీ బాషా, వీఆర్‌వోలు సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరు : ఎన్నికల్లో సబ్ కలెక్టరు కార్యాలయ డీఏవోగా బాధ్యతలు నిర్వహించి గుంటూరు జిల్లాకు బదిలీ అయిన తహసీల్దార్ కే రవిబాబుకు బుధవారం రాత్రి ఘనంగా వీడ్కోలు పలికారు. సబ్ కలెక్టరు జీ విద్యాధరి, కార్యాలయ సిబ్బంది ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ ఏ చిన్న అవాంఛనీయ ఘటన జరగకుండా ఎన్నికలను పూర్తిచేయటంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు.

● **సంగం :** తహసీల్దారు రమాదేవి బదిలీ కావడంతో కార్యాలయం సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ప్రకాశం జిల్లాకు చెందిన రమాదేవి ఆరు నెలల కిందట సంగ తహసీల్దారుగా నియమితులయ్యారు. బదిలీపై వెళ్తున్న రమాదేవి దంపతులను కార్యాలయ అధికారులు, సిబ్బంది పూలమాలలతో సత్కరించారు.

● **ఉదయగిరి రూరల్ :** ఉదయగిరి తహసీల్దారుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై బాపట్ల జిల్లాకు వెళ్లిన కె నెహ్రూబాబును బుధవారం అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు జహీర్‌ఖాన్, సీనియర్ అసిస్టెంట్ సందానీ, వీఆర్వోలు వెంకట్, జాఫర్, అంజాద్, బిల్లుపాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

వింజమూరు, జూలై 24 : రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల చాకలికొండలో శిక్ష సప్తాహలో భాగంగా క్రీడాదినోత్సవాన్ని వ్యాయామ ఉపాధ్యాయుడు వెలుగోటి కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆటలను నిర్వహించి వాటి ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పి విజయకుమారి, ఏ సుభాషిణి, టిసురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు కౌలు వేలం

లింగసముద్రం, జూలై 24: మండలంలోని పెదపవనిలో గల వేణుగోపాలస్వామి, మల్లీశ్వరస్వామి ఆలయ భూములకు బుధవారం కందుకూరు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వంశీ, ఈవో అన్నమ్మలు ఛైర్మన్ ముత్తినేని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కౌలు వేలం నిర్వహించారు. గ్రామంలో ఈ ఆలయాలకు 107 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. వేలంపాటలో మొత్తం 47 ఎకరాలకు రూ.2 లక్షలు పలికింది. కౌలు ఏడాదిపాటు ఉంటుందని ఇన్‌స్పెక్టర్ వంశీ చెప్పారు.మిగిలిన 60 ఎకరాలకు త్వరలో వేలం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఎం బాజీబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరచాలి

కొండాపురం, జూలై24: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు మెరగుపరచేందుకు కృషిచేయాలని ఎంఈవో కే.రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఆదిమూర్తిపురం ప్రధాన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసనాసామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలోని రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

బడ్జెట్‌లో సామాన్యుడికి శూన్యహస్తం

ఉలవపాడు, జూలై 24 : సంపన్నులకు వరాలు... సామాన్యులకు శూన్యహస్తం అందించినట్లుగా కేంద్ర బడ్జెట్ ఉందని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వ్యవసాయ రంగం, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతోపాటు కీలక రంగాలకు బడ్జెట్‌లో కోత విధించడాన్ని వ్యతిరేకిస్తూ పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకానికి నిధులు రూ.2 లక్షల కోట్లకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థుల సమగ్ర వికాసానికే శిక్షా సప్తాహ్

కావలిటౌన్, జూలై24: విద్యార్థుల సమగ్ర వికాసం కోసమే శిక్షా సప్తాహ్ కార్యక్రమమని డిప్యూటీ డీఈవో రఘురామయ్య పేర్కొన్నారు. బుధవారం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పిల్లలకు సాంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థికి విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక సేవాకార్యక్రమాల పట్ల పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఉపాధ్యాయిని సుమతి స్వయంగా పిల్లలకు చికెన్ బిర్యానీ ఏర్పాటు చేయగా, ఎంఈవో-2 వెంకటసుబ్బయ్యతో కలిసి ఆయన వడ్డించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని నీరజ, పీడీ చిరంజీవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ట్రాక్టర్ల పట్టివేత



లింగసముద్రం, జూలై 24: మండలంలోని అంగిరేకులపాడు మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం కందుకూరు సెబ్ అధికారులు, సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఉదయం 10 గంటలకు సెబ్ ఎస్సై దీప్తి కరంత్, సిబ్బంది పెదపవని గ్రామ శివారులో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సెబ్ ఎస్సై దీప్తి కరంత్ ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం బాజీబాబు కేసు నమోదు చేశారు.

ఫ్యాన్ల బహూకరణ

కందుకూరు, జూలై 24: పట్టణంలోని అయ్యప్పస్వామి గుడివద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవనానికి దోనపల్లి రామారావు,లలితకుమారి దంపతులు 11 ఫ్యాన్లను బుధవారం బహూకరించారు. అయ్యప్పస్వామి సేవా సంఘం ప్రతినిధులు నలబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామిలకు వాటిని అందజేశారు.

జగన్ డ్రామాలు కట్టిపెట్టాలి

కందుకూరు, జూలై 24: రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయం సాధించి రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతున్న తరుణంలో మాజీ సీఎం జగన్మోహనరెడ్డి ఢిల్లీలో ధర్నా పేరుతో డ్రామాలకు తెరతీశాడని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రాభివృద్ధిని చూసి జగన్ తట్టుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జగన్ నీచపు ఆలోచనలు మానుకుని రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

కలుగోళ శాంభవికి సారె సమర్పణ


సారె తీసుకువస్తున్న ఆర్యవైశ్య మహిళలు

కావలి, జూలై24: గ్రామ దేవత కలుగోళ్ల శాంభవికి ఆషాడమాసం సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్య మహిళలు బుధవారం సారె సమర్పించారు. శ్రీ భ్రమరాంబిక సేవా సమితి (చీరాల) సారధ్యంలో ప్రతి ఏటా అమ్మ వారికి సారె తీసుకురావడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉత్తరంపేట రామాలయం నుంచి మహిళలు సారెతో ప్రదర్శనగా వచ్చి తొలుత గంగమ్మ, పోలేరమ్మకు పూజలు చేశారు. అనంతరం కలుగోళ్ల శాంభవి ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు. కార్యక్రమంలో ఓం నమఃశివాయ బృందం సభ్యులు అనుమలిశెట్టి కామాక్షి, సునీత, కిరణ్మయి, నేరెళ్ల సుధారాణి, దుగ్గిశెట్టి హేమలత, లక్ష్మీ, కల్లిపల్లి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు నివాళి


నివాళులు అర్పిస్తున్న నందనవనం తదితరులు

కలిగిరి, జూలై 24: కార్గిల్ యుద్ధ వీరులకు వందనాలు సమర్పిస్తూ స్థానిక శివాలయం వద్ద జాతీయ అత్యుత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత నందనవనం ప్రభాకరరావు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో కొవ్వత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నందనవనం మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో 527మంది సైనికులు వీరమరణం పొందడమే కాకుండా, 1374మంది క్షతగాత్రులయ్యారన్నారు. పాక్‌పై విజయానికి గుర్తుగా ప్రతిఏడాది కార్గిల్ విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత బిజ్జం కృష్ణారెడ్డి, జిర్రా పెదఅంకిరెడ్డి, కొప్పోలు కొండలరావు, నాగిరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో పనిచేస్తే అద్భుత విజయాలు


ఆర్టీసీ గ్యారేజీలో స్టోర్ రూమును పరిశీలిస్తున్న ఆర్ఎం

కావలి, జూలై24: ఇష్టంతో కష్టపడి పనిచేస్తే అద్భుత విజయాలు సాధించవచ్చని ఆర్టీసీ ఆర్ఎం జీ. విజయరత్నం తెలిపారు. బుధవారం ఆయన ఆర్టీసీ డిపోలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. మొదటిసారిగా ఆర్ఎం కావలికి రావటంతో పలు ఉద్యోగసంఘాల నాయకులు సత్కరించారు. అనంతరం జరిగిన ఉత్తమ ఉద్యోగుల అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. అత్యధికంగా ఇంధనపొదుపు సాధించిన డ్రైవర్లు బాలకోటయ్య, చెంచయ్యలను సత్కరించి నగదు అందచేశారు. కార్యక్రమంలో డీఎం రాపూరు శ్రీనివాసులు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం. రామకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్‌కే ఖాజామొహిద్దీన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి సారించాలి


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో

కావలి రూరల్, జూలై 24: చెత్త నుంచి సంపద సృష్టించడంపై ప్రతీఒక్కరు దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మండలంలోని రుద్రకోట పంచాయతీని బుధవారం సందర్శించారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాన్నారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని గ్రామంలో మొక్కల పెంపకం చేపట్టాన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహేశ్వరి, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు నివాళి


జాషువాకు టీడీపీ నేతల నివాళి

కందుకూరు : కవికోకిల గుర్రం జాషువా వర్ధంతిని బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఎస్సీ సెల్ నాయకులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెబ్బవరపు మాల్యాద్రి, రాయపాటి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, ముచ్చు శ్రీను, బద్దిపూడి శిఖామణి పాల్గొన్నారు.

● **కంపచెట్ల తొలగింపు**

కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు శ్మశానవాటికల్లో బుధవారం కంపచెట్ల తొలగింపును మున్సిపల్ అధికారులు చేపట్టారు. శ్మశానవాటికల్లో దట్టంగా కంపచెట్లు పెరిగి మృతదేహాలను తీసుకెళ్లే అవకాశం లేకపోవడంతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. రెండురోజులుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.